PRAJASAKTI Regd.No. 15795/68

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 44 సంచిక : 88 | విజయవాడ, బుధవారం 30 అక్టోబర్ 2024 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 30 October 2024 | Rs

సోషలిజాన్ని ఎలుగెత్తి చాటుతున్న క్యూబా

- యావత్తు ప్రపంచానికి స్ఫూర్తిదాయకం
- బీజింగ్‌లోని క్యూబా సంఘీభావ సదస్సులో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు

7

మంధాన మెరుపు శతకం

మూడో వన్డేలో ఆరు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలుపు

వన్డే సిరీస్ 2-1తో టీమిండియా కైవసం

8

54 'సీమ' మండలాల్లో కరువు

- నోటిఫై చేసిన ప్రభుత్వం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాయలసీమలోని 54 మండలాలను కరువు మండలాలుగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించింది. ఈ మేరకు రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్‌పి సిసోడియా మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విడుదల చేసిన ఈ నోటిఫికేషన్‌లో రాయలసీమలోని కర్నూలు, అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నట్లు పేర్కొన్నారు. నైరుతి రుతుపవనాల సీజన్‌లో ఈ జిల్లాల్లోని అనేక ప్రాంతాల్లో అతి స్వల్ప వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. కేంద్ర వ్యవసాయశాఖ కరువు నిబంధనల ప్రకారం జిల్లా కలెక్టర్లు పంపిన నివేదికల (పంట నష్టం 33 శాతం, అంతకంటే ఎక్కువ) ఆధారంగా కరువు మండలాల ప్రకటన చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు. ప్రస్తుతం ప్రకటించిన 54 మండలాల్లో 27 మండలాల్లో తీవ్ర కరువు, మరో 27 మండలాల్లో మధ్యస్థ కరువు నెలకొన్నట్లు పేర్కొన్నారు. కర్నూలు జిల్లాలో 2, అనంతపురం 7, శ్రీసత్యసాయి 10, అన్నమయ్య 19, చిత్తూరు 16 మండలాల్లో కరువును ప్రకటించారన్నారు. విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ విడుదల చేసిన ప్రకటనలో నైరుతి రుతుపవనాల్లో రాష్ట్ర సాధారణ వర్షపాతం 574.7 మిల్లీమీటర్లు ఉండగా, 681.6 మిల్లీమీటర్లు వర్షపాతం కురిసిందని, అయినప్పటికీ కొన్ని మండలాల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం, డ్రైస్పెల్ నమోదైందని వివరించారు.

జిల్లాల వారీ కరువు మండలాలు

కర్నూలు : కౌతాళం, పెద్దకడుబూరు

అనంతపురం : నార్పల, అనంతపురం విడపనకల్లు, యాడికి, గార్లదిన్నె, బికె సముద్రం, రాప్తాడు

శ్రీసత్యసాయి : తాడిమర్రి, ముదిగుబ్బ, తలుపుల, కనగానిపల్లి, ధర్మవరం, నంబులపూలకుంట, గాండ్లపెంట, బుక్కపట్నం, రామగిరి, పరిగి

అన్నమయ్య : గాలివీడు, చిన్నమండె, సంబేపల్లి, టి సుందరపల్లె, రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రామాపురం, వీరబల్లె, తంబళ్లపల్లి, గుర్రం కొండ, కలకాడ పీలేరు, కలికిరి, వాల్మీకీపురం, కురబలకోట, పెద్ద తిప్పసముద్రం, బి కొత్తకోట, మదనపల్లె, నిమ్మనపల్లె

చిత్తూరు : పెనుమూరు, యాదమరి, గుడిపాల, శ్రీరంగరాజపురం, చిత్తూరు, శాంతిపురం, రొంపిచెర్ల, పూతలపట్టు, సోమల, పుంగనూరు, పలమనేరు, బైరెడ్డిపల్లి, వెంకటగిరి కోట, గుడుపల్లె, కుప్పం, రామకుప్పం

రైతు సేవా కేంద్రాల కుదింపు

- రేషనలైజేషన్ పేరిట వేల సెంటర్లు రద్దు
- సిబ్బంది మెడపై కత్తి
- భవనాలు, మౌలిక సదుపాయాల ఖర్చు వృథా
- వైసిపి ప్రభుత్వంలోనే కసరత్తు
- పాత ఉత్తర్వులు బయటికి తీసిన టిడిపి కూటమి సర్కారు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

గత వైసిపి ప్రభుత్వం రైతుల కోసం గ్రామాల్లో నెలకొల్పిన రైతు భరోసా కేంద్రాల (ఆర్‌బికె) పేరును రైతు సేవా కేంద్రాలు (ఆర్‌ఎస్‌కె)గా మార్పు చేసిన టిడిపి కూటమి ప్రభుత్వం వాటిని తగ్గించేందుకు రంగం సిద్ధం చేసింది. వాటిలో పని చేసే సిబ్బంది పైనా కత్తి దూసింది. సిబ్బందిని అటూ ఇటూ మార్చి, అదనంగా ఉన్న వారిని వేరే కార్యక్రమాలకు కేటాయిస్తోంది. అక్కడికి ఇక్కడికి సర్దుబాట్లు చేస్తోంది. ఈ ప్రక్రియకు హేతుబద్ధీకరణ (రేషనలైజేషన్), క్రమబద్ధీకరణ (స్ట్రీమ్‌లైనింగ్) అని చెబుతోంది. రాష్ట్రంలో 10,778 ఆర్‌ఎస్‌కెలు ఉండగా, రేషనలైజేషన్‌లో రెండు వేల వరకు రద్దు కానున్నాయని అంచనా. కాగా ఈ కసరత్తు గత ప్రభుత్వంలో నిరుడు ఖరీఫ్ సమయంలోనే మొదలైంది. కూటమి ప్రభుత్వం ఆర్‌కెఎస్‌ల సేవలను క్రమంగా తగ్గించాలని తలచింది. నేరుగా తామే ఆ పని చేస్తే రాజకీయంగా, ఉద్యోగుల పరంగా ఇబ్బందులొస్తాయని భావించి గతంలో వైసిపి సర్కారు ఇచ్చిన ఉత్తర్వులను వ్యూహాత్మకంగా బయటికి తీసింది. ప్రస్తుత ఖరీఫ్ లోపు రేషనలైజేషన్ పూర్తి కావాలని గడువు విధించింది. అక్టోబర్ 29 డెడ్‌లైన్ విధిస్తూ గత మార్గదర్శకాలను ఉటంకిస్తూ వ్యవసాయశాఖ కమిషనర్ కిందికి మెమో ఇచ్చారు. అప్పుడు కసరత్తు చేసి మధ్యలో నిలిపేసిన జాబితాలనే జిల్లా అధికారులు కమిషనర్‌కు పంపుతున్నట్లు సమాచారం.

హేతుబద్ధత శూన్యం

గతంలో ఒక్కో గ్రామ సచివాలయం పరిధిలో ఒక ఆర్‌ఎస్‌కె అనగా రేషనలైజేషన్ అనంతరం రెండు మూడు సచివాలయాలకు ఒకటి అవుతోంది. ఒక సచివాలయానికి ఒక కేంద్రం అని కూడా అంటున్నారు. అర్బన్‌లో, సెమీ అర్బన్‌లో, పెద్ద గ్రామ పంచాయతీలలో ఎన్ని వార్డు సెక్రెటేరియట్‌లు ఉన్నా ఒక్క ఆర్‌ఎస్‌కెకి పరిమితం చేశారు. ఒక ఆర్‌ఎస్‌కె పరిధిలో సరాసరి మైదాన ప్రాంతాల్లో వెయ్యి-1,500 ఎకరాల విస్తీర్ణం, ఏజెన్సీలో 600-800 ఎకరాలుగా నిర్ణయించారు. కాగా ఈ గైడ్‌లైన్స్ చాలాచోట్ల గతంలో అమలు చేయలేదు. అత్యధికంగా 3 వేల ఎకరాల వరకు, అతి తక్కువ 600 ఎకరాలుగా పరిధులు నిర్ణయించారు. మార్గదర్శకాల ప్రకారం హార్టికల్చర్ పంటలు అత్యధికంగా ఉన్న చోట విలేజి హార్టికల్చర్ అసిస్టెంట్ (విహెచ్‌ఎ), సెరీ కల్చర్ ఎక్కువుంటే విలేజి సెరీకల్చర్ అసిస్టెంట్ (విఎస్‌ఎ), మిగతాచోట్ల విలేజి అగ్రికల్చర్ అసిస్టెంట్ (విఎఎ)ని వేయాలి. కసరత్తులో పంటలతో నిమిత్తం లేకుండా సిబ్బందిని కేటాయించారు.

ఎంప్లాయీస్ ఆందోళన

సిబ్బంది హేతుబద్ధీకరణలో విఎఎ, విహెచ్‌ఎ, విఎస్‌ఎ, ఎఇఒ, ఎంపిఇఒలను పరిగణనలోకి తీసుకున్నారు. విఎఎలు 6,218, ఎఇఒలు 904, ఎంపిఇఒలు 1,396 వెరశి 8,518 మంది ఉన్నారు. వీరిలో ఎఇఒలను అగ్రి ల్యాబ్‌లకు వేయగా ఇంకా 357 మంది మిగులుతారు. వీరిని సచివాలయాల్లో సర్దుబాటు చేస్తారు. విహెచ్‌ఎలు 2,352 మంది, విఎస్‌ఎలు 374, హార్టికల్చర్ ఎంపిఇఒలు 77 మంది ఉన్నారు. ఇంకా కొన్ని కేంద్రాల్లో సిబ్బంది లేరు. అప్పట్లో ఎఇఒలు, ఎంపిఇఒలను వేశారు. రేషనలైజేషన్‌లో అర్బన్ ఆర్‌బికెలలో తప్పనిసరిగా ఎఇఒలు, ఎంపిఇఒలనే వేయాలని నిబంధన పెట్టారు. అదనపు సిబ్బందిని అవసరాలకనుగుణంగా సర్దుబాటు చేస్తామంటున్నారు. అయినప్పటికీ తమను ఉంచుతారా తీసేస్తారా అనే ఆందోళన సిబ్బందిలో బయలుదేరింది.

ప్రజాధనం వృథా

అన్ని హంగులతో ఆర్‌ఎస్‌కెలకు సొంత భవనాల నిర్మాణం గత ప్రభుత్వంలో చేపట్టారు. ఇప్పటికి 10 వేలకుపైన బిల్డింగ్‌ల కనస్ట్రక్షన్ మొదలు పెట్టగా, రెండు వేల వరకు పూర్తయ్యాయి. మిగతావి వివిధ దశల్లో ఉన్నాయి. సగానికిపైన కేంద్రాలు ఇప్పటికీ అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ప్రభుత్వం నెలల పర్యంతం అద్దెలు బకాయి పడింది. కాగా రేషనలైజేషన్‌లో సొంత భవనం ఉన్న కేంద్రాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ఎత్తేసే వాటి కోసం చేపట్టిన నిర్మాణాలను ఏం చేస్తారనే ప్రశ్న వస్తోంది. అలానే వదిలేస్తే ఇప్పటికి చేసిన ఖర్చు చేసిన నిధులు వృథా అవుతాయి. అన్ని కేంద్రాల్లో కియోస్క్, టివి, కంప్యూటర్లు, విలువైన ఫర్నీచర్ ఏర్పాటుకు గతంలో బాగానే ఖర్చు చేశారు. ఒక్కొక్క కేంద్రంలో మౌలిక వసతులకు కనీసం రూ.10 లక్షల వరకు వ్యయం చేశారని అంచనా. కేంద్రాలను ఎత్తేస్తే విలువైన ఆ పరికరాల పరిస్థితేంటో అర్థం కాకుండా ఉంది. ఎరువుల గోదాముల్లో వాడుకోమంటున్నారని అధికారులు వెల్లడించారు.

మహారాష్ట్రలో ముగ్గురు సిపిఎం అభ్యర్థుల

నామినేషన్

- వేలాది మందితో ప్రజా ర్యాలీ

7

అచ్యుతాపురంలో ఇఎస్ఐకి శంకుస్థాపన

- ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలు, తొండంగిలో ఫార్మా ప్రారంభం
- వర్చువల్‌గా పాల్గొన్న మోడీ

ప్రజాశక్తి- యంత్రాంగం

ధన్వంతరి జయంతి, ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ మంగళవారం వర్చువల్‌గా అనకాపల్లి జిల్లా అచ్యుతాపురంలో ఇఎస్ఐ ఆస్పత్రికి శంకుస్థాపన చేశారు. కాకినాడ జిల్లా తొండంగి మండలం ఎవి నగర్‌లో లైఫియస్ ఫార్మ కంపెనీని, గుంటూరు జిల్లా మంగళగిరి ఎయిమ్స్‌లో డ్రోన్ సేవలను ప్రారంభించారు. ఇఎస్ఐ ఆస్పత్రి శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ రాష్ట్రానికి ఏడు ఇఎస్ఐ ఆస్పత్రులు మంజురయ్యాయని తెలిపారు. అచ్యుతాపురంలో రూ.69 కోట్లతో ఆస్పత్రి నిర్మాణ పనులు మూడు సంవత్సరాల్లో పూర్తి కానున్నాయన్నారు. మంగళగిరి మండలం నూతక్కిలోని గర్భిణి నుండి సేకరించిన రక్త నమూనాలను డ్రోన్ ద్వారా తొమ్మిది నిమిషాల వ్యవధిలో తీసుకొచ్చినట్లు ఎయిమ్స్ వైద్యులు తెలిపారు. లైఫియస్ ఫార్మ ఫ్యాక్టరీలో జరిగిన ప్రారంభోత్సవంలో కాకినాడ ఎంపి తంగెళ్ల మాట్లాడుతూ 135 ఎకరాల్లో రూ.2,500 కోట్లతో ఈ పరిశ్రమ ఏర్పాటైనట్లు తెలిపారు. యాంటీబయాటిక్ పెన్సిలిన్‌ను ఉత్పత్తి చేస్తుందని తెలిపారు.

ఆవిష్కరణ అనంతరం సుందరయ్య విగ్రహం వద్ద వి.శ్రీనివాసరావు, తులసీదాస్ తదితరులు

సుందరయ్య స్ఫూర్తితో కొత్త రాజకీయ వ్యవస్థ

- వి శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

దక్షిణ భారత కమ్యూనిస్టు ఉద్యమ నిర్మాత, తెలంగాణ సాయుధ పోరాట సారథి పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో ఒక కొత్త రాజకీయ వ్యవస్థను సృష్టించాల్సిన అవసరం ఉందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శ్రీకాకుళంలోని శాంతినగర్ కాలనీలోగల స్వాతంత్ర్య సమరయోధుల స్మృతివనంలో ఏర్పాటు చేసిన సుందరయ్య విగ్రహాన్ని మంగళవారం ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ప్రస్తుత రాజకీయాలపై యువతకు జుగుప్స కలిగిస్తున్న తరుణంలో స్వాతంత్ర్య సమరయోధుల వారసత్వాన్ని పునరుద్ధరించి అసమానతలు, అవినీతికి తావులేని సమాజం కోసం అంతా పాటుపడాలని పిలుపునిచ్చారు.

జాతిపిత మహాత్మాగాంధీ పిలుపుతో సుందరయ్య చదువును సైతం విడిచిపెట్టి స్వాతంత్ర్య పోరాటంలో భాగస్వామ్యమయ్యారని గుర్తు చేశారు. దేశానికి స్వాతంత్ర్యం రావాలని ఎంతగా కోరుకున్నారో అసమానతలు లేని సమాజం కోసం అంతగా పాటుపడ్డారని వివరించారు. సమ సమాజం కోసం సోషలిజం తప్ప, మరో ప్రత్యామ్నాయం లేదని భావించిన సుందరయ్య తన యావజ్జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ మిగతా 7లో

షర్మిలకు అన్యాయం జరిగింది

- ఆస్తుల్లో జగన్, షర్మిలకు సమాన వాటా : విజయమ్మ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఒక బిడ్డ.. ఇంకో బిడ్డకు అన్యాయం చేస్తుంటే చూసి తట్టుకోవడం చాలా కష్టమని, తల్లిగా అన్యాయం జరిగిన షర్మిల పక్షాన నిలిచి మాట్లాడటం తన విధి అని వైఎస్ విజయమ్మ పేర్కొన్నారు. ఎంఒయు ప్రకారం జగన్‌కు 60 శాతం, షర్మిలకు 40 శాతం అయితే ఎంఒయుకు ముందు డివిడెంట్ సమానంగా ఎందుకు తీసుకున్నారని మంగళవారం విడుదల చేసిన లేఖలో ప్రశ్నించారు. ఆస్తుల విషయంలో జరిగిన ఒప్పందాలన్నింటికీ తానే ప్రత్యేక్ష సాక్షినన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఉండగా ఆస్తులు పంపకం జరగలేదని, ఉన్న ఆస్తులను ఒక్కొక్కరూ ఒక్కొక్కటి పర్యవేక్షించే వారని వెల్లడించారు. ఈ విషయంలో విజయసాయి, సుబ్బారెడ్డి, మరికొందరు ఎన్నో అసత్యాలు చెప్పారని తెలిపారు. వైఎస్ఆర్ బతికుండగానే ఆస్తులు పంచారని, షర్మిలకు ఇచ్చిన ఆస్తులు అంటూ కొన్నింటి జాబితాను చెప్పుకొచ్చారని, జగన్ ఆస్తులు లిస్టు కూడా చెప్పాల్సిందన్నారు. వైఎస్ఆర్ చేసింది ఆస్తుల పంపకం ముమ్మాటికీ కాదన్నారు. కొన్ని ఆస్తులను ఇద్దరి పేర్ల మీద పెట్టారన్నారు. విజయసాయికి ఆడిటర్‌గా అన్నీ తెలుసని, సుబ్బారెడ్డి ఎంఒయుపై సాక్షి సంతకం చేశారని, అయినా మీడియాతో అవాస్తవాలు చెప్పడం బాధ కలిగించిందన్నారు. ఈ అంశానికి ముగింపు పలకడానికి నిజం వెల్లడిస్తున్నానని, ఆస్తులు నా ఇద్దరి బిడ్డలకు సమానమని, నలుగురు చిన్నబిడ్డలకు సమానంగా ఉండాలన్నది వైఎస్ఆర్ చెప్పారన్నారు. 2019లో జగన్ సిఎం అయిన రెండు నెలలకు ఇజ్రాయిల్‌లో విడిపోవాలని ప్రతిపాదన తీసుకొచ్చారని, ఆ ప్రకారం విజయవాడలో తన సమక్షంలో ఆస్తులు ఎవరెవరికి ఏవనేదానిపై అంగీ కారానికి వచ్చారని, అప్పుడు ఎంఒయు తయారు చేసినట్లు చెప్పారు. హక్కు ఉంది కాబట్టే షర్మిలకు రూ.200 కోట్లు డివిడెంట్లు ఇచ్చారని, హక్కు ఉంది కాబట్టే ఎంఒయు రాశారని తెలిపారు. ఇవి జగన్ గిఫ్ట్‌గా ఇస్తున్నవి కాదని స్పష్టం చేశారు. అటాచ్‌మెంట్‌లో లేని ఆస్తుల విషయంలో షర్మిలకు అన్యాయం జరిగిందని, భారతి సిమెంట్స్, సాక్షి మీడియా, వైఎస్ఆర్ ఇల్లు వంటివి కేసుల అనంతరం ఇవ్వాల్సి ఉందన్నారు. వైఎస్ఆర్ కుటుంబం గురించి, బిడ్డల గురించి తక్కువ చేసి మాట్లాడొద్దని కోరారు. ముఖ్యంగా సోషల్ మీడియాలో కల్పిత కథలు రాయొద్దని, దూషణలు చేయొద్దని కోరారు. అన్నా, చెల్లెలు ఇద్దరూ తెలుసుకుంటారని, వారిని రెచ్చగొట్టొద్దని విజ్ఞప్తి చేశారు. కుటుంబ ఆస్తుల విషయంలో అబద్ధాల పరంపర కొనసాగకూడదని, ఇది పిల్లలిద్దరికే కాదు, రాష్ట్రానికి మంచిది కాదన్నారు.

ప్రజలను పక్కదోవ పట్టించడమే

- విజయమ్మ లేఖపై వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ పార్టీ అధినేత వైఎస్ జగన్‌ను లీగల్‌గా ఇబ్బందిపెట్టి తద్వారా బెయిల్ రద్దుకు జరిగిన కుట్ర వ్యవహారాన్ని విజయమ్మ లేఖలో కనీసం ప్రస్తావించకపోవడం ప్రజలను పక్కదోవ పట్టించడమేనని వైసిపి విమర్శించింది. విజయమ్మ లేఖకు ప్రతిస్పందనగా వైసిపి మంగళవారం ఒక లేఖ రాసింది. షర్మిల భావోద్వేగాలు, ఒత్తిళ్ల ప్రభావంతో సరస్వతి కంపెనీ వ్యవహారంలో న్యాయపరంగా ఇబ్బందులు వచ్చి, స్వయంగా కుమారుడి బెయిల్ రద్దు కుట్రకు దారితీస్తుందని తెలిసి కూడా షేర్ల సర్టిఫికెట్లు పోయాయని చెబుతున్నారని పేర్కొంది. ఎవరికీ తెలియకుండా షేర్లను బదిలీ చేయడం ద్వారా షర్మిలతోనే విజయమ్మ ఉన్నారని మరోసారి స్పష్టంగా చెప్పారని తెలిపింది. లేఖలో ఈ అంశాన్ని పూర్తిగా విస్మరించడం ప్రజలను, వైసిపి అభిమానులను పక్కదోవ పట్టించడమే కదా అని ప్రశ్నించింది. చంద్రబాబుకు రాజకీయంగా మేలుచేసేలా వ్యవహరించడం ధర్మమేనా అని నిలదీసింది. తల్లిగా తటస్థవైఖరిని మరిచి పక్షపాతం వహించిన వైనంపై వైసిపి అభిమానులు తీవ్రంగా కలతచెంది బాధపడ్డారని పేర్కొంది. షర్మిల వేసిన మిగతా 5లో

గవర్నర్‌తో చంద్రబాబు భేటీ

- అసెంబ్లీ సమావేశాలపై చర్చ?

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంగళవారం కలిశారు. తన సతీమణి భువనేశ్వరితో కలిసి విజయవాడలోని రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవల అస్వస్థతకు గురైన గవర్నర్ సతీమణి సమీరా నజీర్ ఆరోగ్య పరిస్థితిని చంద్రబాబు, భువనేశ్వరి అడిగి తెలుసుకొని త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం గవర్నర్, సిఎం ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

గవర్నర్ అబ్దుల్ నజీర్‌కు బొకే అందిస్తున్న సిఎం చంద్రబాబు

అసెంబ్లీ సమావేశాల నిర్వహణతోపాటు రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయాలపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగు నెలలు గడిచినా ఇప్పటి వరకు పూర్తిస్థాయి బడ్జెట్ ప్రవేశపెట్టలేదు. పూర్తి స్థాయి బడ్జెట్ రూపకల్పనపై ఆర్థిక శాఖ అధికారులు ఇప్పటికే కసరత్తు చేస్తున్నారు. బడ్జెట్‌లో పొందు పరిచిన అంశాలను గవర్నర్‌కు సిఎం చంద్రబాబు వివరించినట్లు సమాచారం. నవంబర్ 11 నుంచి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు నిర్వహించాలనే అంశంపై ఇరువురి మధ్య చర్చ జరిగినట్లు తెలిసింది. సమావేశం తొలిరోజు హాజరై ప్రసంగించాలని గవర్నర్‌ను చంద్రబాబు కోరారు. రాష్ట్రంలో ఇటీవల చోటుచేసుకుంటున్న పరిణామాలను సైతం సిఎం వివరించినట్లు తెలిసింది. మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలు, ఇందుకు సంబంధించిన కేసులు, చట్టపరంగా ప్రభుత్వం తీసుకున్న చర్యలను వివరించినట్లు సమాచారం.

ఉత్తర గాజాలో ఇజ్రాయిల్ భయానక దాడులు

- 109 మంది మృతి
- సైన్యం చేతిలో బందీలుగా 200 మంది పాలస్తీనీయులు

కైరో: ఉత్తర గాజాలోని బీట్ లాహియాలో ఇజ్రాయిల్ వైమానిక దాడిలో 109 మంది మరణించారు. మరో 115 మంది గాయపడ్డారు. ఈ దాడిలో అయిదంతస్తుల భవనం నేలమట్టమైనట్లు రెస్క్యూ సిబ్బంది తెలిపారు. మృతుల్లో పలువురు మహిళలు, చిన్నారులు ఉన్నారు. అక్టోబరులో ఉత్తర గాజాలో ఇజ్రాయిల్ సైనిక కార్యకలాపాలు తిరిగి ప్రారంభించిన తర్వాత ఇది అత్యంత ఘోరమైన దాడిగా పేర్కొంటున్నారు. కొన్ని రోజుల దాడుల తర్వాత ఉత్తర గాజా స్ట్రిప్‌లోని ఏకైక ఆస్పత్రి నుండి ఇజ్రాయిల్ దళాలు ఉపసంహరించుకున్నాయి. జబాలియాలోని కమల్ అద్వాన్ ఆస్పత్రి డైరక్టర్ హుస్సామ్ అబు సఫియా మాట్లాడుతూ, సిబ్బంది కొరత, మందుల కొరత కాంఇంగా రోగులకు వైద్యం చేయడం కష్టమని, దాడిలో గాయపడిన చిన్నారులు చికిత్సపొందుతున్నారని తెలిపారు. బీట్ లాయిహయా సెటిల్మెంట్‌పై జరిగిన దాడిలో మహిళలు, చిన్నారులు సహా 73 మంది చనిపోయారు. వీరంతా గూడు కోల్పోయి దిక్కుతోచని స్థితిలో ఉన్న అమాయక పాలస్తీనా పౌరులే.

విజిలెన్స్ కమిషనరుగా అనిల్ చంద్ర పునీత

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర విజిలెన్స్ కమిషనరుగా అనిల్ చంద్ర పునీతను ప్రభుత్వం నియమించింది. ఆయన నియామకానికి గవర్నరు ఆమోదం తెలిపారు. అనిల్ చంద్ర పునీత గతంలో సిసిఎల్‌ఎ కమిషనరుగా పనిచేశారు. 2019లో ఉద్యోగ విరమణ పొందారు. అనంతరం 2022 జనవరి 5 నుంచి 2024 మే 9 వరకు ఉత్తరాఖండ్ చీఫ్ ఇన్ఫర్మేషన్ అధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు.

26న ర్యాలీలను జయప్రదం చేయాలి

- కార్మిక, కర్షక సంఘాల పిలుపు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

అన్ని పంటలకూ సి2ప్లస్ 50 శాతం ప్రకారం మద్దతు ధరల అమలుకు గ్యారెంటీ ఇస్తూ చట్టం చేయాలని, విద్యుత్ రంగం ప్రైవేటీకరణ, స్మార్ట్ మీటర్లను ఉపసహరించాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలని కోరుతూ నవంబరు 26న అన్ని జిల్లా కేంద్రాల్లో నిర్వహించే ర్యాలీలను జయప్రదం చేయాలని రైతు, కార్మిక ప్రజా సంఘాల సమావేశం పిలుపునిచ్చింది. విజయవాడలోని గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఎపి రైతు సంఘాల సమన్వయ కమిటీ కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు అధ్యక్షతన సమావేశం జరిగింది. సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ అక్టోబరు 16న సంయుక్త కిసాన్ మోర్చా, అఖిల భారత ట్రేడ్ యూనియన్ల జాయింట్ సమావేశం ఢిల్లీలో జరిగిన రైతు ఉద్యమం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాతపూర్వకంగా ఇచ్చిన హామీలు నెరవేర్చలేదన్నారు. నవంబరు 26న ట్రేడ్ యూనియన్లు, రైతు సంఘాలు, అనుబంధ సంఘాలు కలిసి కేంద్ర ప్రభుత్వానికి హెచ్చరిక చేయాలని పిలుపునిచ్చారు. సమగ్ర పంటల బీమా ప్రభుత్వ సంస్థల ద్వారా అమలు చేయాలని, ప్రీమియం మొత్తాన్ని ప్రభుత్వమే చెల్లించాలని, రైతులు, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులకు నెలకు రూ.10 వేలు ఇచ్చే విధంగా పెన్షన్ చట్టం చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపడంతోపాటు సొంత గనులు కేటాయించాలని, నాలుగు లేబర్ కోడ్‌లను ఉపసంహరించాలనే డిమాండ్లను సమావేశం ఆమోదించింది. ఈ సమావేశంలో కార్మిక సంఘాల నాయకులు జి ఓబులేశు, సిహెచ్ నరసింగరావు, ఆర్ రవీంద్రనాథ్, జాస్తి కిశోర్‌బాబు, రాష్ట్ర రైతు సంఘాల నాయకులు వై కేశవరావు, సింహాద్రి ఝాన్సీ, చుండూరు రంగారావు, పి జమలయ్య, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, వి వెంకటేశ్వర్లు, డి హరినాథ్, మరీదు ప్రసాద్‌బాబు, కె ప్రభాకర్‌రెడ్డి, వి కృష్ణయ్య, ఎం హరిబాబు, యు వీరబాబు, తోట ఆంజనేయులు, ఎస్‌కె గౌస్, గంటా శ్రీరామ్, కాసాని గణేష్‌బాబు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నైట్ అవుట్ అలవెన్స్‌లను పునరుద్ధరించాలి

- కమిషనరుకు ఎస్‌డబ్ల్యుఎఫ్ వినతి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్‌టిసి కార్మికులకు నైట్ అవుట్ అలవెన్స్‌తోపాటు ఇతర అలవెన్స్‌లు టిఎ, బిల్లులు తక్షణం పునరుద్ధరించాలని ప్రభుత్వానికి ఎపిపిటిడి (ఆర్‌టిసి) స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు ఎస్‌డబ్ల్యుఎఫ్ అధ్యక్షులు ఎస్‌కె జిలానీ బాషా మంగవారం ఎపి పబ్లిక్ ట్రాన్స్‌పోర్టు డిపార్టుమెంట్ కమిషనరుకు వినతిపత్రం అందజేశారు. ఆర్‌టిసిలో డ్రైవర్లు, కండక్టర్లతో సహా ఇతర ఉద్యోగులకు ఇస్తున్న నైట్ అవుట్, డే అవుట్ అలవెన్స్‌లు టిఎ, బిల్లులు, ఇతర అలవెన్స్‌లు జిఓ నెంబరు 114లో లేవనే కారణంతో ఆగస్టు నెల జీతం నుంచి నిలిపివేశారన్నారు. సిసిఎ రెగ్యులేషన్స్ నేపథ్యంలో పనిభారం విషయంలో ప్రభుత్వం నుంచి అనుమతి పొంది ఆర్‌టిసిలో అమలు చేసిన యాజమాన్యం, ఉద్యోగ, కార్మికులకు చెల్లించాల్సిన అలవెన్స్‌ల చెల్లింపుల కోసం అనుమతి తీసుకోకపోవడం పట్ల ఎస్‌డబ్ల్యుఎఫ్ అభ్యంతరం తెలుపుతోందని వినతిపత్రంలో పేర్కొన్నారు.

స్త్రీనిధి ఫెడరేషన్ ఎమ్‌డిగా హరిప్రసాద్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

స్త్రీనిధి క్రెడిట్ కో-ఆపరేటివ్ ఫెడరేషన్ మేనేజింగ్ డైరెక్టరుగా జివిబిడి హరిప్రసాద్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఇందుకు సంబంధించిన జిఓ 589ను పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్‌శాఖ ముఖ్యకార్యదర్శి శశిభూషణ్ కుమార్ మంగళవారం విడుదల చేశారు. యూనియన్ బ్యాంక్ విజయనగరం డిప్యూటీ రీజనల్ హెడ్ ఉన్న హరిప్రసాద్‌ను ఎమ్‌డిగా నియమించారు.

టెట్ ఫైనల్ కీ విడుదల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) తుది 'కీ'ను పాఠశాల విద్యాశాఖ విడుదల చేసింది. ఈ నెల 3 నుంచి 21 వరకు పాఠశాల విద్యాశాఖ టెట్ నిర్వహించిన విషయం తెలిసిందే. తొలి 'కీ'పై వచ్చిన అభ్యంతరాలను పరిశీలించి తుది కీ విడుదల చేశారు. ఎంఎ.ఖజూ.స్రశీజ.ఱఅ వెబ్‌సైట్‌లో కీ అందుబాటులో ఉందని పాఠశాల విద్యాశాఖ డైరెక్టరు వి విజయరామరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఐటి హబ్‌లకు సహకారం అందించండి

- మైక్రో సాఫ్ట్ సిఇఒ సత్య నాదెళ్లతో లోకేష్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర వ్యాప్తంగా కొత్త ఐటి హబ్‌లు, ఇన్నోవేషన్ పార్కులను నిర్మిస్తున్నామని, వీటికి ప్రపంచ స్థాయి సాంకేతిక కేంద్రాలుగా తీర్చిదిద్దడంలో మైక్రోసాఫ్ట్ సహకారం అవసరమని ఆ సంస్థ సిఇఒ సత్య నాదెళ్లను విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్‌శాఖల మంత్రి నారా లోకేష్ కోరారు. అమెరికా పర్యటనలో భాగంగా సత్య నాదెళ్లతో మంగళవారం భేటీ అయ్యారు. క్లౌడ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా సెంటర్ల ఏర్పాటుతో రాష్ట్రం ప్రపంచస్థాయి సంస్థలకు ప్రాంతీయ కేంద్రంగా మారే అవకాశాలు ఉన్నాయని లోకేష్ వివరించారు. పెట్టుబడులకు అనుకూలమైన విధానాలు, భూమి తమ వద్ద అందుబాటులో ఉన్నాయని వెల్లడించారు. క్లౌడ్‌సేవల్లో మైక్రోసాఫ్ట్ నాయకత్వంతో కలిసి తాము అత్యాధునిక సాంకేతిక పర్యావరణ వ్యవస్థను నిర్మించాలని భావిస్తున్నామని పేర్కొన్నారు. అగ్రిటెక్‌కు ఎఐని అనుసంధానించడం వల్ల వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు వస్తాయని తెలిపారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) ప్రాజెక్టులకు అనువుగా ఉన్న అమరావతిని ఎఐ క్యాపిటల్‌గా తయారుచేయాలని భావిస్తున్నామని చెప్పారు. వ్యూహాత్మక భాగస్వామ్యం, ఆవిష్కరణల కోసం రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేయాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న మౌలిక సదుపాయాలు, సాంకేతిక పర్యావరణ వ్యవస్థను వచ్చి పరిశీలించాలని కోరారు. యాపిల్ సంస్థ తయారీ యూనిట్ ఏర్పాటుకు రాష్ట్రం అనువైన ప్రదేశమని యాపిల్ వైస్ ప్రెసిడెంట్ ప్రియా సుబ్రహ్మణ్యంతో లోకేష్ అన్నారు. శాన్‌ఫ్రాన్సిస్కోలోని ఆ సంస్థ ప్రధాన కార్యాలయంలో ప్రియా సుబ్రహ్మణ్యంతో లోకేష్ భేటీ అయ్యారు. భారత్‌లో యాపిల్ కార్యకలాపాల విస్తరణకు అవసరమైన మద్దతు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నామని చెప్పారు. రాష్ట్రంలో ఆడోబ్ ఆర్‌అండ్‌డి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అడోబ్ సిఇఒ శంతను నారాయణను లోకేష్ కోరారు. శాన్‌ఫ్రాన్సిస్కోలో శంతను నారాయణతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఈ పర్యటనలో రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి బృందం సభ్యులు కార్తికేయ మిశ్రా, సాయికాంత్ వర్మ ఉన్నారు.

సిఎంను కలిసిన కపిల్‌దేవ్

- గోల్ఫ్ క్లబ్‌ల ఏర్పాటుపై చర్చ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్, ప్రొఫెషనల్ గోల్ఫ్ టూర్ ఇండియా ఛైర్మన్ కపిల్‌దేవ్ కలిశారు. ఆంధ్రప్రదేశ్ క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షులు, విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని)తో కలిసి ఉండవల్లిలోని చంద్రబాబు నివాసంలో కలిశారు. రాష్ట్రంలో క్రీడా రంగ విస్తరణపై చర్చించామని అనంతరం చంద్రబాబు సామాజిక మాధ్యమంలో పేర్కొన్నారు. అమరావతిలో అంతర్జాతీయ గోల్ఫ్ కోర్స్, గోల్ఫ్ క్లబ్, అనంతపూర్, విశాఖలో ప్రీమియర్ గోల్ఫ్ కోర్స్ క్లబ్‌ల గురించి చర్చించినట్లు తెలిపారు. యువతలో గోల్ఫ్ పట్ల ఆసక్తి కలగడానికి, తరువాత తరం గోల్ఫర్లు తయారుకావడానికి ఈ చర్యలు ఊతమిస్తాయని భావిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా పౌరులకు మరింత మెరుగైన అవకాశాలు, సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని వెల్లడించారు. ఎపిని నిఖార్సయిన స్పోర్ట్స్ హబ్‌గా మలిచేందుకు కపిల్‌దేవ్ వంటి క్రీడా రంగ దిగ్గజాలతో కలిసి పనిచేసేందుకు ఎల్లప్పుడూ ముందుంటామని వివరించారు. గోల్ఫ్ క్లబ్‌ల ఏర్పాటుకు భూమి ఎక్కడ ఇస్తారనేది నిర్ణయం ప్రభుత్వానిదే అని కపిల్‌దేవ్ సమావేశం అనంతరం కేశినేని చిన్నితో కలిసి మీడియాతో చెప్పారు. స్పోర్ట్స్ సిటీ ఇస్తే చాలా సంతోషిస్తానని తెలిపారు. క్రీడలపై సిఎం చాలా ఆసక్తిగా ఉన్నారని తెలిపారు. రాష్ట్రానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఉండాలని కపిల్‌ను కోరినట్లు ఎంపి చిన్ని చెప్పారు.

డిప్యూటీ సిఎంతో హోంశాఖ మంత్రి భేటీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్‌తో హోంశాఖ మంత్రి వంగలపూడి అనిత మంగళవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో శాంతి భద్రతలతో పాటు, దీపావళి ముందస్తు భద్రతా ఏర్పాట్లపై చర్చించారు. వాయు కాలుష్యం దేశ వ్యాప్తంగా పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్రంలో దీపావళికి గ్రీన్ కాకర్స్ వినియోగించేలా ప్రజలకు అవగాహన కలిగించాలని ఉప ముఖ్యమంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇటీవల రాష్ట్రంలో తిరుపతి, విశాఖ, విమానాశ్రయాల్లో బాంబు బెదిరింపుల నేపథ్యంలో పోలీస్ వ్యవస్థ అప్రమత్తంగా ఉండాలని ఆయన సూచించారు. అనిత మాట్లాడుతూ 185 అగ్నిమాపక స్టేషన్లను ఏర్పాటు చేయడమే కాకుండా అన్నివిధాల సిద్ధంగా ఉండాలని సిబ్బందికి ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. 100 లేదా 101 నెంబర్లకు ఫోన్‌లు చేసి టపాకాయల అక్రమ తయారీపై పోలీస్, ఫైర్ వ్యవస్థలకు ఫిర్యాదు చేసే సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. వైసిపి హయాంలో జరిగిన అరాచక పరిస్థితులు , ఇటీవల బయటకి వస్తున్న దుర్మార్గాలపై చట్ట ప్రకారం వేగంగా దర్యాప్తు చేసి నిందితులకు శిక్ష పడేలా చూసే అంశంపై ఇరువురి మధ్య చర్చ జరిగింది. డ్రగ్స్, గంజాయి, సైబర్ నేరాల పట్ల గతంలో లేని విధంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు మంత్రి తెలిపారు. పాయకరావు పేట నియోజకవర్గ అభివృద్ధిపనులపై పవన్‌కల్యాణ్ చొరవ చూపాలని ఆమె కోరారు. అపకాపల్లి జిల్లా కోటవురట్ల మండలంలో లింగాపురం నుంచి కొడవటిపూడి కట్ట వరకు సుమారు కిలోమీటరు మేర నిర్మించనున్న ఆర్‌అండ్‌బి రోడ్డుకు అటవీశాఖ అనుమతులు ఇప్పించాలని కోరారు.

32మంది డిప్యూటీ కలెక్టర్స్ బదిలీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం 32మంది డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేసింది. ఈ మేరకు మంగళవారం సిఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. మొతం ఏడుగురు డిప్యూటీ కలెక్టర్లకు సిఆర్‌డిఎలో పోస్టింగ్ ఇచ్చారు. ప్రోటోకాల్ డైరెక్టర్‌గా టి.మోహన్‌రావును, ఎపిఐఐసి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా పి.రచనను నియమించారు.

శ్రీకాళహస్తి దేవాలయం ఇఓగా టి.బాపిరెడ్డిని నియమించారు. శిల్పారామం సొసైటీ సిఇఓగా వి.స్వామినాయుడును నియమించారు. సిసిఎల్‌ఎ సహాయ కార్యదర్శిగా డి లక్ష్మారెడ్డిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలి

- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్.నర్సింగరావు
- పలు జిల్లాల్లో సంఘీభావ కార్యక్రమాలు

ప్రజాశక్తి - యంత్రాంగం

విజయవాడ ధర్నాచౌక్‌లో జరిగిన సంఘీభావ కార్యక్రమంలో సిహెచ్.నర్సింగరావు తదితరులు

క్యూబాపై అమెరికా ఆంక్షలు ఎత్తివేయాలని డిమాండ్ చేస్తూ . సిఐటియు ఆల్ ఇండియా కమిటీ పిలుపులో భాగంగా కర్నూలు, విజయవాడ, విశాఖలో సంఘీభావ కార్యక్రమం చేపట్టారు. అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న క్యూబా ప్రజలకు జేజేలు, అమెరికన్ సామ్రాజ్యవాదం నశించాలి అని నినదించారు. విజయవాడ ధర్నాచౌక్ వద్ద సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్. నర్సింగరావు మాట్లాడుతూ... 1968లో ఫైడల్ కాస్ట్రో, చేగువేరా నేతృత్వంలో లాటిన్ అమెరికాలోని క్యూబాలో కార్మిక రాజ్యం ఏర్పడిందన్నారు. అమెరికా సామ్రాజ్యవాదానికి పక్కలో బల్లెంలాగా నాటి నుండి నేటి వరకూ పోరాడుతున్న దేశం క్యూబా అని అన్నారు. 1960వ దశకంలో అప్పటి అమెరికా అధ్యక్షుడు జాన్ కెనడీ... తమకు 90 కిలోమీటర్ల దూరంలోనే ఉన్న క్యూబాను సైన్యంతో చుట్టుముడతానని హెచ్చరించారని, దీనిపై క్యూబా అధ్యక్షుడు ఫైడల్ కాస్ట్రో స్పందిస్తూ... అమెరికా కూడా తమకు 90 కిలోమీటర్ల దూరంలోనే ఉంది జాగ్రత్త అంటూ దీటుగా హెచ్చరించారని గుర్తుచేశారు. క్యూబా ప్రజల సోషలిస్టు అంకితభావం ఎంతో ఉన్నతమైనదన్నారు. ఆహార పదార్థాలు, మందులు, నిత్యావసర సరుకులు క్యూబాకు ఎవ్వరూ ఎగుమతి చేయకుండా ప్రపంచ దేశాలపై అమెరికా ఒత్తిడి చేస్తోందని విమర్శించారు. ఆంక్షల ఎత్తివేతకు ఐక్యరాజ్య సమితిలో ఓటింగ్ జరిగినప్పుడల్లా అమెరికాకు వ్యతిరేకంగా ఓటింగ్ జరుగుతోందని, కానీ అమెరికా ఆంక్షలు ఎత్తివేయడం లేదని అన్నారు. పాలస్తీనా ప్రజలను ఇజ్రాయిల్ సాయంతో పొట్టనపెట్టుకుంటోందన్నారు. మరోవైపు రష్యా చుట్టూ నాటో సైన్యాన్ని మోహరిస్తోందన్నారు. కామ్రేడ్ లెనిన్ చెప్పినట్లు సామ్రాజ్యవాదం ఉన్నంత కాలం ప్రపంచంలో శాంతి ఉండదన్నారు. సిఐటియు రాష్ట్ర నాయకులు కె.ఉమామహేశ్వరరావు, రమాదేవి, ఆర్.వి.నరసింహారావు, కె.ఆర్.కెమూర్తి, రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ నాయకులు నరసింహులు తదితరులు పాల్గొన్నారు. విశాఖ పూర్ణమార్కెట్ స్ప్రింగ్‌రోడ్డులో క్యూబాకు మద్దతుకు సిపిఎం నాయకులు సంఘీభావం తెలిపారు. కర్నూలులో గడియారం ఆస్పత్రి వద్ద సంఘీభావం తెలిపారు.

ప్రొఫెసర్ సాయిబాబాది హత్యే

- సుంకర రాజేంద్రప్రసాద్

సభలో సాయిబాబాకు నివాళులర్పిస్తున్న సుంకర రాజేంద్ర ప్రసాద్ తదితరులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రొఫెసర్ సాయిబాబాను సామూహికంగా హత్య చేశారని ఐలు నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంటు సుంకర రాజేంద్రప్రసాద్ తెలిపారు. హత్యలో కేంద్ర ప్రభుత్వం, న్యాయ, పోలీసు, వైద్య వ్యవస్థలు కీలకంగా ఉన్నాయన్నారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం నిర్వహించిన సాయిబాబా సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ.. 24 గంటలు జైలులో పెట్టేందుకు అవకాశం లేని కేసులో ఆయనను పదేళ్లు ఉంచారన్నారు. బెయిల్ కూడా ఇవ్వలేనంత ఘోరం ఏం చేశారని ప్రశ్నించారు. రాజకీయ ఖైదీని జైలులో అంత తీవ్రంగా హింసించాల్సిన అవసరం ఏముందన్నారు. ఈ కేసులో పాలకులతో లాలూచీపడి చట్టాలకు వ్యతిరేకంగా తీర్పులిచ్చిన న్యాయమూర్తులకు ఇంకా ఆ బాధ్యతల్లో కొనసాగే అర్హత ఉందా? అని ప్రశ్నించారు. స్టాన్ స్వామి మరణించిన జులై 5న ఉపా బాధితుల దినంగా నిర్వహించుకోవాలని కోరారు. 'అక్టోబరు 12న న్యాయ వ్యవస్థ ఖనన దినంగా జరపాల్సిన అవసరం ఉందని' రాజేంద్ర ప్రసాద్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఉపా చట్టాన్ని తీసుకొచ్చిందని, అనేక సవరణల అనంతరం ఆ పార్టీ అధినేత రాహుల్ గాంధీనే అర్బన్ నక్సలైట్‌గా మోడీ ప్రకటించారని చెప్పారు. హైకోర్టు సీనియర్ న్యాయవాది పి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రస్తుతం న్యాయ వ్యవస్థ వైకల్యంతో వీల్‌ఛైర్‌లో ఉందని, దీనికి వైద్యం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రొఫెసర్ సాయిబాబా ఆశయాల సాధనకు ప్రశ్నిద్దామని, ప్రశ్నించడం నేర్పుదామని చెప్పారు. ఐపిఎల్ నాయకులు పి శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉపా చట్టం ఒక సాయిబాబాకే పరిమితం కాలేదని, వేలాది మంది సాయిబాబాలు జైళ్లలో మగ్గిపోతున్నారని చెప్పారు. న్యాయ వ్యవస్థలో లోపాలను ప్రశ్నించాల్సిన సమయం వచ్చిందన్నారు. హైకోర్టు న్యాయవాది బి శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ఐలు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ మాధవరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి సంపర శ్రీనివాసులు, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి ఎన్ శ్రీనివాసరావు, హైకోర్టు సీనియర్ న్యాయవాది వై కోటేశ్వరరావు, పౌరహక్కుల సంఘం నాయకులు డి సురేష్ కుమార్ ప్రసంగించారు. ఐలు జిల్లా కార్యదర్శి వి కోటేశ్వరరావు, నగర కార్యదర్శి వి రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

డెయిరీ వద్ద ధర్నాలో పాల్గొన్న లోకనాథం, సూర్యనారాయణ, అజయ్‌కుమార్, పాల రైతులు

పాల సేకరణ ధర తగ్గింపుపై మహాధర్నా

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

పాల సేకరణ ధరను విశాఖ డెయిరీ యాజమాన్యం తగ్గించడంపై పాల రైతులు భగ్గుమన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి పెద్ద సంఖ్యలో వారంతా విశాఖ నగరంలోని గాజువాకకు సమీపంలో ఉన్న డెయిరీ వద్దకు తరలివచ్చి ప్రధాన ద్వారం వద్ద మంగళవారం మహాధర్నా నిర్వహించారు. నవంబర్ 1న చెల్లించే పేమెంట్లలో రైతుల డిమాండ్‌కు అనుగుణంగా ధరను పెంచి ఇవ్వకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ పాల రైతు సంఘం (అఖిల భారత కిసాన్ సభ అనుబంధం) ఆధ్వర్యంలో ధర్నా ఉదయం నుంచి సాయంత్రం వరకూ సాగింది. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం మాట్లాడుతూ ఆవు పాల సేకరణ ధరను డెయిరీ యాజమాన్యం లీటరుకు రూ.3 మేర తగ్గించడం దారుణమన్నారు. రైతులకు ఆవు పాల లీటరుకు రూ.50, గేదె పాలకు రూ.80 ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో దశలవారీగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు మర్రాపు సూర్యనారాయణ మాట్లాడుతూ సహకార రంగం వల్ల లాభం లేదని చెప్పి విశాఖ డెయిరీని కంపెనీ యాక్ట్‌లోకి తీసుకొచ్చి స్వేచ్ఛగా వారి వ్యక్తిగత వ్యాపారాలను యాజమాన్యంలో ఉన్నవారు పెంచుకున్నారని విమర్శించారు. డెయిరీ లాభాలు ప్రయివేటుగా దారిమళ్లుతున్నాయన్నారు. డెయిరీలో జరుగుతున్న అవినీతిపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ పాల రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి కె.అజయ్ కుమార్ మాట్లాడుతూ స్థిరాస్తులను కాజేయడానికి కుట్ర చేస్తున్నారని విమర్శించారు. సహకార నిబంధనల ప్రకారం లాభాల్లో నుంచి బోనస్‌ను రైతులకు చెల్లించాల్సి ఉందని, 2006వ సంవత్సరం నుండి ఇవ్వడం లేదన్నారు. పాల రైతుల సొసైటీలతో చర్చించకుండా ఏకపక్షంగా పాల ధర తగ్గించడం సరికాదన్నారు. సహకార స్ఫూర్తికే ఇది విరుద్ధమని తెలిపారు. కార్యక్రమంలో పాల రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బుద్ధరాజు రాంబాబు, ఉత్తరాంధ్ర జిల్లాల నాయకులు కర్రి అప్పారావు, గండి నాయనబాబు, ఎస్.బ్రహ్మాజీ, ఎం.అప్పలరాజు, వెలమల రమణ, జగన్, ఆర్.రమణమూర్తి, పెద్ద సంఖ్యలో మహిళా పాడి రైతులు పాల్గొన్నారు. ధర్నా వద్దకు విశాఖ డెయిరీ మేనేజింగ్ డైరెక్టర్ ఎస్‌వి.రమణ రాగా ఆయనకు సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. త్వరలో డెయిరీ బోర్డులో చర్చించి ధరపై నిర్ణయం తీసుకుంటామని ఆయన తెలిపారు.

స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకుంటాం

- విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

పోరాటాలతో కేంద్రం మెడలు వంచి స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ చైర్మన్లు ఎం రాజశేఖర్, డి ఆదినారాయణ అన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి 1356వ రోజుకు చేరాయి. దీక్షల్లో స్టీల్ ఐఎన్‌టియుసి కార్యకర్తలు, ఉక్కు కార్మికులు కూర్చున్నారు. వారినుద్దేశించి నాయకులు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌లో బ్లాస్ట్ ఫర్నేస్-1ను పునఃప్రారంభించడం అభినందనీయమని తెలిపారు. కర్మాగారానికి నిరంతరాయంగా ముడి సరుకులు సరఫరా చేసి ఉత్పత్తికి అంతరాయం లేకుండా చూడాలని కేంద్రాన్ని కోరారు. కర్మాగారానికి ప్రభుత్వం మద్దతు అందిస్తే విశాఖ ఉక్కు లాభాల బాటలో నడుస్తుందని తెలిపారు. దీక్షల్లో పోరాట కమిటీ నాయకులు నీరుకొండ రామచంద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆలయాలకు

నెయ్యి సరఫరాపై ఉన్నత స్థాయి కమిటీ

- మంత్రి ఆనం రామనారాయణరెడ్డి

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్రంలోని ఆలయాల్లో ప్రసాదాల తయారీ, ఇతరత్రా అవసరాల కోసం వినియోగించే నెయ్యిని సేకరించే విషయంలో అనుసరించాల్సిన విధి విధానాల్లో మార్పులను సూచించడానికి ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని నియమిస్తున్నట్లు దేవాదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పేర్కొన్నారు. వివిధ డెయిరీ సంఘాల సంస్థల ప్రతినిధులతో దేవాదాయశాఖ కమిషనరు కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కమిటీలో సీనియర్ అధికారులు, డెయిరీల ప్రతినిధులు, ఎస్‌వి డెయిరీ కళాశాల ప్రతినిధులు, ఇతర నిపుణులను నియమించి నివేదిక తెప్పించాలని దేవాదాయశాఖ కమిషనరు సత్యనారాయణను ఆదేశించారు. కమిటీ రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి, పరిస్థితులను అధ్యయనం చేయాలన్నారు. నెయ్యి ఉత్పత్తికి అవసరమైన పాల లభ్యత, ఏయే ప్రాంతాల్లో గో సంపద ఎక్కువగా ఉన్నదనే విషయాలన్నింటిపైనా ఈ కమిటీ అధ్యయనం చేస్తుందని పేర్కొన్నారు. 15 రోజుల్లో ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఆలయాల్లో అవసరాల నిమిత్తం ఏటా సుమారు 1,500 టన్నుల ఆవు నెయ్యి అవసరమని, పూర్తి నాణ్యతా ప్రమాణాలతో సేకరించేలా చూడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సంగం డెయిరీ ఛైర్మన్, పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర మాట్లాడుతూ.. ఆలయాలకు అవసరమైన నెయ్యిని స్థానికంగా ఉన్న డెయిరీల నుంచే (రాష్ట్రంలోని ఉత్పత్తి దారుల నుంచి) సేకరించాలని, వివిధ యూనియన్లు, డెయిరీల మధ్య సహజంగా ఉండే పోటీని కూడా దృష్టిలో ఉంచుకుని నెయ్యి సేకరణ విధాన రూపకల్పనలో అన్ని డెయిరీలకూ సమాన అవకాశాలు లభించేలా చూడాలని మంత్రిని కోరారు.

జగన్ పాలనే 'వెలిగొండ'కు శాపం..

- ప్రాజెక్టును సందర్శించిన మంత్రి నిమ్మల రామానాయుడు

వెలిగొండను పరిశీలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-పెద్దదోర్నాల (ప్రకాశం జిల్లా)

జగన్ పాలనే పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు శాపమని, తల్లి, చెల్లిని మోసం చేసిన జగన్‌కు ప్రకాశం జిల్లా ప్రజలను మోసం చేయడం ఒక లెక్కనా.? అని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు విమర్శించారు. ఉత్తుత్తి ప్రారంభోత్సవాలతో జగన్ పబ్బం గడపడంతో ఫీడర్ కెనాల్‌లో నాణ్యత లోపం ఏర్పడిందని తెలిపారు. వెలిగొండ ప్రాజెక్ట్ పనులను విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి, పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి, యర్రగొండపాలెం నియోజకవర్గ ఇన్‌ఛార్జి గూడూరి ఎరిక్షన్‌బాబుతో కలసి మంగళవారం ఆయన పరిశీలించారు. 2014-19 టిడిపి పాలనలో వెలిగొండ ప్రాజెక్టుకు రూ.1373 కోట్లు కేటాయించి.. రూ.1319 కోట్లు (96 శాతం) ఖర్చు చేశామన్నారు. గత ఐదేళ్ల జగన్ పాలనలో రూ.3518 కోట్ల బడ్జెట్ కేటాయించి, కేవలం రూ.170 కోట్లు (0.04 శాతం) మాత్రమే ఖర్చుపెట్టారని తెలిపారు. వెలిగొండ టన్నెల్స్, ఫీడర్ కెనాల్, రిజర్వాయర్ పనులు, నిర్వాసితులకు రూ.880 కోట్లు ఇవ్వాల్సి ఉండగా, ఒక రూపాయి కూడా ఇవ్వకుండానే ఎన్నికల ముందు వెలిగొండ జాతికి అంకితం అనడం జగన్ మార్క్ మోసం, దగా కాదా.? అని ఎద్దేవా చేశారు. జగన్ తన పత్రిక సాక్షికి యాడ్స్ రూపంలో రూ.300 కోట్లు ఇచ్చుకున్నారని, పత్రికకు ఇచ్చిన ప్రాధాన్యత వెలిగొండ ప్రాజెక్టుకు ఇవ్వలేదని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు గొట్టిపాటి రవికుమార్, బాల వీరాంజనేయ స్వామి మాట్లాడారు. వెలిగొండ ప్రాజెక్టుకు సంబంధించి దోర్నాల మండలం, కొత్తూరు సమీపంలోని రెండు సొరంగాలను పరిశీలించేందుకు మంత్రులు మోటార్ సైకిళ్లను నడుపుకుంటూ వెళ్లారు. కార్యక్రమంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా, మార్కాపురం సబ్ కలెక్టర్ సహదీత్ వెంకట త్రివినాగ్ పాల్గొన్నారు.

రాష్ట్రానికి బిజెపి, టిడిపి, వైసిపి అన్యాయం

- డివైఎఫ్ఐ రాష్ట్ర సమావేశంలో వక్తలు

సమావేశంలో మాట్లాడుతున్న రామన్న

ప్రజాశక్తి - కడప అర్బన్

కడప ఉక్కు పరిశ్రమ నిర్మాణానికి రాష్ట్రపతి చేసిన సంతకం ఏమైంది? పోలవరం, తుంగభద్ర బోర్డు, విద్యుత్, రైల్వేజోన్, ఓడరేవు, విమానాశ్రయాలు, మెట్రోరైలు ఎక్కడ? అని పలువురు వక్తలు ప్రశ్నించారు. 'రాష్ట్ర పునర్విభజన చట్టం - 2014 అమలు - పాలకుల పనితీరు' అనే అంశంపై డివైఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా మొదటి రోజు కడప ఎస్‌వి ఇంజనీరింగ్ కళాశాలలో సెమినార్ నిర్వహించారు. వక్తలు మాట్లాడుతూ.. తన అస్తిత్వ స్వప్రయోజనాల కోసం తెలంగాణ ఉద్యమాన్ని కెసిఆర్ ఉధృతం చేశారని పేర్కొన్నారు. 2009 డిసెంబర్ తొమ్మిదిన తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ ప్రారంభమైందని అప్పటి కేంద్ర మంత్రి చిదంబరం ప్రకటించారని తెలిపారు. 2010లో 'శ్రీ కృష్ణ కమిటీ'ని ప్రభుత్వం నియమించిందని, తన నివేదికలో తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు సూచనలు చేసిందని, 2013 జూలై 30న కేంద్ర మంత్రివర్గం బిల్లును ఆమోదించి శాసనసభ ఆమోదానికి పంపిందన్నారు. అప్పట్లో ప్రతిపక్ష బిజెపి తాము అధికారంలోకి వస్తే ఎపికి 15 ఏళ్లు ప్రత్యేక హోదా ఇస్తామని నరేంద్రమోడీ, అమిత్‌షా, వెంకయ్యనాయుడు పార్లమెంట్ సాక్షిగా సంతకం చేయడంతో అది చట్టంగా మారిందని పేర్కొన్నారు. 15 ఏళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి.. ప్రత్యేకహోదా హామీ మాట మరిచిందని విమర్శించారు. పునర్విభజన చట్టం షెడ్యూల్ 13లో కేంద్ర ప్రభుత్వ ఉక్కు కర్మాగారాల నిర్మాణ సంస్థ సెయిల్ ఆధ్వర్యంలో కడప ఉక్కు కర్మాగారం నిర్మాణం కోసం రాష్ట్రపతి చేసిన సంతకం ఏమైందో అర్థం కావడం లేదన్నారు. కడప ఉక్కు పరిశ్రమకు ముగ్గురు ముఖ్యమంత్రులు నాలుగుసార్లు శంకుస్థాపనలు చేశారని, అయినా ఒక్క అడుగూ ముందుకు పడలేదన్నారు. సదస్సులో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు వై.రాము, కార్యదర్శి రామన్న, డివైఎఫ్ఐ మాజీ నాయకులు జి.చంద్రశేఖర్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని మాట్లాడారు. డివైఎఫ్ఐ జిల్లా ప్రధాన కార్యదర్శి వి.శివ కుమార్ అధ్యక్షతన జరిగిన సెమినార్‌లో రాష్ట్ర కమిటీ సభ్యులు హర్ష, జిల్లా కమిటీ సభ్యులు డేవిడ్, తులసి, నరసింహులు, ఆంజనేయులు, సురేంద్ర, యువతీ యువకులు పాల్గొన్నారు.

448 కిలోల గంజాయి పట్టివేత

ప్రజాశక్తి - అనకాపల్లి

రెండు ప్రాంతాల నుంచి అక్రమంగా తరలిస్తున్న సుమారు రూ. 22 లక్షల విలువైన 448 కిలోల గంజాయిని అనకాపల్లి జిల్లా వి మాడుగుల, కొత్తకోట పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. ఆ రెండు కేసుల్లో ఏడుగురు నిందితులను అరెస్ట్ చేశారు. కేసుల వివరాలను ఎస్‌పి తుహిన్ సిన్హా తన కార్యాలయంలో మీడియాకు వెల్లడించారు. కొత్తకోట సిఐ జి కోటేశ్వరరావు, ఎస్ఐ శ్రీనివాస్, రోలుగుంట ఎస్ఐ రామకృష్ణ, రావికమతం ఎస్ఐ రఘువర్మ ముందస్తు సమాచారంతో దొండపూడి చెక్ పోస్ట్ వద్ద వాహన తనిఖీలు ముమ్మరం చేశారు. ఓ కారును ఆపేందుకు ప్రయత్నించగా కారు డ్రైవర్‌తో సహా అందులోని ముగ్గురు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిని వెంబడించి పోలీసులు పట్టుకున్నారు. 40 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితులు కేరళ రాష్ట్రానికి చెందినవారు. వారికి చెందిన ఐదు మొబైల్ ఫోన్లు, రూ. 8000 నగదు, కారును సీజ్ చేశారు. రావికమతం మండలం కల్యాణపులోవ అటవీ ప్రాంతంలో గంజాయిని కొనుగోలు చేసి కేరళకు తరలిస్తున్నట్టు నిందితులు అంగీకరించారు.

వి మాడుగుల మండలం తాటిపర్తి పంచాయతీ గరికిబంధ గ్రామం వద్ద బొలెరో వాహనం నుంచి లారీలోకి గంజాయిని మారుస్తున్న క్రమంలో కె కోటపాడు సిఐ పైడిపునాయుడు, ఎస్ఐ నారాయణరావు దాడి చేశారు. 408 కిలోల గంజాయి, రెండు కిలోల ఆశిష్ ఆయిల్, మూడు సెల్ ఫోన్లు, ఒక లారీ, ఒక వ్యాను, రెండు ద్విచక్ర వాహనాలను సీజ్ చేశారు. దాడులు నిర్వహించి గంజాయి నిందితులను పట్టుకున్న పోలీసు సిబ్బందిని ఎస్‌పి అభినందించి, నగదు రివార్డులు అందజేశారు.

సిసిటివి దృశ్యాల ఆధారంగా ఉమా శంకర్‌రెడ్డిని నిందితుడిగా గుర్తించాం

- హైకోర్టుకు తెలిపిన సిబిఐ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సిసిటివి దృశ్యాల ఆధారంగా మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో ఉమా శంకర్ రెడ్డిని నిందితుడిగా గుర్తించామని సిబిఐ హైకోర్టుకు తెలిపింది. ఉమాశంకర్‌రెడ్డి దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై మంగళవారం తెలంగాణ హైకోర్టులో వాదనలు కొనసాగాయి. వివేకా హత్య సమయంలో ఉమాశంకర్ రెడ్డి ఆ ప్రదేశంలో ఉన్నట్లు ప్రత్యక్ష సాక్షులెవరూ గుర్తించలేదని, పొడవుగా, నల్లగా ఉన్నాడని చెప్పిన మాటల ఆధారంగా ఈ కేసులో ఉమా శంకర్‌ను నిందితుడిగా చేర్చారని ఆయన తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఇప్పటికే అనేక పర్యాయాలు సిబిఐ ఆయన్ను విచారించిందని, విచారణకు ఉమాశంకర్ సహకరించారని తెలిపారు. ఆయనకు బెయిల్ ఇవ్వడంవల్ల కేసు విచారణకు ఎటువంటి ఇబ్బందులూ ఉండవని చెప్పారు. ఇరువైపుల వాదనలు విన్న న్యాయమూర్తి తదుపరి విచారణను వాయిదా వేశారు.

ఎల్సిడ్ షేర్ ధర రూ.2.36 లక్షలు పైనే

- స్టాక్ మార్కెట్‌లో రికార్డ్

ముంబయి : ఎల్సిడ్ ఇన్వెస్ట్‌మెంట్ షేర్ స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అత్యంత ఖరీదైనదిగా నిలిచింది. ఒక్క రోజులోనే రూ.3.5 నుంచి ఏకంగా రూ.2.36,250కు పెరిగింది. దీంతో ఆ కంపెనీ మార్కెట్ కాపిటలైజేషన్ రూ.4,725 కోట్లకు చేరింది. దీంతో దేశంలో ఇప్పటి వరకు రూ.1,22,577 ధరతో అత్యధిక విలువ కలిగిన ఎంఆర్ఎఫ్‌ను ఎల్సిడ్ అధిగమించినట్లయ్యింది. గతేడాది నుంచి ఎల్సిడ్ షేర్లు రూ.3.21 వద్ద నిలిచిపోయి ఉన్నాయి. మంగళవారం రీలిస్టింగ్ అయ్యింది. సెబీ ఆదేశాల మేరకు నిర్వహించిన స్పెషల్ కాల్ యాక్షన్‌లో ఒక్క పూటలోనే 73,600 రెట్లు పెరిగింది. ఏసియన్ పెయింట్స్‌లో ఎల్సిడ్‌కు 2.95 శాతానికి సమానమైన రూ.8,500 కోట్ల విలువ చేసే 2 లక్షల పైగా షేర్లను కలిగి ఉంది. రూ. 2,25,000 వద్ద షేరు ధర ప్రారంభమైనప్పటికీ వెంటనే 5 శాతం అప్పర్ సర్క్యూట్ ను తాకి రూ. 2,36,250 వద్ద ముగిసింది. ఒక్క రోజులో కేవలం 278 షేర్లు మాత్రమే ట్రేడింగ్ అయ్యాయి.

ఎస్‌బిఐ కార్డ్ లాభాల్లో తగ్గుదల

న్యూఢిల్లీ : ఎస్‌బిఐ కార్డ్స్ అండ్ పేమెంట్ సర్వీసెస్ లాభాల్లో తగ్గుదల చోటు చేసుకుంది. 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన రెండో త్రైమాసికం (క్యూ2)లో 33 శాతం పతనంతో రూ.603 కోట్ల లాభాలు ప్రకటించింది. సంస్థ రెవెన్యూ 8 శాతం పెరిగి రూ.4,421 కోట్లకు చేరింది. వడ్డీ ఆదాయం 15.2 శాతం వృద్ధితో రూ.2,289.74 కోట్లుగా నమోదయ్యింది. స్థూల ఎన్‌పిఎలు 84 బేసిస్ పాయింట్లు పెరిగి 3.27 శాతానికి.. నికర ఎన్‌పిఎలు 31 బేసిస్ పాయింట్లు పెరిగి 1.19 శాతంగా చోటు చేసుకున్నాయి. గడిచిన త్రైమాసికంలో రూ.1,106 కోట్ల మొత్తాలను రద్దు చేసినట్లు వెల్లడించింది. గతేడాది ఇదే సమయంతో పోల్చితే 63 శాతం బాకీలను రద్దు చేసింది.

నిరాశపర్చిన మారుతి సుజుకి

న్యూఢిల్లీ : దేశంలోనే అతిపెద్ద కార్ల తయారీ కంపెనీ మారుతి సుజుకి ఆర్థిక ఫలితాలు ఇన్వెస్టర్లను నిరాశపర్చాయి. 2024-25 సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2) 18 శాతం పతనంతో రూ.3,102 కోట్ల నికర లాభాలు ప్రకటించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.3,786 కోట్ల లాభాలు నమోదు చేసింది. ఇదే సమయంలో రూ.37,339 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ2లో రూ.37,449 కోట్లకు పెరిగింది. అమ్మకాలు, లాభాలు తగ్గడంతో ఇన్వెస్టర్లు అమ్మకాలు దిగారు. దీంతో మంగళవారం బిఎస్ఇలో మారుతి సుజుకి షేర్ 4.11 శాతం పతనమై రూ.11,010 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో రూ.10,744 కనిష్టాన్ని చవి చూసింది.

అరటి రైతు దిగాలు

రాజమహేంద్రవరంలోని అరటి మార్కెట్

- పండగ రోజుల్లోనూ దక్కని ధర
- గెలపై రూ.200పైగా తగ్గిన వైనం

ప్రజాశక్తి- రాజమహేంద్రవరం ప్రతినిధి

అరటి రైతులకు ఈ సీజన్‌లోనూ ఊరట లభించడం లేదు. ఓ వైపు పెళ్లిళ్లు, మరోవైపు దీపావళి, నాగుల చవితి పండగలు ఉన్నప్పటికీ అరటి ధరలు ఆశాజనకంగా లేవు. గత సీజన్‌తో పోల్చితే గెలకు రూ.200 నుంచి రూ.300 వరకూ ధర తగ్గిపోవడంతో అరటి రైతులు దిగాలు చెందుతున్నారు. ఇదే సీజన్‌లో గతేడాది టన్ను రూ.లక్షకుపైగా పలికింది. ప్రస్తుతం ఈ ధర రూ.80 వేలులోపే ఉంది. సుమారు 2 వేలకుపైగా ధర పతనమైంది. గతేడాది కర్పూర రకం అరటి గెల ధర రూ.300 నుంచి రూ.400 వరకూ పలికింది. తాజాగా దీని ధర రూ.110 నుంచి రూ.170 మించడం లేదు. చక్రకేళి రకం గెల గత సీజన్‌లో రూ.550 కాగా, ప్రస్తుతం రూ.200కు పతనమైంది. అమృతపాణి గెల గతేడాది రూ.350 కాగా, ప్రస్తుతం నుంచి రూ.170కు దిగజారింది. ఉభయ గోదావరి జిల్లాల్లో అరటి తోటలను రైతులు విస్తృతంగా సాగు చేస్తున్నారు. రావులపాలెం, అంబాజీపేట మార్కెట్లు ప్రధానమైనవి. పెరవలి, కొవ్వూరు తోటల నుంచి రాజమహేంద్రవరం, తాడేపల్లి మార్కెట్లకు తరలిస్తున్నారు. తోటల్లోకి వచ్చి రైతుల నుంచి వ్యాపారులు మార్కెట్‌కు తరలించి గెలకు రూ.50 చొప్పున కమిషన్ తీసుకుని విక్రయిస్తున్నారు. మరి కొంతమంది బడా వ్యాపారులు తోటల్లోకి నేరుగా లారీలతో వచ్చి కొనుగోలు చేసి ఎగువ రాష్ట్రాలకు తరలిస్తున్నారు ప్రస్తుతం ధర పడిపోవడంతో తమ చేతికి వచ్చేది కంటితుడుపేనని రైతులు వాపోతున్నారు.

ధరా లేదు... దిగుబడీ లేదు

కోనసీమ జిల్లాలో రావులపాలెం, ఆత్రేయపురం, కొత్తపేట, అంబాజీపేట మండలాల్లో, తూర్పుగోదావరి జిల్లాలో కొవ్వూరు, పెరవలి, ఉండ్రాజవరం, తాళ్లపూడి మండలాల్లో అరటి సాగు అధికంగా ఉంది. మెట్టలోనూ రెండు మూడు మండలాల్లో అరటిని సాగు చేస్తున్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 45 వేల ఎకరాల్లో సాగులో ఉంది. వర్షాలు, ఈదురు గాలులకు జిల్లాలో మూడు వేల ఎకరాల్లో అరటి పంటకు పూర్తిగా, మరో ఆరు వేల ఎకరాల్లో పాక్షికంగా నష్టం వాటిల్లింది. దీంతో, దిగుబడి తగ్గింది. వర్షాల కారణంగా అరటి నాణ్యత కూడా తగ్గడంతో ధర పడిపోయింది. తరువాత పిలకలు వేసినా పంట ఇంకా చేతికి రాలేదు. గతేడాది ఇదే సీజన్‌లో దిగుబడి, ఎగుమతులు ఎక్కువగా ఉన్నాయి. ధర కూడా బాగా పలికింది. గతేడాది ఎకరాకు రూ.50 వేల వరకూ లాభం చేకూరింది. గతేడాది ఇదే సీజన్‌లో రావులపాలెం, రాజమహేంద్రవరం, పెరవలి ప్రాంతాల నుంచి రోజుకు 150 లారీల వరకూ ఉత్తరాది రాష్ట్రాలకు అరటి ఎగుమతైంది. ప్రస్తుతం దిగుబడి తగ్గడంతో 80 లారీల లోడు కూడా వెళ్లడం లేదు.

పెట్టుబడి ఖర్చులూ రావట్లేదు

ఎకరాకు సుమారు 750 వరకూ పిలకలు నాటుతారు. రూ.90 వేల వరకూ పెట్టుబడి అవుతోంది. కొన్ని అరటి మొక్కలకు వెదురు గెడలను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. దీని కోసం ఒక్క మొక్కకు అదనంగా రూ.120 వరకు ఖర్చు చేయాల్సి వస్తుంది. ప్రస్తుతం ధరల ప్రకారం ఎకరాకు రూ.80 వేలలోపు మాత్రమే వస్తోందని రైతులు చెబుతున్నారు.

ధరలు ఆశాజనకంగా లేవు

గత 20 సంవత్సరాలుగా అరటి సాగు చేస్తున్నాను. ఈ ఏడాది కర్పూర రకం అరటి సాగు చేశాను. పది టన్నులను టన్ను ఒక్కంటికీ రూ.80 వేల చొప్పున విక్రయించాను. ఈ లెక్కన గెల సుమారు రూ.150 ధర మించలేదు. మార్కెట్లో ఒక్కోరోజు ఒక్కో ధర ఉంటోంది. ధర ఉందని అధిక సంఖ్యలో గెలలు దించితే ఒకేసారి ధరలు పడిపోతున్నాయి. అరటిని నిల్వ చేసుకునే సౌకర్యాలు లేకపోవడంతో వ్యాపారులు అడిగిన ధరకు విక్రయించక తప్పడం లేదు. సీజన్‌లో అయినా కనీసం రూ.300 వస్తేగానీ గిట్టుబాటు కాదు.

- కరుటూరు జనార్ధనరావు, అరటి రైతు, తీపర్రు, పెరవలి మండలం

ప్రభుత్వరంగ సంస్థల రుణాలు.. రూ.2.32 లక్షల కోట్లు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి - అమరావతి

రాష్ట్రంలో ప్రభుత్వ రంగ రంగ సంస్థలు చేసిన రుణాలు 2.32 లక్షల కోట్ల రూపాయలు దాటాయి. ఇందులో ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీతో సేకరించిన రుణాలు రు. 1.48 లక్షల కోట్లు ఉండగా, ఇతరత్రా తీసుకున్నవి , మరో 84 వేల కోట్ల రూపాయలు ఉన్నాయి. విద్యుత్, ఇరిగేషన్ వంటి కొన్ని సంస్థలు అవసరాలకు అనుగుణంగా రుణాలు తీసుకుంటుండగా, మరికొన్ని సంస్థలు మాత్రం ప్రభుత్వ అవసరాల కోసం అప్పులు చేస్తున్నాయి. మొత్తం 16 బ్యాంకులు, విత్త సంస్థల నుంచి రుణాలు సేకరించినట్లు తెలిసింది. సాధారణంగా కీలక సంస్థలు తీసుకునే రుణాలకు ప్రభుత్వం గ్యారంటీలు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ గ్యారంటీల ద్వారానే విత్త సంస్థలు రుణాలు ఇస్తుంటాయి. ఇక మిగిలిన సంస్థలు మాత్రం తమ పరపతిని అనుసరించి సొంతంగా రుణాలు సమీకరించుకుంటాయి. కేంద్రం ఆధీనంలోని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ ద్వారా ద్వారా 41,091 కోట్లు తీసుకోగా, గ్రామీణ విద్యుదీకరణ సంస్థ ద్వారా 30,197 కోట్లు సమీకరించారు.

వడ్డీ భారం

వివిధ సంస్థల నుంచి తీసుకున్న రుణాలపై చెల్లించాల్సిన వడ్డీ సంస్థలకు భారంగా మారుతోంది. కొన్ని విత్త సంస్థలకైతే పది శాతానికన్నా ఎక్కువగా వడ్డీ చెల్లించాల్సిన పరిస్థితి నెలకొంది. సకాలంలో వాయిదాలు చెల్లించకపోవడం వల్లనే వడ్డీలు పెరిగిపోతున్నట్లు అధికారులు అంగీకరిస్తున్నారు. పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు బకాయిలు ఉన్న 8,170 కోట్ల రుణంపై ఏకంగా 10.74 శాతం వడ్డీ చెల్లించాల్సి ఉంది. గ్రామీణ విద్యుదీకరణ సంస్థ బకాయిలపై 10.54 శాతం, పవర్ కార్పొరేషన్ లిమిటెడ్‌కు 10.30 శాతం వడ్డీగా చెల్లించాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు.

కొన్ని కీలక విత్త సంస్థలకు చెల్లించాల్సిన బకాయి, వడ్డీల వివరాలు

సంస్థ	బకాయి	వడ్డీ శాతం
పవర్‌ఫైనాన్స్ కార్పొరేషన్	41,091	10.30
పవర్ ఫైనాన్స్ సంస్థ	8,171	10.74
గ్రామీణ విద్యుదీకరణ సంస్థ	19,382	10.54
గ్రామీణ విద్యుదీకరణ సంస్థ	30,197	10.03
స్టేట్‌బ్యాంక్	13,099	8.77
యూనియన్ బ్యాంకు	12,189	8.24
బ్యాంక్ ఆఫ్ బరోడా	10,919	8.64
హడ్కో	10,851	9.29

కూతురిపై తండ్రి లైంగిక దాడి

ప్రజాశక్తి-పెద్దముడియం (కడప జిల్లా)

కంటికి రెప్పలా కాపాడాల్సిన తండ్రే కసాయివాడిలా లైంగిక దాడికి పాల్పడ్డాడు. కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం పెద్దముడియం మండల పరిధిలోని నెమళ్లదిన్నె గ్రామంలో ఈ అమానుష ఘటన చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..మతిస్థిమితం లేని 17 సంవత్సరాల వయసు గల కన్న కూతురిపై మద్యం మత్తులో తండ్రి లైంగిక దాడికి ఒడిగట్టాడు. తండ్రి అసభ్య ప్రవర్తనతో కూతురు కేకలు వేయడంతో స్థానికులు అక్కడికి వచ్చారు. నిందితుడిని పట్టుకుని పోలీసులకు అప్పజెప్పారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సుబ్బారావు తెలిపారు.

విశాఖ వస్తున్న విమానాలకు బాంబు బెదిరింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ (విశాఖపట్నం)

చెన్నై నుంచి విశాఖపట్నం వస్తున్న 6ఇ 917, బెంగళూరు నుంచి విశాఖపట్నం వస్తున్న 6ఇ969 విమానాలలో బాంబులు ఉన్నాయని మంగళవారం సాయంత్రం 5:36 గంటలకు ఆడమ్ లాంజా 202 ఐడి నుంచి వచ్చిన బాంబు బెదిరింపు ట్వీట్‌పై అధికారులు అప్రమత్తమయ్యారు. తొలుత ఎయిర్ లైన్స్ స్టేషన్ మేనేజర్ తన రీజనల్ సెక్యూరిటీ హెడ్‌కు బాంబు బెదిరింపుల సమాచారం అందించారు. అయితే, ఈ రెండు విమానాలు విశాఖలో సురక్షితంగా ల్యాండ్ అయ్యాయి. వాటిని ఐసోలేషన్ కేంద్రాలకు తరలించి నిబంధనల ప్రకారం భద్రతా తనిఖీలు నిర్వహిస్తున్నారు.

మానవత్వమే 'మతం'

- కళాకారులకు టిటిడి అవకాశాలివ్వాలి
- 'ఆధ్యాత్మిక సమ్మేళనం' రాష్ట్ర సదస్సులో వక్తలు

సదస్సులో మాట్లాడుతున్న విజయ శంకర స్వామి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ

'మానవత్వమే మతం.. వేదాల సారాంశం అంతా 'శాంతి'మంత్ర ఉపదేశమే.. కలసి బతకడం.. కలసి భోంచేయడం.. కలసి నైపుణ్యాన్ని పెంచుకోవడం.. కలసి జ్ఞానాన్ని పంచుకోవడమే తప్ప ఎక్కడా కుల మత ప్రస్తావన లేదు. సమైక్యతను ప్రచారం చేయడమే ఆధ్యాత్మిక సమ్మేళనం ఉద్దేశం' అని వక్తలు ఉద్ఘాటించారు. 'ఆధ్యాత్మిక సమ్మేళనం' రాష్ట్ర స్థాయి సదస్సు అన్నమయ్య కళాక్షేత్రం ఆధ్వర్యంలో తిరుపతి వేమన విజ్ఞాన కేంద్రం జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు విసి వెంకటయ్య అధ్యక్షతన మంగళవారం జరిగింది. అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకరస్వామి మాట్లాడుతూ.. జానపద కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని, టిటిడిలో, వివిధ ఆలయాల్లో వారికి విరివిగా అవకాశాలు ఇవ్వాలని కోరారు. తిరుమల తిరుపతి పుణ్యక్షేత్రాల్లో భక్తిబృందాలకు అవకాశం కల్పించాలన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్ శర్మ ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. సనాతన ధర్మం గురించి పవన్‌కల్యాణ్ తెలుసుకుని మాట్లాడి ఉంటే బాగుండేదన్నారు. సాక్షాత్తు రాష్ట్రపతినే దేవాలయంలోకి రానీయని స్థితి దేశంలో ఉండడం సరైనది కాదన్నారు. మతాన్ని రాజకీయాలకు వేదికగా వాడుకోవడం బాధాకరమన్నారు. అసలు ఏ గ్రంథంలోనూ హిందూమతం లేదని, లేని మతాన్ని అందరికీ ఆపాదిస్తూ విషపూరితమైన 'విద్వేషాన్ని' పాలకులు నింపుతున్నారని తెలిపారు. టిటిడి 'బైలా'లోనే ఆడపిల్లలకు చదువు నేర్పించాలని, ఉచిత వైద్యం అందించాలని, బలహీనులకు సేవచేయడమే అత్యున్నత సేవని, మానవసేవే దైవసేవని చెబుతున్నా, పెత్తనం చేయాలనుకున్నవారు 'మనుధర్మశాస్త్రం' పేరు చెప్పి పుట్టుక పేరుతో కులాలు సృష్టించారన్నారు. రాష్ట్రంలోని అన్ని దేవాలయాల్లో ధూపదీప నైవేద్యం మెరుగుపడేలా జీర్ణోద్ధరణ నిధులు కేటాయించాలని దేవాదాయ శాఖ దృష్టికి తీసుకెళ్లాలని అన్నారు. జానపద కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి బంగారు మురళి మాట్లాడుతూ.. గత 13 ఏళ్లుగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో స్వామి సన్నిధిలో 32 రకాల కళలను ప్రదర్శిస్తున్నామని, అయితే శ్రీవారి ఎదుట మన కళను ప్రదర్శించాలంటే 'డిక్లరేషన్' ఇవ్వాల్సిన పరిస్థితి ఉందన్నారు. ఆంక్షలు లేకుండా కళాకారులందరికీ ప్రదర్శనలు ఇచ్చేలా అవకాశం ఇస్తూ, దర్శన సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ సదస్సులో అన్నపూర్ణస్వామి ఆశ్రమ నిర్వాహకులు ఆంజనేయస్వామి, కాకినాడ నూకరాజ్, గోవింద పిరమిడ్ వ్యవస్థాపకులు భాస్కర్, జయభారత్ సంస్థ నిర్వాహకులు కళావతి, రాష్ట్ర నలుమూలల నుంచి కళాబృందాల గురువులు పాల్గొన్నారు. డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని టిటిడి ఇఒ శ్యామలరావుకు అందజేశారు.

250 బ్యాంక్ శాఖలను తెరుస్తాం

- కెనరా బ్యాంక్ సిఎండి వెల్లడి

హైదరాబాద్ : ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ ఆకర్షణీయ ఆర్థిక ఫలితాలు ప్రకటించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో 11 శాతం వృద్ధితో రూ.4,015 కోట్ల నికర లాభాలు సాధించింది. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.3,606 కోట్ల లాభాలు ఆర్జించింది. గడిచిన క్యూ2లో కెనరా బ్యాంక్ గ్లోబల్ బిజినెస్ 9.42 శాతం పెరిగి రూ.23,59,344 కోట్లకు చేరింది. గ్లోబల్ డిపాజిట్లు 9.34 శాతం వృద్ధితో రూ.13,47,347 కోట్లుగా చోటు చేసుకుంది. మంగళవారం కెనరా బ్యాంక్ ఆర్థిక ఫలితాలను ఆ బ్యాంక్ ఎండి, సిఇఒ సత్యనారాయణ రాజు వెల్లడించారు. గతేడాది 200 కొత్త శాఖలను ప్రారంభించామన్నారు. ఈ ఏడాదిలో 250 కొత్త శాఖలను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇప్పటికే 45 శాఖలను తెరిచామన్నారు. బ్యాంక్ స్థూల నిర్థక ఆస్తులు 42 బేసిస్ పాయింట్లు మెరుగుపడి 0.99 శాతానికి పరిమితమయ్యాయన్నారు. 2023 ఇదే సెప్టెంబర్ త్రైమాసికంలో 1.41 శాతం నికర ఎన్‌పిఎలు చోటు చేసుకున్నాయన్నారు. ప్రస్తుతం తమ బ్యాంక్ 9,658 శాఖలు, 9,881 ఎటిఎం కేంద్రాలను కలిగి ఉందన్నారు. విదేశాల్లో లండన్, న్యూయార్క్, దుబాయ్, ఐబియు గిఫ్ట్ సిటీల్లోనూ కార్యకలాపాలు కలిగి ఉందన్నారు.

జియో పేమెంట్స్‌కు అగ్రిగేటర్ లైసెన్స్

ముంబయి : జియో ఫైనాన్షియల్ సర్వీసెస్‌కు చెందిన జియో పేమెంట్ సొల్యూషన్స్ లిమిటెడ్ (జెపిఎస్ఎల్) ఆన్‌లైన్ పేమెంట్స్ అగ్రిగేటర్‌గా సేవలందించేందుకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బిఐ) అనుమతులు జారీ చేసింది. అక్టోబర్ 28 నుంచి సర్టిఫికేషన్ చెల్లుబాటు అవుతుందని ఆ కంపెనీ మంగళవారం స్టాక్ మార్కెట్లకు సమాచారం ఇచ్చింది. జియో ఫైనాన్షియల్, బ్లాక్‌రాక్ కలిసి రెండు జాయింట్ వెంచర్ కంపెనీలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించాయి. జియో బ్లాక్‌రాక్ అసెట్ మేనేజ్‌మెంట్, జియో బ్లాక్‌రాక్ ట్రస్టీ కంపెనీలను ఏర్పాటు చేశాయి. అవి నియంత్రణ సంస్థల ఆమోదానికి లోబడి మ్యూచువల్ ఫండ్ కార్యకలాపాలను త్వరలో ప్రారంభించనున్నాయి. తమ యాప్ ద్వారా ఎక్కడి నుంచైనా కనీస పెట్టుబడి రూ.10 నుంచి డిజిటల్ గోల్డ్ కొనుగోలు చేసుకునే సదుపాయం ఉందని జియో ఫైనాన్స్ తెలిపింది.

వేణుగోపాలరావును సన్మానిస్తున్న తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ శ్రీరంగారావు, సభ్యులు

విద్యుత్తు రంగ నిపుణులు వేణుగోపాలరావుకు సన్మానం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్తు రంగ నిపుణులు ఎం వేణుగోపాల రావును తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఘనంగా సన్మానించింది. ఉమ్మడి రాష్ట్రంలో ఎపి ఇఆర్‌సి ఏర్పడిన నాటి నుంచి (గత 30 ఏళ్లుగా) విద్యుత్ వినియోగదారుల ప్రయోజనాలే లక్ష్యంగా వేణుగోపాల రావు ఇఆర్‌సిల ముందు వాదనలు వినిపిస్తున్నారు. రాష్ట్ర విభజన తర్వాత కూడా రెండు రాష్ట్రాల ఇఆర్‌సిల బహిరంగ విచారణలకు హాజరవుతున్నారు. డిస్కంలు చేసిన ప్రతిపాదనలు సామాన్య ప్రజలకు నష్టం చేకూరేవిధంగా ఉంటే ఆయన నిర్ద్వందంగా వ్యతిరేకించేవారు. వాటికి పరిష్కారం చూపుతూ ఇఆర్‌సికి మార్గదర్శనం చేసేవారు. ఇప్పటివరకు ఐదు వేల పేజీలకు పైగా ప్రజాపయోగ ప్రతిపాదనలను కమిషన్ల ముందుంచారు. విద్యుత్ రంగంలో వేణుగోపాల రావు చేసిన సేవలకుగాను తెలంగాణ రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి ఛైర్మన్ శ్రీరంగారావు, సభ్యులు మనోహర్ రాజు, కృష్ణయ్య, కమిషన్ కార్యదర్శి రాంచందర్‌లు సోమవారం ఇఆర్‌సి కార్యాలయంలో ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వేణుగోపాలరావు సేవలను కొనియాడారు.

వైఎస్ఆర్‌కు నివాళులర్పిస్తున్న జగన్

సమస్యలపై పోరాటం చేద్దాం

- గెలవాలంటే కలిసికట్టుగా ముందుకు వెళ్దాం
- ముఖ్య నాయకులతో వైఎస్ జగన్

ప్రజాశక్తి-పులివెందుల టౌన్/వేంపల్లె

సమస్యలపై పోరాటం చేద్దామని, మళ్లీ మనం గెలవాలంటే కలిసికట్టుగా ముందుకు వెళ్లాలని కార్యకర్తలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. వైఎస్ఆర్ జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా బెంగళూరు నుంచి హెలికాప్టర్‌లో ఇడుపులపాయకు ఆయన చేరుకున్నారు. తన తండ్రి వైఎస్ఆర్ సమాధి వద్ద నివాళులర్పించారు. అనంతరం ఇడుపులపాయలోని తన గెస్ట్ హౌస్‌లో పార్టీ ముఖ్య నేతలతో సమావేశమయ్యారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మధ్య కొనసాగుతున్న వివాదంపై చర్చించి పార్టీ నేతలంతా కలిసికట్టుగా ముందుకెళ్లాలని ఆదేశించారు. పులివెందులలో ఏర్పాటు చేసిన ప్రజా దర్బార్‌లో పాల్గొని ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చకపోతే పోరాటం చేసేందుకు సిద్ధంగా ఉంటామన్నారు. అనంతరం సివిల్ సప్లయి మాజీ డైరెక్టర్ షబ్బీర్ వలి కుటుంబ సభ్యులను పలకరించారు. పులివెందుల సమీపంలోని మెడికల్ కళాశాల వద్ద జగన్ సెల్ఫీ తీసుకున్నారు. మెడికల్ కాలేజీకి వచ్చిన సీట్లను టిడిపి కూటమి ప్రభుత్వం వెనక్కి పంపిందని, కాలేజీని నిర్వీర్యం చేస్తోందని విమర్శించారు. జగన్ పర్యటనలో కడప ఎంపి అవినాష్‌రెడ్డి, ఎమెల్సీలు రామచంద్రారెడ్డి, రామసుబ్బారెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమరనాథరెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, మాజీ ఎమ్మెల్యేలు రాచమల్లు ప్రసాద్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, కొరముట్ల శ్రీనివాసులు, సుధీకర్‌రెడ్డి, మేయర్ సురేష్ బాబు, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్మికులు, నేతలు

బైండోవర్ కేసులతో వేధింపులు

- ఆపకుంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం
- ప్రభుత్వం జోక్యం చేసుకుని కార్మికుల సమస్యలు పరిష్కరించాలి : సిపిఎం

ప్రజాశక్తి-తాడేపల్లి (గుంటూరు జిల్లా)

సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులపై అధికారుల వేధింపులు ఇలాగే కొనసాగితే జిల్లా వ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు హెచ్చరించారు. గుంటూరు జిలా తాడేపల్లిలో ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ భూముల్లో కార్మికుల భూ పోరాటం కొనసాగింది. మూడో రోజు మంగళవారం కూడా కార్మికులు కర్రలతో ఇళ్ల నిర్మాణం చేశారు. ఈ సందర్భంగా ఫ్యాక్టరీ స్థలంలో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద నిర్వహించిన సమావేశంలో పాశం రామారావు మాట్లాడుతూ.. ఎన్ఆర్ఐ ముక్కామల అప్పారావు ఫిర్యాదు మేరకు సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు, యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్, ఎస్‌కె భాష, వై సుబ్బారావు, సూర్య ప్రకాష్, వెంకటరత్నం, ఆశీర్వాదం తదితరులను పోలీసులు తీసుకెళ్లి తహశీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేయడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. కోర్టు తీర్పులను ధిక్కరించిన వారిపై కేసులు నమోదు చేసి శిక్షించాల్సిన పోలీసులు, తమకు న్యాయంగా రావాల్సిన బకాయిలు అడిగిన కార్మికులపై కేసులు నమోదు చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. మంత్రి నారా లోకేష్ జోక్యం చేసుకొని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను సామరస్యంగా పరిష్కరించాలని కోరారు. లేనిపక్షంలో ఉత్పన్నమయ్యే సమస్యలకు ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఫ్యాక్టరీ భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకుని కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. న్యాయమైన ఈ పోరాటానికి అన్ని ప్రజా సంఘాలు సంపూర్ణ మద్దతును కూడగడతామని అన్నారు. ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల పోరాటానికి సిపిఎం నాయకులు దొంతి రెడ్డి వెంకటరెడ్డి, బూరుగ వెంకటేశ్వర్లు, సిఐటియు నాయకులు వేముల దుర్గారావు, ఎఐఎఫ్‌టియు నాయకులు కోటేశ్వరరావు తమ సంపూర్ణ మద్దతు తెలిపి మాట్లాడారు.

గుంతకల్లు బ్రాంచి కెనాల్‌ను పరిశీలిస్తున్న సిపిఐ నాయకులు

సాగునీటి కాలువలను అభివృద్ధి చేయండి

- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి-గుంతకల్లు టౌన్

అనంతపురం జిల్లాలో హంద్రీనీవా కాలువ సామర్థ్యాన్ని పెంచి ఆధునీకరణకు రూ.రెండు వేల కోట్లు కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ డిమాండ్ చేశారు. కర్నూలు జిల్లా పందికోన నుంచి అనంతపురం జిల్లా ఉరవకొండ వరకు హంద్రీనీవా కాలువను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ.. తుంగభద్ర డ్యాం నుంచి హెచ్ఎల్‌సి ద్వారా సక్రమంగా నీరు వస్తే గుంతకల్లు, ఆలూరు బ్రాంచ్ కాలువలకు కేటాయించిన నీటిని వాడుకోవడానికి అవకాశం ఉంటుందన్నారు. రాయలసీమ ప్రాంతాల్లో హంద్రీనీవా కాలువ ద్వారా 6.04 లక్షల ఎకరాలకు సాగునీరు, 30 లక్షల మందికి తాగునీరు ఇవ్వాల్సి ఉందన్నారు. పాలకులు ఈ దిశగా స్పందించడం లేదన్నారు. సాగు నీటి కాలవలను అభివృద్ధి చేయాలని కోరుతూ త్వరలో ముఖ్యమంత్రిని కలుస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.జగదీష్, జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్ర స్వామి తదితరులు పాల్గొన్నారు.

అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభాలు 664 శాతం వృద్ధి



న్యూఢిల్లీ : ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబర్‌తో ముగిసిన ద్వితీయ త్రైమాసికం (క్యూ2)లో అదానీ ఎంటర్‌ప్రైజెస్ నికర లాభాలు 664 శాతం పెరిగి రూ.1,742 కోట్లకు ఎగిశాయి. గతేడాది ఇదే త్రైమాసికంలో రూ.228 కోట్ల లాభాలు ప్రకటించింది. అదే సమయంలో రూ.19,546 కోట్లుగా ఉన్న రెవెన్యూ.. గడిచిన క్యూ2లో 16 శాతం పెరిగి రూ.22,608 కోట్లకు చేరింది. మంగళవారం జరిగిన కంపెనీ బోర్డు మీటింగ్‌లో రూ.2,000 కోట్ల నిధుల సమీకరణ కోసం గాను నాన్ కన్వర్టేబుల్ డిబెంచర్లు (ఎన్‌సిడి)లు జారీ చేయాలని నిర్ణయించింది.

సంపాదకీయం

ముందడుగు

భారత, చైనాల మధ్య వాస్తవాధీన రేఖ (ఎల్‌ఎసి) పొడవునా నాలుగున్నరేళ్లుగా సాగుతున్న వివాదానికి తెరపడటం ముదావహం.. 2020 నాటి పరిస్థితి పునరుద్ధరణకు ఇరు దేశాలు నిర్ణయించడంతో ఉద్రిక్తతలు సడలి, సరిహద్దుల్లో మళ్లీ శాంతి పవనాలు వీయడం ఆహ్వానించదగ్గ పరిణామం.

లడఖ్‌లోని గాల్వాన్ నది నుంచి షొంగోంగ్ నది వరకూ ఉన్న ప్రాంతానికి సంబంధించిన వివాదం చినికి చినికి గాలివానైనట్లుగా 2020 జూన్ 15లో గాల్వాన్ ఘర్షణలకు దారి తీసింది. 1962 భారత్ – చైనా యుద్ధం తరువాత 58 ఏళ్లకు జరిగిన ఈ ఘర్షణలో భారత్‌కు చెందిన 20 మంది, చైనాకు చెందిన నలుగురు సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఫలితంగా ద్వైపాక్షిక సంబంధాలు దెబ్బతిన్నాయి. చైనాకు చెందిన టిక్ టాక్ వంటి ప్రసిద్ధ యాప్‌లపై నిషేధం, ఆ దేశానికి చెందిన అధునాతన సాంకేతిక పరిజ్ఞానం, ఉత్పత్తులు, పెట్టుబడులపై భారత ప్రభుత్వం ఆంక్షలు విధించింది. ఈ ఆంక్షలు భారత్‌పై ప్రతికూల ప్రభావం చూపుతున్నాయని భారత పరిశ్రమల సమాఖ్య ఆందోళన వ్యక్తం చేసిందంటే పరిస్థితి ఏమిటో అర్థమవుతుంది. ఇన్ని ఆంక్షలు, నిషేధాలు ఉన్నా భారత్ అతి పెద్ద వాణిజ్య భాగస్వామిగా చైనా ఇప్పటికీ కొనసాగుతున్నది.. ఏప్రిల్ – సెప్టెంబర్ మధ్య 56, 290 కోట్ల డాలర్ల వాణిజ్యమే ఇందుకు నిదర్శనం. మ్యానుఫాక్చరింగ్ రంగంలోకి చైనా టెక్నాలజీ, పెట్టుబడుల అడ్డుకోవడం తప్పిదమే. ఇరుదేశాల విదేశాంగ మంత్రులు, జాతీయ భద్రతా సలహాదారు మధ్య పలుమార్లు జరిగిన చర్చలు, డబ్ల్యుఎంసిసి నిపుణుల కమిటీ, కోర్ కమాండర్ల మధ్య పదుల సంఖ్యలో చర్చలు సానుకూల ఫలితాలనిచ్చాయి. నాటి ఘటన తరువాత ఉద్రిక్తతలు రెచ్చగొట్టేందుకు, చైనా వ్యతిరేకత పెంచేందుకు ఇక్కడి మితవాద, మతతత్వ శక్తులు యత్నించి భంగపడ్డాయి.

ఇరు దేశాలు హిమాలయాల దగ్గర నుంచి నదులు, లోయల మీదుగా 3,400 కిలోమీటర్ల పొడవున్నా సరిహద్దును పంచుకుంటున్నాయి. కొన్ని నదులు సహజంగానే వేసవిలో మార్గాన్ని మార్చడంతో సరికొత్త సరిహద్దు తగాదాలకు ఆస్కారమేర్పడుతోంది. సరిహద్దుకు సంబంధించి కచ్చితమైన విభజన రేఖ రూపుదిద్దుకునేంత వరకు ఎక్కడో ఒక దగ్గర వివాదాలు, ఉద్రిక్తతలు తలెత్తవచ్చు. వాటిని నివారించేందుకు ఏం చేయాలన్నదానిపై ఇరు దేశాల మధ్య మరింత ఎక్కువగా చర్చలు జరగాలి. సైనికులు వివాదాస్పద ప్రాంతాలను క్రమం తప్పకుండా సందర్శించి, కొన్ని జాడలను విడిచిపెడతారు. సరిహద్దు ఆక్రమణలు అని పిలవబడే వందలాది ఘటనలు అడపాదడపా చోటుచేసుకుంటుంటాయి.. వీటిని రాజకీయంగా ఉపయోగించుకునేందుకు కొన్ని శక్తులు యత్నిస్తుంటాయి. వాటి ఆధీనంలోని కార్పొరేట్ ప్రచార బాకాలు దీనికి మరింత మసాలా దట్టించి పొరుగు దేశంపై వ్యతిరేకతను రెచ్చగొట్టేందుకు యత్నిస్తుండడం మనం చూస్తున్నాం. సరిహద్దుల్లో శాంతి, ప్రశాంతత కొనసాగించేందుకు, వివాదాన్ని పరిష్కరించేందుకు 1993, 2003, 2005లో కుదిరిన ఒప్పందాలను ఇరు దేశాలు అమలు చేయకపోవడం వల్లే ఈ సమస్యలు తలెత్తుతున్నాయి. గాల్వాన్ ఘటన జరిగిన మూడు నాలుగు నెలల్లోనే ఇరు దేశాలు చర్చల ప్రక్రియను పునరుద్ధరించడం, దౌత్యపరంగా, మిలట్రీపరంగా చేసిన కృషి వల్లే ఇది సాధ్యమైందని విదేశాంగ మంత్రి జైశంకర్ సరిగానే వ్యాఖ్యానించారు.. చాలా ఓపికగా, నికరంగా సాగించిన దౌత్య నీతి ఫలితమే ఈ ఒప్పందమనడంలో ఎలాంటి సందేహానికి తావు లేదు. బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు సందర్భంగా రష్యాలోని కజాన్‌లో ప్రధాని నరేంద్ర మోడీ, చైనా అధ్యక్షుడు సీ జిన్‌పింగ్ ప్రత్యేకంగా సమావేశమై ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి కృత నిశ్చయం వ్యక్తం చేయడం ఆహ్వానించదగ్గ పరిణామం. .

ఇరు దేశాలు ప్రపంచంలో అత్యధిక జనాభా గల దేశాలు. ఆర్థిక పరంగా రెండవ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా వున్న చైనా, అయిదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్ మధ్య సత్సంబంధాలు ఈ ఇరు దేశాల ప్రయోజనాలకే కాదు, ఆసియా ఖండ అభివృద్ధికి, తద్వారా ప్రపంచ అభివృద్ధికి చాలా కీలకం. భారత్ ఇప్పటికే అమెరికా నిర్దేశిత ఇండో పసిఫిక్ వ్యూహంలో ప్రధాన భాగస్వామిగా చేరడం ద్వారా పొరుగు దేశానికి తప్పుడు సంకేతాలు ఇస్తున్నది. అమెరికాను నమ్ముకునే కన్నా పొరుగు దేశమైన చైనాతో సంబంధాల మెరుగుదల దేశానికి ఎంతో ప్రయోజనకరం. అణ్వాయుధాలు కలిగిన ఈ రెండు అతి పెద్ద దేశాల మధ్య శాంతి, సుహృద్భావ సంబంధాలు నెలకొనడం అత్యంతావశ్యకం. సరిహద్దుల్లో ఉద్రిక్తతల నివారణకు భారత్, చైనా తాజాగా కుదుర్చుకున్న ఒప్పందం ఆ దిశగా వేసిన ఒక ముందడుగు అనే చెప్పాలి.

మహనీయుల మాట

మనిషిని మనిషి, దేశాన్ని ఇంకో దేశం
దోచే విధానం అంతం కానిదే...
సామ్రాజ్యవాదం పేర చలాయిస్తున్న
పెత్తనాన్ని అంతం చేయనిదే...
మానవజాతి అనుభవిస్తున్న బాధలు,
దోపిడీ నివారింపబడవు.
దీనిని అంతం చేయకుండా
యుద్ధాలు వద్దని, శాంతి కావాలని
చెప్పే కబుర్లు
ఒట్టి నయవంచనే.

\- భగత్ సింగ్



'హిందూ రాష్ట్ర'ను పునరుద్ఘాటించిన భగవత్

విశ్లేషణ

రామ్ పునియాని

ఆర్‌ఎస్‌ఎస్ వ్యవస్థాపక దినమైన అక్టోబరు 12, విజయదశమి రోజున ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ డాక్టర్ మోహన్ భగవత్ ప్రసంగించారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో బిజెపి దిగజారిన తర్వాత ఆయన చేసిన మరో ముఖ్యమైన ప్రసంగం నేపథ్యంలో ఇది జరిగింది. ఆ ప్రసంగంలో ఆయన నరేంద్ర మోడీని లక్ష్యంగా చేసుకున్నారు. తాను మానవ మాత్రుడ్ని కాదని, దేవుడు తనను పంపాడని మోడీ చెప్పుకుంటున్నారని ఆయన వ్యాఖ్యానించారు. బిజెపి 303 సీట్ల నుండి 240 సీట్లకు పడిపోయిన నేపథ్యంలో భగవత్ మాట్లాడుతూ, 'ఒక వ్యక్తి సూపర్‌మ్యాన్‌గా వుండాలని కోరుకుంటాడు. ఆ తర్వాత దేవ దూత కావాలని, అటుపై భగవాన్ కావాలని కోరుకుంటాడు.' అని వ్యాఖ్యానించారు. గతంలో అంత సామర్థ్యం లేనందున తాము ఆర్‌ఎస్‌ఎస్ సాయం కోరామని, కానీ ఇప్పుడు మరింత సామర్థ్యాన్ని సముపార్జించుకున్నామని బిజెపి పేర్కొన్న మొదటి ఎన్నికలు కూడా ఇవే కావచ్చు.

భగవత్ ఈ ప్రసంగంతో నరేంద్ర మోడీ తలకెక్కిన అహంకారాన్ని కిందకు దించారు. సంఘపరివార్‌గా పిలిచే ఆర్‌ఎస్‌ఎస్ కూటమి హర్యానా ఎన్నికల్లో అతి చురుగ్గా పనిచేసింది. దానికి తోడు ఎన్నికల కమిషన్ మేనిపులేషన్ సాయంతో బిజెపి అధికారంలోకి వచ్చింది. కాంగ్రెస్ తప్పకుండా గెలుస్తుందనే భావనను పక్కకు నెట్టి మరీ బిజెపి ఈ విజయాన్ని మూటగట్టుకుంది.

తాజాగా దసరా ప్రసంగంలో ఆయన బిజెపి విధానాలనే చాలా వరకు ఏకరవు పెట్టారు. బిజెపి యేతర ప్రభుత్వాలు వున్న రాష్ట్రాల్లో ఆర్‌ఎస్‌ఎస్ లక్ష్యాలను, కీలకమైన హిందూత్వ రాజకీయాలను ఎలా తీసుకెళ్లాలో చెప్పారు. 'డీప్ స్టేట్', 'వోకిజమ్', 'కల్చరల్ మార్క్సిస్ట్' వంటి పదాలన్నీ సాంస్కృతిక సంప్రదాయాలకు శత్రువులు. ఇందుకు వారు అనుసరించే పద్ధతి ముందుగా విద్యా సంస్థలను తమ ప్రభావం కిందకు తీసుకోవాలనుకుంటారు. ఆ తర్వాత ఆలోచనలను, విలువలను, సమాజ విశ్వాసాలను నాశనం చేయడానికి వారు ప్రయత్నిస్తారు. అటుపై సమస్యలను కృత్రిమంగా సృష్టించి, ప్రజల్లో తాము బాధితులమనే భావనను పాదుకొల్పడానికి ప్రయత్నిస్తారు. ఆ తర్వాత, అసమ్మతిని రెచ్చగొడతారు. ప్రజలు దూకుడుగా వ్యవహ రించేలా చేస్తారు. ఒక అరాచక వాతావరణాన్ని సృష్టిస్తారు. వ్యవస్థ పట్ల చట్టాలు, పాలన పట్ల ప్రజల్లో విద్వేషం నెలకొనేలా చేస్తారు. ఇవన్నీ చేసిన తర్వాత దేశంపై ఒకరి ఆధిపత్యం లేదా పెత్తనం చెలాయించడమన్నది చాలా సులభతరమై పోతుంది." అని చెప్పుకొచ్చారు.

సామాజిక, రాజకీయ అన్యాయాలను సహించలేని ప్రజల ప్రవర్తన, వారి వైఖరులను ఉద్దేశిస్తూ, పెద్దగా ప్రాచుర్యంలో లేని పదం వోకిజం (మేల్కొలుపు)ను అత్యంత అవమాన కరమైన రీతిలో మితవాదులు ఉపయోగించారు. ఆయన చేసిన ప్రసంగంలో ఇదే కీలకమైన వాక్యం. సామాజిక రాజకీయ వర్గాల్లో హిందూ మితవాదం ఆధిపత్యం చెలాయించేంత ఆర్‌ఎస్‌ఎస్ కూటమే ఈ పద్ధతిని అమలు చేస్తోంది. తన శాఖల ద్వారా అంటే సరస్వతి శిశు మందిర్, ఏకలవ్య విద్యాలయాలు వంటి పాఠశాలల ద్వారా అలాగే తనకున్న విస్తృత నెట్‌వర్క్ ద్వారా నోటి ప్రచారం ద్వారా దీనిని ముందు తనకు అలాగే కుల, లింగ వివక్ష వ్యవస్థను పెంచుతున్న సామాజిక ఇంగిత జ్ఞానాన్ని (సోషల్ కామన్‌సెన్స్) తన విస్తృత నెట్‌వర్క్ ద్వారా ఇది ప్రభావితం చేస్తోంది. ఇక చివరగా బిజెపి సానుభూతి గల కార్పొరేట్, ఐ.టి విభాగాలు మీడియాను నియంత్రించడం ద్వారా సమాజంలోని పెద్ద వర్గం ఆలోచనా ధోరణిని హిందూ జాతీయవాద కార్యాచరణ రూపు దిద్దుతోంది.

ఇప్పుడు వోకిజం (మేల్కొలుపు) ఏం చేస్తుంది? న్యాయమైన సమాజం కోసం ఇది ఆకాంక్షిస్తుంది, పోరాడుతోంది. కులం, మతం, రంగు, భాషల ప్రాతిపదికగా వివక్షను ప్రదర్శించడాన్ని ఇది వ్యతిరేకిస్తుంది. ఎల్.జి.బి.టి హక్కులకు మద్దతిస్తుంది. అన్ని జీవుల సమానత్వపు హక్కులను హిందూ జాతీయవాద రాజకీయాల్లో చాలా కీలకమైన బ్రాహ్మణవాదం తీవ్రంగా వ్యతిరేకిస్తుంది. దీన్నే మరికొద్దిగా స్పష్టంగా, సూటిగా చెప్పాలంటే పలు రకాల రాజకీయ ధోరణులకు మతం ముసుగు వేస్తారు. తాలిబన్, ముస్లిం బ్రదర్‌హుడ్, అలాగే శ్రీలంక, మయన్మార్‌లలో బౌద్ధ మతం పేరుతో రాజకీయాలు, అసమానతలను పెంచి పోషిస్తున్న క్రైస్తవ ఛాందసవాదం ఇవన్నీ ఆ కోవలోకే వస్తాయి. స్థానిక పరిస్థితులపై ఆధారపడి వారు భిన్న వ్యక్తీకరణలకు పాల్పడుతుంటారు.



> **బలహీనులుగా వుండే తమని తాము రక్షించుకోలేరని...అందువల్ల ఐక్యంగా, బలంగా వుండాలంటూ హిందువులను భగవత్ కోరడం ఆయన ప్రసంగంలో అత్యంత ముఖ్యమైన అంశంగా వుంది. భారతీయులుగా మనందరం సమైక్యంగా వుండనక్కరలేదా? భారత రాజ్యాంగం ప్రకారం భారతీయులుగా సమైక్యతతో వుండడంలో ఏదైనా సమస్య వుందా? భగవత్ వైపు నుండి మరో రకంగా ఆలోచించినట్లైతే ఇది కూడా కుతర్కమే అవుతుంది. ఎందుకంటే భారత రాజ్యాంగం పట్ల వారి విశ్వాసం కూడా ఎన్నికల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే వుంటుంది.**

మరో రకంగా చూసినట్లైతే, హిందూ జాతీయవాద సిద్ధాంత వ్యవస్థాపకులు, దళితులను, మహిళలను కించపరుస్తున్న మనుస్మృతిని ప్రశంసించారు. ముస్లింలు, క్రైస్తవులను కూడా ఆర్‌ఎస్‌ఎస్ విదేశీయులుగానే పరిగణిస్తోంది. 1984లో సిక్కుల ఊచకోతకు రహస్యంగా మద్దతిచ్చింది. ఒక సమాజంలో సామాజిక ఉద్యమాల లక్ష్యమైన సమానత్వపు విలువలను ముందుకు తీసుకెళ్ళడానికి చూస్తున్నందున వోకిజాన్ని ఒక దుష్ట శక్తిగా, రుగ్మతగా మితవాద రాజకీయాలు భావిస్తున్నాయి. అణచివేతకు గురైన వర్గాలు చేసే చాలా ఉద్యమాల బలమైన కోరికే ప్రజాస్వామ్యం, దీనికోసమే ఇదంతా. భారతదేశంలో దళితులు, మహిళలు, ఎల్.జి.బి.టి చేపట్టే ఉద్యమాలను హిందూ జాతీయవాదులు తక్కువ చేసి చూస్తున్నారు. ఛాందసవాద శక్తులు పాలన సాగించే ముస్లిం మెజారిటీ దేశాల్లో మహిళలు ప్రధాన లక్ష్యాలుగా మారుతున్నారు. సమానత్వపు విలువల స్థానే అసమాన విలువలతో కూడిన ప్రాచీన స్వర్ణయుగపు విలువలను ప్రవేశపెట్టాలన్నది ఆర్‌ఎస్‌ఎస్ కూటమి ప్రయత్నంగా వుంది. అణగారిన వర్గాల హక్కులను పెంపొందించే ఆలోచనలు, ఉద్యమాల కోసం ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతకర్తలు ఈ వోకిజం పదాన్ని ఉపయోగిస్తున్నారు.

ఆర్‌ఎస్‌ఎస్, బిజెపిల మధ్య అంతర్గత ఘర్షణలు వారికే సంబంధించిన ప్రైవేటు అంశం. కాగా వాటి మధ్య ఇగో ఘర్షణలు వున్నప్పటికీ ఈ రెండు సంస్థల మౌలిక విలువలు ఒక్కటే. ఇతర విషయాలు చాలా వాటిల్లో బిజెపి ఏం చెబుతోందో భగవత్ కూడా అదే చెబుతారు. "ఈ కారణంగా నేడు, దేశంలోని వాయవ్య సరిహద్దుల్లోని పంజాబ్, జమ్మూ కాశ్మీర్, లడఖ్‌లు, సముద్ర హద్దులు కలిగిన కేరళ, తమిళనాడులు, బీహర్ నుండి మణిపూర్ వరకు మొత్తంగా పూర్వాంచల్ ప్రాంతాలు కల్లోలమయ్యాయి." అంటూ బిజెపి యేతర పాలిత రాష్ట్రాలను ఆయన విమర్శించారు. లడఖ్‌ను, మణిపూర్‌ను ఒక గాటన కట్టడం ద్వారా వారి అసలు రంగు కూడా బయటపడింది.

మణిపూర్‌లో కుకీలకు వ్యతిరేకంగా మరీ ముఖ్యంగా మహిళలపై అత్యంత హేయమైన రీతిలో హింస చోటు చేసుకుంది. ఈ విషయంలో బిజెపి ప్రభుత్వ ఉదాసీనత మరింత ఆందోళన కలిగిస్తోంది. లడఖ్‌కు సంబంధించినంతవరకు పర్యావరణాన్ని పరిరక్షించేందుకై, సమాన పౌరసత్వం కోసం అనేక ఉద్యమాలను మనం చూశాం. పోరాటాలు చేయాల్సినంత తీవ్రమైన అంశాలే అవి. ఎంత శాంతియుతమైన పోరాటం అది? గుర్తించదగినటువంటి సోనమ్ వాంగ్‌చుక్ నాయకత్వం గురించి స్వర్ణాక్షరాలతో రాయవచ్చు.

అలాగే ఆర్‌ఎస్‌ఎస్ నుండి ఉద్భవించిన బిజెపి మొత్తంగా ఈ లడఖ్ ఉద్యమాన్ని ఏ విధంగా నిర్లక్ష్యం చేసిందో కనిపిస్తోంది. ఇది భారతదేశ సమకాలీన చరిత్రలో ఒక చీకటి అధ్యాయం.

ఆర్.జి కర్ మెడికల్ కాలేజీ విషాద ఘటన గురించి ప్రస్తావించడం, మరోవైపు మహిళా రెజ్లర్లపై జరిగిన అత్యాచారాలు దళిత బాలికలపై పెరుగుతున్న అత్యాచారాల పట్ల మౌనం పాటించడం చూస్తుంటే ఆయన పక్షపాతం అర్థమవుతోంది. అత్యాచారమనేది ఇండియా (పట్టణ) ప్రాంతాల్లో జరుగుతుంది తప్ప భారత్ (గ్రామాల్లో)లో జరగదని ఈ మహానుభావుడు ఒకసారి వ్యాఖ్యానించారు. కానీ ఇటువంటి కేసుల్లో చాలా శాతం బిజెపి పాలిత రాష్ట్రాల్లోనే చోటు చేసుకుంటున్నాయి. అవి కూడా గ్రామాల్లోనో లేదా చిన్న పట్టణాల్లోనో జరుగుతున్నాయి. ఇలాంటి కేసులు అంటే దళితులపై అత్యాచారాలు 2022లో ఉత్తరప్రదేశ్‌లో 12,287 చోటు చేసుకోగా తర్వాత స్థానంలో రాజస్థాన్ (8,651), మధ్యప్రదేశ్ (7,732) నమోదవుతున్నాయని, సామాజిక న్యాయం, మహిళా సాధికారత మంత్రిత్వ శాఖ విడుదల చేసిన నివేదిక పేర్కొంది. ఇది ఆందోళనకరమైన పరిణామం.

బలహీనులుగా వుండే తమని తాము రక్షించుకోలేరని...అందువల్ల ఐక్యంగా, బలంగా వుండాలంటూ హిందువులను భగవత్ కోరడం ఆయన ప్రసంగంలో అత్యంత ముఖ్యమైన అంశంగా వుంది. భారతీయులుగా మనందరం సమైక్యంగా వుండనక్కరలేదా? భారత రాజ్యాంగం ప్రకారం భారతీయులుగా సమైక్యతతో వుండడంలో ఏదైనా సమస్య వుందా? భగవత్ వైపు నుండి మరో రకంగా ఆలోచించినట్లైతే ఇది కూడా కుతర్కమే అవుతుంది. ఎందుకంటే భారత రాజ్యాంగం పట్ల వారి విశ్వాసం కూడా ఎన్నికల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకునే వుంటుంది.

(రచయిత బయోమెడికల్ ఇంజినీరింగ్ విశ్రాంత ఆచార్యుడు)

('న్యూస్ క్లిక్' సౌజన్యంతో)

జపాన్ పాలక పార్టీకి చావు దెబ్బ !

అంతర్జాతీయం

ఎం.కోటేశ్వరరావు

ఆదివారం నాడు జరిగిన పార్లమెంటు ఎన్నికలలో జపాన్ పాలక లిబరల్ డెమోక్రటిక్ పార్టీ (ఎల్.డి.పి)కి చావు దెబ్బ తగిలింది. అయితే దాని అధికారం పదిలంగా ఉంటుందని చెబుతున్నారు. పార్లమెంటులోని దిగువ సభలో ఉన్న 465 స్థానాలకు గాను గత ఎన్నికలలో 34.66 శాతం ఓట్లు, 259 సీట్లు తెచ్చుకున్న ఎల్.డి.పి ఈ సారి 26.73 శాతం ఓట్లు, 191 సీట్లతో సరిపెట్టుకుంది. మిత్రపక్షం కొమిటో పార్టీ పొందిన 24తో కలిపి 215 మాత్రమే తెచ్చుకుంది. సాధారణ మెజారిటీ 233 స్థానాలను ఏ పార్టీ కూడా గెలుచుకోలేక పోయింది. ఇరవై ఎనిమిది సీట్లు తెచ్చుకున్న డిపిపి కింగ్‌మేకర్‌గా మారిందని చెబుతున్నారు. దీంతో మరోసారి సంకీర్ణ ప్రభుత్వం ఏర్పడటం లేదా పార్టీలలో చీలిక అనివార్యంగా కనిపిస్తోంది. మద్దతు కూడగట్టేందుకు వివిధ పార్టీలతో ప్రధాని షిగెరు షిబా మంతనాలు జరుపుతున్నాడు. అధికారాన్ని అడ్డం పెట్టుకొని పాలక పార్టీ పెద్దలు పెద్ద మొత్తంలో విరాళాల వసూలు, వాటిలో కొంత నొక్కేయటం వంటి విమర్శల సునామీలో పాలక పార్టీ ఓడిపోయింది. ఎల్.డి.పి జపాన్‌లో అవినీతికి పెట్టింది పేరు. అయినప్పటికీ అక్కడి ఓటర్లు దానికి దశాబ్దాల పాటు పట్టం కడుతూనే ఉన్నారు. ఈ సారి ఓడించారంటే వారి సహనానికి అవినీతిపరులు పరీక్ష పెట్టినట్లుగా కనిపిస్తోంది. పాలక పార్టీకి చెందిన మాజీ ప్రధానులు షింజో అబే, ఫుమియో కిషిడాతో సహా 82 మంది ఎంపీలు స్వంత ఖాతాలకు నిధులు మళ్లించుకున్నట్లు విమర్శలు వచ్చాయి. దీనికి తోడు ఆర్థిక మాంద్యంతో దేశం కొట్టుమిట్టాడుతున్నది. దాన్నుంచి బయట పడవేసే మార్గం కనిపించటం లేదు. ఇవన్నీ పాలక పార్టీ, దాని మిత్ర పక్షాన్ని దెబ్బ తీశాయి. అవినీతి ఆరోపణలు ఉన్నవారిని దూరంగా పెడతామని చెప్పినప్పటికీ కొద్ది మందినే పోటీ నుంచి తప్పించటం, ఎక్కువ మందికి నిధులు కూడా సమకూర్చారనే విమర్శలు వెల్లువెత్తాయి. జనంలో అనుమానం, ఆగ్రహం తమను దెబ్బతీశాయని ప్రధాని షిబా చెప్పాడు. అవినీతి ఆరోపణల పూర్వరంగంలో ఆగస్టు నెలలో కిషిదా రాజీనామా చేయగా అధికారానికి వచ్చిన షిబా మరుసటి నెలలోనే పార్లమెంటును రద్దు చేసి మధ్యంతర ఎన్నికలకు తెరతీశాడు. వ్రతం చెడినా ఫలం దక్కలేదు.

రోజూ గంటల తరబడి ఓవర్ టైమ్ చేస్తే తప్ప కార్మికులకు గడవని స్థితి. దీంతో రెండవ ప్రపంచ యుద్ధం నాటి నుంచి అలాంటి వాతావరణానికి జనాన్ని అలవాటు చేశారు. దేశం దుస్థితి నుంచి బయట పడాలంటే వ్యక్తిగత జీవితాలను త్యాగం చేయాలంటూ దేశభక్తి నూరిపోశారు. అయితే జపనీయులు ఎక్కువ గంటలు పని చేస్తారంటూ ముద్దు పేరు పెట్టి సమర్థించుకుంటారు. అధిక పని కారణంగా మరణాలు కూడా అక్కడ సర్వసాధారణమే. వాటిని 'కరోషి' అంటున్నారు. ప్రతి పది మందిలో ఒకరు నెలకు 80 గంటలు ఓవర్ టైమ్ చేస్తున్నారు. ప్రతి ఐదు మందిలో ఒకరు కరోషి గుండెపోటు లేదా పని ఒత్తిడితో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఒకనాటి అద్భుతంగా వర్ణించిన అంశం ఇప్పుడు జాతీయ ఆరోగ్య సమస్యగా మారింది. ఈ పరిస్థితిని మార్చాలని కొందరు డిమాండ్ చేస్తున్నప్పటికీ కార్పొరేట్లు అందుకు అంగీకరించటం లేదు. అబెనోమిక్స్ పేరుతో మాజీ ప్రధాని షింజో అబె అనుసరించిన విధానాలు స్టాక్ మార్కెట్లో మదుపు చేసిన వారికి లాభాలు తెచ్చాయి తప్ప కార్మికులకు ఎలాంటి ప్రయోజనమూ చేకూరలేదు. దీనికి తోడు ద్రవ్యోల్బణం, కరెన్సీ విలువ దిగజారుడు, నిరుద్యోగ సమస్య కూడా తోడు కావటంతో కార్మికవర్గం ఆగ్రహించింది.

ఎన్నికల్లో ఎదురుదెబ్బ తగిలినప్పటికీ తన పదవికి ఎలాంటి ఢోకా లేదని ప్రధాని షిగెరు షిబా చెప్పాడు. ఏ పార్టీ లేదా కూటమికీ మెజారిటీ లేనందున ఎన్నికలు జరిగిన 30 రోజుల్లోగా తమ బలాన్ని నిరూపించుకోవాల్సి ఉంటుంది. ప్రతిపక్షాలకు అంత బలం లేనందున మైనారిటీ ప్రభుత్వాన్ని ఎల్‌డిపి కొనసాగించగలదని కొందరు భావిస్తున్నారు. ఇషిబా రెండవసారి మంత్రివర్గాన్ని ఏర్పాటు చేస్తే సరి లేకుంటే రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అతి తక్కువ రోజులు అధికారంలో ఉన్న ప్రధానిగా చరిత్రకు ఎక్కుతాడు. రెండవ పెద్ద పార్టీగా అవతరించిన కాన్‌స్టిట్యూషనల్ డెమోక్రటిక్ పార్టీ తన బలాన్ని 96 నుంచి 148కి మాత్రమే పెంచుకుంది. ఎల్.డి.పి లో మాజీ ప్రధాని షింజో అబే వర్గం ప్రస్తుత ప్రధాని షిబా పట్ల సానుకూలంగా లేదని, అధికార పార్టీలో చీలిక రావచ్చని కూడా జోశ్యం చెబుతున్నారు. వచ్చే ఏడాది జులైలో ఎగువ సభ ఎన్నికలు జరగాల్సి వుంది. జపాన్ మిలిటరీ పాత్రను పెంచేందుకు రాజ్యాంగంలోని ఆర్టికల్ తొమ్మిదిని సవరించాలని ఎల్.డి.పి ఎప్పటి నుంచో చెబుతున్నది. తద్వారా ప్రపంచ మార్కెట్లలో తన వంతు వాటాను పొందవచ్చని జపాన్ పాలకవర్గం భావిస్తున్నది. చైనాకు వ్యతిరేకంగా అమెరికా ప్రతిపాదిస్తున్న "ఆసియన్ నాటో" కూటమికి నాయకత్వం వహించాలని అది భావిస్తున్నది. అయితే అలాంటి సవరణను కమ్యూనిస్టు పార్టీతో సహా ప్రధాన ప్రతిపక్షాలన్నీ వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పుడు పాలక కూటమి మైనారిటీలో పడినందున ఆ ఎజెండాను పక్కన పెట్టవచ్చు.

ప్రధాని షిగెరు షిబా

అమెరికాతో అంతకంతకూ దగ్గర అవుతూనే చైనాతో సంబంధాలను విడగొట్టుకొనేందుకూ జపాన్ పాలకవర్గం సిద్ధం కావటం లేదు. ఎందుకంటే చైనాతో వాణిజ్యం వారికి ఎంతో అవసరం. ఎన్నికలు జపాన్ అంతర్గత వ్యవహారమని తాము దాని గురించి చెప్పాల్సిందేమీ లేదని చైనా ముక్తసరిగా వ్యాఖ్యానించింది. ప్రతిపక్షాల్లో 148 సీట్లు తెచ్చుకున్న సిడిపి, 38, 28 చొప్పున సీట్లు పొందిన జెఐపి, డిపిపి పార్టీలు తాము చేతులు కలిపే అవకాశం లేదని అంశాల వారీగా ప్రభుత్వానికి మద్దతు లేదా వ్యతిరేకతను వెల్లడిస్తామని పేర్కొన్నాయి. అయితే స్వతంత్రులు, చిన్న పార్టీలను కలుపుకొని ప్రత్యామ్నాయ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే అవకాశమూ లేకపోలేదని భావిస్తున్నవారూ ఉన్నారు. అది జరగకపోతే మైనారిటీ ఎల్.డి.పి కూటమి అధికారంలో కొనసాగే అవకాశం ఉంది. అయితే ఎల్.డి.పి లోనే కుమ్ములాటలతో కొత్త నేత ముందుకు వచ్చినా ఆశ్చర్యం లేదు. ఏది జరిగినా అస్థిరత కత్తి వేలాడుతూనే ఉంటుంది. లాబీల బేరమాడే శక్తి పెరుగుతుంది. ఎవరు అధికారానికి వచ్చినా అటు కార్మికవర్గం–ఇటు కార్పొరేట్ వర్గమూ తమ సంగతేమిటని పాలకుల మీద వత్తిడి పెంచుతాయి. తక్షణ సవాళ్లుగా ఆర్థిక అంశాలే ఉంటాయని జపనీస్ బిజినెస్ ఫెడరేషన్ ఒక ప్రకటనలో పేర్కొన్నది.

అవినీతిపరులుగా ముద్ర పడిన కొందరిని పక్కన పెట్టి ఓటర్లను సంతుష్టీకరించేందుకు షిబా ప్రకటించినప్పటికీ ఎక్కువ మందికి పెద్ద పీట వేయటంతో ఓటర్లు అతని నాయకత్వాన్ని విశ్వసించలేదు. అందరి మాదిరే అని భావించారు. అవినీతి నిరోధానికి కొత్తగా తీసుకున్న చర్యలేవీ ఓటర్లకు కనిపించలేదు. వారి ఆగ్రహాన్ని పసిగట్టటంలో ఎల్.డి.పి నాయకత్వం విఫలమైంది. పాత ముఖాలనే షిబా కూడా మంత్రులుగా తీసుకున్నాడు. కార్పొరేట్ కంపెనీల నుంచి విరాళాలు తీసుకోవటాన్ని గట్టిగా సమర్థించాడు. పాలక పార్టీకి వస్తున్న రాబడిలో 60 శాతం వరకు కార్పొరేట్ విరాళాలే ఉన్నాయి. వాటి నిషేధం పగటి కల అన్నాడు. ఓటర్లు ఎన్నికల పట్ల ఆసక్తి కోల్పోయినట్లు కేవలం 53.85 శాతం మాత్రమే పోల్ కావటం తెలుపుతున్నది. గత ఎన్నికలతో పోలిస్తే 2.08 శాతం తక్కువ. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ఇంత తక్కువ మంది పాల్గొనటం ఇది మూడవసారి. జపాన్‌లో రెండు రకాల నియోజకవర్గాలు ఉన్నాయి. మొత్తం 465కు గాను 289 సీట్లలో నియోజకవర్గాల ప్రాతిపదికన ప్రతినిధులు ఎన్నికవుతారు. 176 చోట్ల ఆ యా పార్టీలకు వచ్చిన ఓట్ల దామాషా ప్రకారం సీట్లను కేటాయిస్తారు. నియోజకవర్గాలలో డబ్బున్న పార్టీలు తప్ప మరొకరు పోటీ పడలేరు. కమ్యూనిస్టు పార్టీ గెలిచిన ఎనిమిదింటిలో ఒకటి మాత్రమే నియోజకవర్గాల జాబితా నుంచి ఉంది. పార్టీ గతం కంటే రెండు సీట్లను, 7.25 నుంచి 6.16 శాతానికి ఓట్లను కోల్పోయింది. సింగిల్ సీటు నియోజకవర్గాలలో కమ్యూనిస్టులు 213 చోట్ల పోటీ చేశారు. పాలక పార్టీ నిధుల కుంభకోణం గురించి కమ్యూనిస్టు పార్టీ, పార్టీ పత్రిక 'అకహటా' పెద్ద ఎత్తున ప్రచారం చేశాయి. ఎన్నికలలో ఇవి ఎంతో ప్రాధాన్యత సంతరించుకున్నాయి. వివిధ అంశాలపై విబేధాల కారణంగా ప్రతిపక్ష పార్టీల మధ్య సర్దుబాటు సాధ్యం కాలేదు. అనేక చోట్ల పరస్పరం పోటీ పడ్డాయి. అవినీతి ఆరోపణలు ఎదుర్కొన్న అధికార పార్టీ అభ్యర్థులున్న చోట ప్రతి పక్షాల తరఫున ఒకే అభ్యర్థిని నిలపాలన్న ప్రతిపాదనను కమ్యూనిస్టు పార్టీ తిరస్కరించింది. భద్రతా చట్టాల రద్దు తదితర అంశాలపై ఏకాభిప్రాయం అవసరమని పేర్కొన్నది. అయితే రాజధాని టోకియో వంటి కొన్ని చోట్ల కమ్యూనిస్టు పార్టీ ప్రతిపక్ష అభ్యర్థులను బలపరిచింది. ఒకినావా నియోజకవర్గంలో ఉన్న అమెరికా మిలిటరీ కేంద్రాన్ని ఎత్తివేయాలని కోరుతున్న శక్తులన్నీ అక్కడ కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థి అకామైన్‌ను బలపరచగా పాలక పార్టీపై విజయం సాధించాడు. ●

> **అధికారాన్ని అడ్డం పెట్టుకొని పాలక పార్టీ పెద్దలు పెద్ద మొత్తంలో విరాళాల వసూలు, వాటిలో కొంత నొక్కేయటం వంటి విమర్శల సునామీలో పాలక పార్టీ ఓడిపోయింది. ఎల్.డి.పి జపాన్‌లో అవినీతికి పెట్టింది పేరు. అయినప్పటికీ అక్కడి ఓటర్లు దానికి దశాబ్దాల పాటు పట్టం కడుతూనే ఉన్నారు. ఈ సారి ఓడించారంటే వారి సహనానికి అవినీతిపరులు పరీక్ష పెట్టినట్లుగా కనిపిస్తోంది. పాలక పార్టీకి చెందిన మాజీ ప్రధానులు షింజో అబే, ఫుమియో కిషిడాతో సహా 82 మంది ఎంపీలు స్వంత ఖాతాలకు నిధులు మళ్లించుకున్నట్లు విమర్శలు వచ్చాయి. దీనికి తోడు ఆర్థిక మాంద్యంతో దేశం కొట్టుమిట్టాడుతున్నది. దాన్నుంచి బయట పడవేసే మార్గం కనిపించటం లేదు. ఇవన్నీ పాలక పార్టీ, దాని మిత్ర పక్షాన్ని దెబ్బతీశాయి.**

జనవాక్యం

జాతకాలు, జ్యోతిష్యాలు మోసం

నిన్న తెలంగాణ హైకోర్టు మంచి తీర్పు చెప్పింది. ఓ టాలీవుడ్ హీరో కుమారుడి వివాహానికి సంబంధించి ఆ బంధం ఎక్కువ కాలం నిలవదని, విడాకులు తీసుకుంటారని చెప్పిన వేణుస్వామి పైన వారు మహిళా కమిషన్‌కు వెళ్లగా, మహిళా కమిషన్ వేణుస్వామిపై చర్యలకు అదేశించింది. ఈ విషయమై వేణు హైకోర్టుకు వెళ్లగా నిన్న మహిళా కమిషన్ ఆదేశించిన చర్యలను సమర్థిస్తూ తీర్పు చెప్పింది. జాతకాల పేరుతో, జ్యోతిష్యం పేరుతో మోసం చేసేవారికి ఈ తీర్పు ఒక గుణపాఠం కాగలదు. ఇదే వేణుస్వామి గత ఎన్నికల సమయంలో తెలంగాణలో కెసిఆర్ మూడోసారి గెలుస్తాడని చాలెంజ్ చేశాడు. ఇక్కడ జగన్ గెలుస్తాడని కూడా సవాల్ చేశాడు. రెండు చోట్లా ఆయన చెప్పిన జాతకం తిరగబడింది. ప్రపంచంలోనే జ్యోతిష్యం నిజమని ఇంతవరకూ రుజువు కాలేదు. 1975లో ప్రపంచం లోని వివిధ రంగాల శాస్త్రజ్ఞులు 192 మంది జ్యోతిష్యం అబద్ధం, బూటకం అని చెప్పారు. వీరిలో 17 మంది నోబెల్ బహుమతి గ్రహీతలు. అమెరికన్ హేతువాది జేమ్స్ రాండి ప్రపంచంలోని జ్యోతిష్కులను సవాల్ చేశాడు. మీ జ్యోతిష్యం నిజమని నిరుపిస్తే రూ.5 కోట్ల బహుమతి ఇస్తానని 40 సంవత్సరాల నుండి సవాల్ చేస్తున్నాడు. ఒక్కరూ ముందుకి రాలేదు. ప్రజల అమాయకత్వం వలన జాతకాల పేరుతో, జ్యోతిష్యం పేరుతో మోసం చేసే ఆవారా గాళ్లు పెరిగిపోయారు. కనుక వేణు స్వామికి మహిళా కమిషన్ విధించిన శిక్షను, నిన్న తెలంగాణ హైకోర్టు తీర్పుని దృష్టిలో పెట్టుకుని...ఇలాంటి మోసకారుల పట్ల జాగ్రత్తగా ఉండాలి.

\- నార్నె వెంకట సుబ్బయ్య

మీ రచనలను పంపాల్సిన మెయిల్ :
editpageps@ gmail.com

DEBTS THE HONOURABLE DEBT RECVOERY TRIBUNAL
D.No. 31-31-21, Narayana Bhavan, Saibaba Street,
Dabagardens, Visakhapatnam

OA 594/2024

SUMMONS TO DEFENDANTS 1 AND 4 BY WAY OF PAPER PUBLICATION UNDER SUB SECTION (4) OF SECTION 19 OF THE ACT READ WITH SUB-RULE (2A) OF RULE 5 OF THE DEBTS RECOVERY TRIBUNAL (PROCEDURE) RULE,1993

Between :
Axis Bank, Visakhapatnam ... Applicant Bank
And
M/s. Lalitha Traders and Others ... Defendants
To
Def . No.1 : M/s. Lalitha Traders represented by its proprietor Sanka Ch. V. P . Prasad, D.No 11-63-49, Brahmin Street, Near Rama Mandiram, Mallikarjuna Peta, Vijayawada -520 001
Def . No.2 : Sri Sanka Ch. V. P . Prasad S/o Venkata Swamy, D.No 11-63-49, Brahmin Street, Near Rama Mandiram, Mallikarjuna Peta, Vijayawada -520 001.
Def . No.3 : Smt. Sanka Aruna, W/o Ch. V. P . Prasad , D.No 11-63-49, Brahmin Street, Near Rama Mandiram, Mallikarjuna Peta, Vijayawada -520 001.

SUMMONS TO DEFENDANTS No,1 TO 3 BY WAY OF PAPER PUBLICATION

Whereas, OA 594/2024 is filed by Axis Bank Limited before Debt Recovery Tribunal, Visakhapatnam and the same is posted to 18-11-2024 for service of summons.
Whereas the Hon'ble Tribunal is pleased to issue summons on the said application under section 19 (4) of the Act, filed against you for Recovery of debt. Rs.6,11,28,234.58ps
In accordance with Sub-Section 4 of Section 19 of the Act, you the Defendants are directed as under:
i. To show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted.
ii. To disclose particulars of assets other than properties and assets specified by Applicant under serial number 3A of the Original Application.
iii. You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the Original Application. pending hearing and disposal of the application for attachment of properties.
iv. You shall not transfer by way of sale, lease or otherwise, except in ordinary course of his business, any other assets over which security interest is created and/or other assets and properties specified by applicant under serial number 3A of the Original Application without the prior approval of the Tribunal.
5. You are liable to account for the sale proceeds realized by the sale of the secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with bank or financial institution holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof the applicant before Registrar on 18-11-2024 at 10.30 A.M. failing which the application shall be heard and decided in your absence.
Given under my hand and seal of the Tribunal on this 7th October,2024.

HDFC BANK
We understand your world
హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్
హెడ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ హౌస్, సేనాపతి బాపట్ మార్గ్, లోయర్ ప్యారెల్ (వెస్ట్), ముంబాయి, మహారాష్ట్ర-400013.
బ్రాంచ్ ఆఫీస్ : హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ లిమిటెడ్., 50-96-5, ప్లాట్ నెం.75, సీతమ్మధార, పాత ఎస్.బి.హెచ్ ఎదురుగా, విశాఖపట్నం-530013.

స్వాధీనత ప్రకటన

(సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) నిబంధనలు 2002 యొక్క రూల్ 8తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద)

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం-2002 ప్రకారం హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ లిమిటెడ్, ప్రాతినిధ్యం వహిస్తున్న అధీకృత అధికారి అయిన దిగువ సంతకందారు, సెక్యూరిటీ ఇంటరెస్ట్ (ఎన్‌ఫోర్స్‌మెంట్) రూల్స్, 2002 యొక్క 9వ నిబంధనతో చదివే 13(2)వ విభాగము క్రింద సంక్రమించిన అధికారాలను వినియోగిస్తూ డిమాండ్ నోటీసు ఇవ్వడమైనది. సదరు నోటీసు తేది నుండి 60 రోజులలోపు నోటీసులో తెలిపిన ఋణం తేది.30.06.2024 నాటికి రూ.30,46,00,000/- (అక్షరాల ముప్పై కోట్ల నలభై ఆరు లక్షల రూపాయలు మాత్రమే) మరియు వడ్డీతో సహా చెల్లించమని కోరుతూ ఋణగ్రహీత : 1) మెస్సర్స్ శ్రీ శేషసాయి స్పిన్నింగ్ మిల్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రిన్సిపాల్ ఋణగ్రహీత / మామీదారు), ప్లాట్ నెం.188, 189/1, 189/3, రెడ్డిపాలెం, డొంక రోడ్డు, చేబ్రోలు గ్రామం, గుంటూరు-522509. 2) శ్రీమతి కృష్ణవేణి జామిలి (తనఖాదారు/హామీదారు), డి.నెం.23-8-3, జామిలి భవనం, ఇసుకవాగు వీధి, రావు బహద్దూర్ మేడ దగ్గర, ఆర్. అగ్రహారం, గుంటూరు-522003. 3) శ్రీ సారంగపాని జామిలి (డైరెక్టర్/తనఖాదారు/హామీదారు), డి.నెం.23-8-3, జామిలి భవనం, ఇసుకవాగు వీధి, రావు బహద్దూర్ మేడ దగ్గర, ఆర్. అగ్రహారం, గుంటూరు-522003. 4) శ్రీ సుబ్బారావు జామిలి (డైరెక్టర్/తనఖాదారు/హామీదారు), డి.నెం. 5-60-2/3, 4/1, అశోక్ నగర్, గుంటూరు-522002. 5) శ్రీ పార్ధసారది జామిలి (డైరెక్టర్/హామీదారు), డి.నెం.23-8-3, ఆర్. అగ్రహారం, ఇసుకవాగు వీధి, గుంటూరు-522003. 6) శ్రీ వేణుగోపాల్ జామిలి (డైరెక్టర్/హామీదారు), డి.నెం.4-4-88, 1వ లైన్, చంద్రమౌళి నగర్, గుంటూరు-522007. 7) శ్రీమతి అరుణ జామిలి (డైరెక్టర్/హామీదారు), డి.నెం.23-8-3, ఆర్. అగ్రహారం, ఇసుకవాగు వీధి, గుంటూరు-522003 వారిని కోరుతూ తేది.24.07.2024 న డిమాండ్ నోటీసు జారీచేసినారు.

సదరు మొత్తాన్ని తిరిగి చెల్లించుటలో ఋణగ్రహీత/లు విఫలమైనందున సదరు రూల్స్ యొక్క రూల్ "9"తో చదువుకొనవలసిన సదరు చట్టం ద్వారా సెక్షన్ 13(4) క్రింద దిగువ వివరించిన ఆస్తిని దిగువ సంతకందారు తేది.24.10.2024 న లాంఛనాత్మకంగా స్వాధీనం చేసుకొన్నారని ఋణగ్రహీత/లకు మరియు సాధారణ ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలుపడమైనది.

ఈ ఆస్తులతో ఏవిధమైన లావాదేవీలు జరుపరాదని, ఏవేని లావాదేవీలు జరిపిన పక్షంలో అవి మెస్సర్స్ హెచ్.డి.ఎఫ్.సి.బ్యాంక్ లిమిటెడ్ యొక్క ఛార్జీకి రూ.30,46,00,000/- + దానిపై వర్తించు భవిష్య వడ్డీతో సహా లోబడి ఉంటాయని ఋణగ్రహీత/లకు మరియు సాధారణ ప్రజానీకానికి ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

ఆస్తిని తిరిగి పొందుటకు మరియు గడువు లభ్యతపై ఋణగ్రహీత(లు) సదరు చట్టంలోని సెక్షన్ 13లో సబ్ సెక్షన్ (8)లో నిబంధనలను గమనించగలరు.

స్థిరాస్తుల వివరాలు

షెడ్యూల్-ఎ : ఆంధ్రప్రదేశ్-522212, గుంటూరు జిల్లా, చేబ్రోలు మండలం, చేబ్రోలు గ్రామం & పంచాయితీ, డోర్ నెం.1-7, 1-7/1, డిజిట్ నెం.188, 189/1, 189/3లో ఉన్న ఇండస్ట్రియల్ ఆస్తి. దస్తావేజు ప్రకారం విస్తీర్ణం ఎకరా 6.6824 సెంట్లు లేదా 32342.81 చ.గజాలు. [illegible]

[illegible]

4766/1991, తేది.28.06.1991, ఎస్ఆర్ఓ గుంటూరు (ప్రకారం) హద్దులు : తూర్పు : రాచపూడి వెంకటప్పయ్య గారికి చెందిన ఆస్తి, పడమర : 30' వెడల్పు రోడ్డు, ఉత్తరం : లాంచేస్టర్ రోడ్డు, దక్షిణం : రోడ్డు.
షెడ్యూల్-సి : ప్లాంట్ & మిషనరీ, పుస్తక ఋణములు & రావలసినవి మరియు నిల్వలు
తేది : 24.10.2024 సం/- అధీకృత అధికారి
ప్రదేశం : విశాఖపట్నం హెచ్‌డిఎఫ్‌సి బ్యాంక్ లిమిటెడ్

భారత ప్రభుత్వ
గ్రామీణ నైపుణ్యాల విభాగం
క్యాప్టివ్ ఎంప్లాయర్ ప్రతిపాదన కోసం ఆసక్తి వ్యక్తీకరణ

దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజనను క్యాప్టివ్ ఎంప్లాయర్‌లుగా భాగస్వామ్యం చేయడం కోసం ఎంప్లాయర్ల నుండి ఆసక్తి వ్యక్తీకరణ ఆహ్వానించబడింది.

ఆసక్తిగల దరఖాస్తుదారులు వెబ్‌సైట్ : https://kaushalbharat.gov.in https://kaushalbharat. gov.in/img/pdf/Captive-EoI.pdf నుండి "ఆసక్తి వ్యక్తీకరణ"ని సమర్పించడం కోసం మరింత సమాచారాన్ని పొందవచ్చు.

'ఆసక్తి వ్యక్తీకరణ' సమర్పణకు చివరి తేదీ 30 అక్టోబర్ 2024. ఏదైనా ప్రశ్న కోసం, దయచేసి dipalip.nird@gov.in ను సూచించగలరు.

డైరెక్టర్ (నైపుణ్యాలు) గ్రామీణ నైపుణ్యాల విభాగం, గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ

CBC-35101/11/0006/2425

పేలుతున్న టపాసుల ధరలు

- గతేడాదితో పోలిస్తే 20 శాతం పెరిగిన బాణసంచా ధరలు
- మూడు రోజులుగా జోరుగా వ్యాపారం
- ఏది కొందామన్నా రూ.100 పైనే

ప్రజాశక్తి - రాజోలు (కోనసీమ జిల్లా)

టపాసుల ధరలు పేలిపోతున్నాయి. గతేడాదితో పోలిస్తే అన్ని ధరలు 20 నుంచి 30 శాతం వరకు పెరిగాయి. ఏది కొందామన్న రూ.100పైనే ఉంది. రూ.1000 తీసుకెళ్తే చిన్న క్యారీ బ్యాగ్ కూడా నిండడం లేదు. దుకాణాలకు వెళ్లి ధరలు చూసి చెమటలు పడుతున్నాయి. అగ్గిపెట్టె నుంచి థౌజండ్ వాలా వరకు అన్ని ధరలు పేలుతున్నాయి. ల్యాబర్, ట్రాన్స్‌పోర్టు, పన్నులు, దుకాణ అద్దెలు, కెమికల్స్ ధరలు పెరుగుదల టపాసులపై పడిందని, అందుకే ధరలు పెరిగాయని వ్యాపారులు చెప్పుతున్నారు. అయితే ప్రస్తుతం లెసెన్స్ దుకాణాల్లోనే విక్రయాలు సాగుతున్నాయి. తాత్కాలిక లెసెన్స్‌తో గ్రామాలు, పట్టణాల్లో అమ్మే దుకాణాలు ఒక్కొక్కటిగా పెడుతున్నారు. ఈ వ్యాపారులంతా హోల్‌సేల్ దుకాణదారుల నుంచి కొనుగోలు చేసి దుకాణాలు వేసి అమ్ముతుంటారు. ఈ కారణంగా ఇక్కడ ధరలు ఎలా ఉంటాయో చూడాల్సి ఉంది. ప్రస్తుతం హోల్ సేల్ వ్యాపారుల వద్దే ధరలు పేలుతుండటంతో సామాన్య, మధ్య తరగతి ప్రజలు టపాసులు కాల్చాలంటే [illegible] సందేహంలో పడ్డారు.

జిల్లాలో రూ.కోట్లలో వ్యాపారం

జిల్లాలో దీపావళి పండుగ చాలా ఘనంగా జరుపుకుంటారు. ప్రతి ఇంట్లో ఏదో బాణసంచా మోత వినిపిస్తుంది. డబ్బులు లేకపోయినా అప్పు చేసి పండుగ జరుపుకుంటారు. ఈ కారణంగా వ్యాపారం ప్రతి ఏటా కోట్లలో జరుగుతుంది. జిల్లాలో లైసెన్స్ దుకాణాలు అత్యధికంగా రామచంద్రపురం, మండపేట, రావులపాలెం, అమలాపురం, కొత్తపేట, సఖినేటిపల్లి ప్రాంతాల్లో ఉన్నాయి. ఇవి కాకుండా పండుగ మూడు రోజులు తాత్కాలిక లైసెన్స్ పొంది ఏర్పాటు చేసే సంఖ్య కూడా ఎక్కువగా ఉంటుంది. ఈ కారణంగా వ్యాపారం కూడా పెద్ద మొత్తంలో జరుగుతుంది. ఈసారి డిమాండ్ ఉంటుందని భావించి వ్యాపారులు కూడా ఎక్కువ స్టాక్ పెట్టారు. వాతావరణం కూడా అనుకూలంగా ఉండటంతో మూడు రోజుల నుంచి జోరుగానే వ్యాపారం సాగుతుంది.

ధరలు ఇలా...

దీపావళిలో ఎక్కువగా పిల్లలు ఇష్టపడే కాల్చే కాకరపువ్వొత్తులు సాదా బాక్స్ ధర మంచి కంపెనీ అయితే రూ.90 నుంచి రూ.110 ఉంది. గత ఏడాది రూ.60 నుంచి 70 ఉండేది. చిచ్చుబుడ్లు చిన్నవి పది ఉండే చిన్న బాక్స్ రూ.60 నుంచి 80 ఉంది. గతేడాది రూ.40 నుంచి 60 మధ్య ఉండేది. అదే పెద్దవి అయితే మంచి కంపెనీ రూ.300 వరకు పలుకుతుంది. తాళ్ల చిన్న పెట్టె రూ.40, పెద్దవి రూ.80, సీమటపాసులు చిన్నది బాక్స్ రూ.50 పలుకుతోంది. భూ చక్రాలు గతేడాది రూ.70 నుంచి రూ.80 ఉండేది. ఇప్పుడు రూ.100 నుంచి రూ.120 దాకా ఉంది. 5000 వాలా బాంబు దండ గతంలో రూ.1200 నుంచి రూ.1300 ఉండేది. ఇప్పుడది రూ.1500 నుంచి రూ 1800 పలుకుతోంది. 1000 వాలా మంచి రకం గతంలో రూ.2 వేలు ఉండేది. ఇప్పుడు రూ.2500 ఉంది. ఇందులో సాదా రకం రూ.1800 ఉంది. ఇలా అన్ని రకాల ధరలు 20 నుంచి 30 శాతం వరకు పెరిగాయి.

ఏటా పెరుగుతున్న ధరలు

జిఎస్‌టి ఇతర కారణాలతో బాణసంచా ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. పిల్లల సరదా కోసం తమ బడ్జెట్‌కి అనుగుణంగా టపాకాయలు కొనుగోలు చేస్తున్నారు. కాకర పువ్వొత్తులు, చిచ్చుబుడ్డి, తారాజువ్వలు ఇలా అన్నింటి ధరలు కొండెక్కాయి. గతంలో 1500 రూపాయలవి కొనుగోలు చేసే కుటుంబమంతా ఆనందంగా పండుగ చేసుకునేవాళ్లమని, ఇప్పుడు రూ.మూడు వేలు వెచ్చించినా కూడా కొనలేని పరిస్థితి నెలకొందని సామాన్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ధరల పెరుగుదల కారణంగా బాణసంచా అమ్మకాలు సక్రమంగా సాగడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏటా పెరుగుతున్న బాణసంచా ధరలను అదుపు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మహిళా డాన్సర్ అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - విజయవాడ

ఈవెంట్ల బృందంతో కలిసి డాన్స్ చేసే ఓ మహిళ విజయవాడ ఆంధ్రప్రభ కాలనీలో అనుమానాస్పద స్థితిలో మరణించారు. విజయవాడ అజిత్‌సింగ్ నగర్ సిఐ వెంకటేశ్వరనాయక్ కథనం ప్రకారం... కాకినాడ జిల్లా తురంగి ప్రాంతానికి చెందిన బంటుమల్లి వెంకటలక్ష్మి (36), విజయవాడ ఆంధ్రప్రభకాలనీకి చెందిన జ్యోతి, హైదరాబాద్‌కు చెందిన శ్రావణ్‌తోపాటు మరికొందరు ఈవెంట్లలో డాన్స్ చేస్తుంటారు. వెంకటలక్ష్మి కాకినాడ నుంచి హైదరాబాద్ వెళ్లి, తిరిగి కాకినాడకు వస్తున్న క్రమంలో సోమవారం రాత్రి విజయవాడ ఆంధ్రప్రభకాలనీలోని జ్యోతి ఇంటికి వచ్చారు. వీరితో కలిసి ఈవెంట్స్ నిర్వహించే శ్రావణ్ కూడా జ్యోతి ఇంట్లో సోమవారం రాత్రి ఉండి మంగళవారం ఉదయం హైదరాబాద్ వెళ్లిపోయారు. జ్యోతి నిద్ర నుంచి లేచి చూసే సరికి వెంకటలక్ష్మి ఉరి వేసుకొని ఉండడంతో వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. సిఐ తన సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పోలీసుల సమాచారం మేరకు మృతురాలి భర్త, ఆమె చెల్లెలు, ఇతర కుటుంబ సభ్యులు విజయవాడకు వచ్చారు. వారి వద్ద నుంచి పోలీసులు సమాచారం సేకరించారు. హైదరాబాద్ వెళ్లిన శ్రావణ్‌ను పోలీసులు విజయవాడకు రప్పించి, విచారిస్తున్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వము
పంచాయతీరాజ్ శాఖ
ఇ-ప్రొక్యూర్మెంట్ టెండరు నోటీసు
టెండరు నోటీసు నం.4/2024-25, నిట్ నెం.177 నుండి180 తేది : 23.10.2024
బాపట్ల పరిధిలోని వివిధ నియోజికవర్గములలో వివిధ అభివృద్ధి పనులకు ఆన్‌లైన్ టెండర్లు కోరబడుచున్నవి. 4 పనులకు అంచనా విలువ రూ. 38.60 లక్షలు టెండర్లు ది. 01.11.2024 నుండి ఇ-ఫ్లాట్ ఫారం ద్వారా చూడగలరు. వివరాలను https://www.eprocurement.gov.in లో చూడగలరు. ఫోన్ నెం. 9951005578
సం/- కార్యపాలక ఇంజనీరు,
పంచాయతీరాజ్ డివిజన్, బాపట్ల
DIPRNo.14406/CL/ADVT/1/1/2021-22

DEBTS THE HONOURABLE DEBT RECVOERY TRIBUNAL
D.No. 31-31-21, Narayana Bhavan, Saibaba Street,
Dabagardens, Visakhapatnam

OA 902/2024

SUMMONS TO DEFENDANTS 1 AND 4 BY WAY OF PAPER PUBLICATION UNDER SUB SECTION (4) OF SECTION 19 OF THE ACT READ WITH SUB-RULE (2A) OF RULE 5 OF THE DEBTS RECOVERY TRIBUNAL (PROCEDURE) RULE,1993

Between :
Axis Bank, Visakhapatnam ... Applicant Bank
And
M/s. Bharavi and Co and Others ... Defendants
To
Def . No.1
M/s. Bharavi and Co represented by its proprietor Sri Tammana Chandra Venkata Mahesh, D. No.74-6-11/5, B2, Netaji Road, Ayappa Nagar, Vijayawada - 520006
Def . No.4
Sri Tammana Venkata Subbarao, S/o. Venkata Subbarao
D. No.74-6-11/5, B2, Netaji Road, Ayappa Nagar, Vijayawada - 520006

SUMMONS TO DEFENDANTS No,1 AND 4 BY WAY OF PAPER PUBLICATION

Whereas, OA 902/2024 is filed by Axis Bank Limited before Debt Recovery Tribunal, Visakhapatnam and the same is posted to 18-11-2024 for service of summons.
Whereas the Hon'ble Tribunal is pleased to issue summons on the said application under section 19 (4) of the Act, filed against you for Recovery of debt.
In accordance with Sub-Section 4 of Section 19 of the Act, you the Defendants are directed as under:
i. To show cause within 30 days of the service of summons as to why relief prayed for should not be granted.
ii. To disclose particulars of assets other than properties and assets specified by Applicant under serial number 3A of the Original Application.
iii. You are restrained from dealing with or disposing of secured assets or such other assets and properties disclosed under serial number 3A of the Original Application. pending hearing and disposal of the application for attachment of properties.
iv. You shall not transfer by way of sale, lease or otherwise, except in ordinary course of his business, any other assets over which security interest is created and/or other assets and properties specified by applicant under serial number 3A of the Original Application without the prior approval of the Tribunal.
5. You are liable to account for the sale proceeds realized by the sale of the secured assets or other assets and properties in the ordinary course of business and deposit such sale proceeds in the account maintained with bank or financial institution holding security interest over such assets.
You are also directed to file the written statement with a copy thereof the applicant before Registrar on 18-11-2024 at 10.30 A.M. failing which the application shall be heard and decided in your absence.
Given under my hand and seal of the Tribunal on this 24th October,2024.

చంద్రబాబుతో అదానీ గ్రూప్ భేటీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అదానీ గ్రూప్ ప్రతినిధులు కలిశారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టే అంశంపై ఆ కంపెనీ ఎమ్‌డి రాజేష్ అదానీ, పోర్ట్స్, సెజ్‌లు, సిమెంట్స్ విభాగం ఎమ్‌డి కరణ్ అదానీతో పాటు పలువురు కలిశారు. ఏయే రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉన్నారో, ప్రభుత్వం నుంచి ఎలాంటి సహకారం అవసరమో సిఎంతో వారు చెప్పారు. పోర్టులు, విద్యుత్, గనులు, రింగ్‌రోడ్డు, ఐటి, పర్యాటకం వంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి కనపరిచారు. 1600 మెగావాట్ల థర్మల్ ప్రాజెక్టు, 4వేల మెగావాట్ల సౌరవిద్యుత్ ప్రాజెక్టులో పెట్టుబడులు పెడతామని ప్రతిపాదించారు. కృష్ణపట్నం, గంగవరం పోర్టుల విస్తరణ కోసం 2189.36 ఎకరాలు అవసరమని కోరారు. 1,033 ఎకరాల అటవీ భూమికి అటవీ పర్యావరణ అనుమతులు తొలిదశలో తీసుకోవాల్సి ఉంది. బీచ్‌శాండ్ ఆధారిత ఉత్పత్తుల ప్రాజెక్టులపై చర్చించారు. రాజధాని అమరావతి ఇన్నర్‌రింగ్ రోడ్డు నిర్మాణంపై చర్చ జరిగింది. బీచ్‌శాండ్ ఖనిజ పరిశ్రమను ప్రాధాన్య రంగంగా గుర్తించి పారిశ్రామిక రాయితీలు ఇవ్వాలని కోరారు. 100శాతం జిఎస్టి, వ్యాట్ రీయంబర్స్‌మెంట్, పదేళ్లపాటు విద్యుత్ సుంకం మినహాయింపు, భూమి కొనుగోలు ఎంపిక అవకాశం వంటి రాయితీలు కల్పించాలని కోరారు.

త్వరలో సమగ్ర క్రీడా విధానం

- శాప్ ఛైర్మన్ రవినాయుడు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

6. తనఖాపెట్టిన ఆస్తి-06: (గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, లింగాయపాలెం గ్రామం, ఒరిజినల్ రిజిష్టర్డు డీడ్ డాక్యుమెంట్ నెం. 1366/2019, తేది. 01-03-2019): గుంటూరు జిల్లా, APCRDA అమరావతి, తుళ్లూరు మండలం, లింగాయపాలెం గ్రామం, సర్వే నెం. 38, కమర్షియల్ ఫ్లాట్ నెం. 21-C18, బ్లాక్ నెం.2123, సెక్టార్-74, కాలనీ నెం. 341, టౌన్‌షిప్ నెం. 6 నందు మొత్తం విస్తీర్ణం 1000 చ॥గ॥ ఖాళీ స్థలం శ్రీ వుమ్మనేని రాజేష్, తండ్రి: శ్రీ వి. శివ నాగేశ్వరరావు పేరునగలదు. డాక్యుమెంట్ ప్రకారం హద్దులు: తూర్పు: రెసిడెన్షియల్ ఖాళీ భూమి, దక్షిణం: ఫ్లాట్ నెం 6-74-341-2123-22-D33, పడమర: 17.00 మీ॥ రోడ్డు, ఉత్తరం: రెసిడెన్షియల్ ఖాళీ భూమి. **స్వాధీనత నోటీసు తేది: 29.10.2024.**

7. తనఖాపెట్టిన ఆస్తి-07: (గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, లింగాయపాలెం గ్రామం, ఒరిజినల్ రిజిష్టర్డు డీడ్ డాక్యుమెంట్ నెం. 1365/2019, తేది. 01-03-2019): గుంటూరు జిల్లా, APCRDA, మందడం ఎస్ఆర్ఒ, తుళ్లూరు మండలం, లింగాయపాలెం గ్రామం, సర్వే నెం. 32, బ్లాక్ నెం.2127, సెక్టార్-74, కాలనీ నెం. 341, టౌన్‌షిప్ నెం. 6, కమర్షియల్ ఫ్లాట్ నెం. 12-C3 కలిగిన 540 చ॥గ॥ ఖాళీ స్థలం శ్రీ వి. దినేష్, తండ్రి: శ్రీ వి. శివ నాగేశ్వరరావు పేరునగలదు. డాక్యుమెంట్ ప్రకారం హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం. 6-74-341-2127-7-C4, ఫ్లాట్ నెం. 6-74-341-2127-8-C6, దక్షిణం: ఫ్లాట్ నెం 6-74-341-2127-13-C3, పడమర: 15.60 మీ రోడ్డు, ఉత్తరం: ఫ్లాట్ నెం. 6-74-341-2127-11-C5. **స్వాధీనత నోటీసు తేది: 29.10.2024.**

8. తనఖాపెట్టిన ఆస్తి-08: (గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, లింగాయపాలెం గ్రామం, ఒరిజినల్ రిజిష్టర్డు డీడ్ డాక్యుమెంట్ నెం. 1364/2019, తేది. 01-03-2019): గుంటూరు జిల్లా, APCRDA, మందడం ఎస్ఆర్ఒ, తుళ్లూరు మండలం, వెలగపూరి గ్రామం, బ్లాక్ నెం.2177, సెక్టార్-85, కాలనీ నెం. 405, టౌన్‌షిప్ నెం. 7, సర్వే నెం. 172,171,95,96, కమర్షియల్ ఫ్లాట్ నెం. 4-K9 కలిగిన 690 చ॥గ॥ ఖాళీ స్థలం శ్రీ వుమ్మనేని రాజేష్ మరియు శ్రీ వుమ్మనేని దినేష్, తండ్రి: శ్రీ వి. శివ నాగేశ్వరరావు పేరునగలదు. డాక్యుమెంట్ ప్రకారం హద్దులు: తూర్పు: ఫ్లాట్ నెం. 7-85-405-2177-15-k10, దక్షిణం: ఫ్లాట్ నెం 7-85-405-2177-5-k9, పడమర: 17.00 మీ రోడ్డు, ఉత్తరం: ఫ్లాట్ నెం. 7-85-405-2177-3-k10. **స్వాధీనత నోటీసు తేది: 29.10.2024.**

9. తనఖాపెట్టిన ఆస్తి-09: (గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, లింగాయపాలెం గ్రామం, రిజిష్టరు కాని విల్ డీడ్ తేది 27-09-2020): గుంటూరు జిల్లా, చేబ్రోలు సబ్-రిజిస్ట్రీ 1, చేబ్రోలు మండలం, చేబ్రోలు పంచాయితీ మరియు గ్రామం, డోర్ నెం. 7-154, సర్వే నెం. 113/8, 107/1, 113/3, 4, 5 నందు మొత్తం విస్తీర్ణం 0.975 ఎకరాల విస్తీర్ణంలోని రెసిడెన్షియల్ బిల్డింగ్ (జి+2 అంతస్తులు) శ్రీ వుమ్మనేని రాజేష్ మరియు శ్రీ వుమ్మనేని దినేష్, తండ్రి: శ్రీ వి. శివ నాగేశ్వరరావు పేరునగలదు. డాక్యుమెంట్ ప్రకారం హద్దులు: తూర్పు: లక్ష్మీ గోదావరి స్పిన్నింగ్ మిల్స్ ఆస్తి, దక్షిణం: ఇతరుల ఆస్తి, పడమర: పి. రామారావు మరియు ఇతరులు ఆస్తి, ఉత్తరం: రోడ్డు. **స్వాధీనత నోటీసు తేది: 29.10.2024.**

10. తనఖాపెట్టిన ఆస్తి-10: (గుంటూరు జిల్లా, తుళ్లూరు మండలం, లింగాయపాలెం గ్రామం, ఒరిజినల్ రిజిష్టర్డు డీడ్ డాక్యుమెంట్ నెం. 636/2007, తేది. 24-03-2007): గుంటూరు జిల్లా, చేబ్రోలు సబ్-రిజిస్ట్రీ, చేబ్రోలు మండలం, చేబ్రోలు పంచాయితీ మరియు గ్రామం, సర్వే నెం. 113/3, 113/4, 113/5, 113/8, 107 నందు 0.75 ఎకరాల భూమి & అందులోని రెసిడెన్షియల్ బిల్డింగ్ (జి+2 అంతస్తులు) శ్రీ వి. శివ నాగేశ్వరరావు పేరునగలదు. డాక్యుమెంట్ ప్రకారం హద్దులు: తూర్పు: సర్కారు డొంక, దక్షిణం: శ్రీకర్ కాటన్ స్పిన్నింగ్ మిల్లు భూమి, పడమర: ఎగ్జిక్యూటెంట్స్ ఆస్తి, ఉత్తరం: క్లైమెంట్స్ ఆస్తి. **స్వాధీనత నోటీసు తేది: 29.10.2024.**

(సి). హైపొథికేట్ చేయబడిన చరాస్తి వివరములు: ప్రైమరీ సెక్యూరిటీ: **1.** హైపొథికేట్ చేయబడిన ట్రేడ్ లోని స్టాక్ అనగా రా మెటీరియల్, వర్క్ ఇన్ ప్రోగ్రెస్ మరియు ఫినిష్డ్ గూడ్స్ మరియు రిసీవబుల్, గూడ్స్ ఇన్ ట్రాన్సిట్, హైపొథికేషన్ ఆఫ్ ప్లాంట్ మరియు మెషినరీ, ఎలక్ట్రికల్ ఐటమ్స్ మరియు కంప్యూటర్ మరియు హార్డ్‌వేర్ మొదలగునవి. **2.** హైపొథికేషన్ ఆఫ్ ప్లాంట్ మరియు మెషినరీ, ఫైర్ ఫైటింగ్ ఎక్విప్‌మెంట్, ఇటిపి మరియు కంపెనీ ఇతర ఫిక్స్డ్ ఆస్తులు. **స్వాధీనత నోటీసు తేది: 24.10.2024.**

తేది: 24.10.2024 & 29.10.2024,
స్థలం: విశాఖపట్నం
సం/- అధీకృత అధికారి & అసిస్టెంట్ జనరల్ మేనేజర్,
యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, మిడ్ కార్పొరేట్ బ్రాంచ్

ముంబయిలో డ్రోన్లపై నిషేదం

ముంబయి : మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో దేశ వాణిజ్య రాజధాని ముంబయి మహా నగరంలో పోలీసులు వాయుమార్గంలో వివిధ రకాల ఆంక్షలు విధించారు. ప్రధానంగా డ్రోన్లు, పారా గ్లైడర్లు, రిమోట్ కంట్రోల్‌తో నడిచే మైక్రోలైట్ ఎయిర్ క్రాఫ్టులు, హాట్ ఎయిర్‌బెలూన్లు ఎగురవేయడాన్ని పూర్తిగా నిషేదించారు. ఈ నెల 31 నుంచి నవంబరు 29వ తేదీ వరకు ఈ ఆంక్షలు అమల్లో ఉంటాయని సంబంధిత అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఉగ్రవాదులు దాడులకు పాల్పడే ముప్పు పొంచివున్న కారణంగానే ఈ ఆంక్షలు విధించినట్లు పేర్కొన్నారు. వివిఐపిలను లక్ష్యంగా చేసుకునేందుకు కానీ, ప్రజల ప్రాణాలు ప్రమాదంలో పడేసేలా దాడులకు తెగించేందుకు కానీ, లేదా ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసేందుకు కానీ ఉగ్రవాదులు, సంఘ విద్రోహ శక్తులు ఇలాంటి వాయు మార్గ పరికరాలను ఉపయోగించే ప్రమాదం ఉన్నందునే వీటిని నిషేదించినట్లు తెలిపారు. ఆంక్షలను ఉల్లంఘించేవారిపై కఠిన చర్యలు తీసుకోనున్నట్లు పేర్కొన్నారు. మహారాష్ట్రలోని 288 అసెంబ్లీ స్థానాలకు నవంబర్ 20న ఎన్నికలు జరగనున్న సంగతి తెలిసిందే.

సెబీ చైర్మన్‌కు మోడీ రక్ష

- ఎక్స్ వేదికగా ఖర్గే విమర్శలు

న్యూఢిల్లీ : ప్రధాని మోడీపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే మంగళవానం తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సెబీ చైర్మన్ మాధబి పురి బచ్‌ను రక్షించేందుకు ప్రధాని తీవ్రంగా యత్నిస్తున్నారని ఖర్గే ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నరేంద్ర మోడీజి మీరు నియమించిన చైర్‌పర్సన్ సెబీలో సృష్టించిన తెగులును మీరు రక్షించలేరు. వెల్లడవుతున్న వాస్తవాలు ఆమె స్థానాన్ని నిలబెట్టుకోనీయలేవు' అని ఎక్స్‌లో ఖర్గే పేర్కొన్నారు. సెబీ పవిత్రతను ప్రధాని దెబ్బతీశారని తప్పుబట్టారు. సంవత్సరాల శ్రమతో భారతదేశ మార్కెట్ రెగ్యులేటరీ నిర్మితమైందని, దాని పవిత్రతను దెబ్బతీయడంతో కోట్లాది చిన్న, మధ్యతరగతి పెట్టుబడిదారుల కష్టార్జితమైన పొదుపు ప్రమాదంలో పడిందని ఆయన అన్నారు. ఈ అంశంలో జాయింట్ పార్లమెంటరీ కమిటీ విచారణకు పిలుపునిస్తూ.. 'మీ ప్రియమైన స్నేహితుడు అదానీకి మీరు గుత్తాధిపత్యాన్ని ఎలా కట్టబెట్టారో కూడా వెల్లడిస్తుంది. ఈ సిండికేట్‌లో ప్రతి అంశాన్ని విచారించడానికి సమగ్రమైన జెపిసి అవసరం" అని ఖర్గే తెలిపారు.

స్థిరాస్తుల స్వాధీన హక్కు పోలీసులకు లేదు

- సుప్రీంకోర్టు కీలక తీర్పు

న్యూఢిల్లీ : పౌరులకు చెందిన స్థిరాస్తులను ఎట్టి పరిస్థితులలోనూ పోలీసులు స్వాధీనం చేసుకోరాదని, వారికి ఆ హక్కు లేదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. ఓ కేసులో మధ్యప్రదేశ్ హైకోర్టు విధించిన బెయిల్ షరతును తోసిపుచ్చుతూ అది చాలా 'భారమైనద'ని వ్యాఖ్యానించింది. స్థిరాస్తులను పోలీసులు స్వాధీనం చేసుకోవడం న్యాయ సమ్మతం కాదని, ఆ చర్య పౌర హక్కులను హరిస్తుందని జస్టిస్ సిటి రవి కుమార్, జస్టిస్ సందీప్ మెహతాతో కూడిన బెంచ్ తెలిపింది.

కేసు పూర్వాపరాలలోకి వెళితే... ఫిర్యాదుదారు ఒక భవనాన్ని నిర్మించగా అందులోకి ఎవరూ ప్రవేశించకుండా కొందరు వ్యక్తులు దానికి అడ్డుగా ఓ గోడను నిర్మించారు. పోలీసులు వారిని అరెస్టు చేసి జైలులో ఉంచారు. తమకు బెయిల్ మంజూరు చేయాలంటూ వారు హైకోర్టును ఆశ్రయించారు. జూలై 25న హైకోర్టు వారికి బెయిల్ మంజూరు చేసింది. అందుకు అనేక షరతులు విధించింది. వివాదాస్పద ఆస్తిని పోలీసులు స్వాధీనం చేసుకోవాలని, నిందితుల ఖర్చుతో గోడను కూల్చాలని, ఆ తర్వాత స్వాధీనం చేసుకున్న ఆస్తిని సదరు యజమానికి అప్పగించాలని షరతు పెట్టింది. కాగా ఈ బెయిల్ నిబంధనను సుప్రీంకోర్టు తోసిపుచ్చింది. స్థిరాస్తిని స్వాధీనం చేసుకునే హక్కు పోలీసులకు లేదని, అది న్యాయ సమ్మతం కాదని తేల్చింది.

కేరళ ఆలయంలో బాణసంచా పేలుడు

- 150 మందికి గాయాలు

కేరళ : కేరళలో కాసర్‌గోడ్‌లోని ఓ ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో బాణసంచా పేలుడు ప్రమాదంలో 150 మందికి పైగా గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు ... అంజోతంబలం వీరర్కవు ఆలయంలో వార్షిక కాళియాట్లం ఉత్సవాలు జరుగుతున్నాయి. ఈ ఆలయం సమీపంలో నిల్వ ఉన్న బాణసంచా పేలడంతో మంటలు చెలరేగాయని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. ఈ ప్రమాదంలో 150 మందికిపైగా గాయపడగా, వారిలో 8 మంది పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను కాసరగోడ్, కన్నూర్, మంగళూరులోని పలు ఆసుపత్రులకు తరలించి చికిత్సను అందిస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రమాదంపై జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ... భద్రతా రాహిత్యం వల్లనే ఈ ఘటన చోటుచేసుకుందని తెలిపారు. ' బాణసంచా నిల్వ ఉన్న ప్రాంతానికి కనీసం 100 మీటర్ల దూరంలో క్రాకర్లు కాల్చాలనే నిబంధనలు పాటించలేదు. నిల్వలకు సైతం అనుమతి తీసుకోలేదని విచారణలో వెల్లడైంది. ఘటనా స్థలంలో నమూనాలు సేకరించి కేసు నమోదు చేశాం ' అని వివరించారు.

సిపిఎం అభ్యర్థుల నామినేషన్ సందర్భంగా దహను, కల్యాన్‌లో నిర్వహించిన ర్యాలీలు

మహారాష్ట్రలో ముగ్గురు సిపిఎం అభ్యర్థుల నామినేషన్

- వేలాది మందితో ప్రజా ర్యాలీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

మహారాష్ట్రలో మూడు స్థానాలకు సిపిఎం అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. మహారాష్ట్ర ఎన్నికల్లో దహను, కల్యాన్, షోలాపూర్ సిటీ సెంట్రల్ నియోజకవర్గాల్లో సిపిఎం పోటీ చేసింది. ఇందులో ఇండియా బ్లాక్ (ఎంవిఎ) భాగంగా పోటీ చేస్తున్న ఈ మూడు స్థానాల్లో నామినేషన్లు దాఖలు చేశారు. దహను (ఎస్‌టి) నియోజకవర్గంలో ఇండియా బ్లాక్ పార్టీల నేతృత్వంలో 10 వేల మందితో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం సిపిఎం సిట్టింగ్ ఎమ్మెల్యే వినోద్ నికోల్ నామినేషన్ దాఖలు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, సిపిఎం నేతలు కిసాన్ గుజార్, మరియం ధావలే, కిరణ్ గహలా, రడ్కా కలంగ్డా, లక్ష్మణ్ డోంబ్రే, లహానీ దౌదా, సునీతా షింగ్డా, ఎన్‌సిపి నేతలు మిహిర్ షా, వరుణ్ పరేఖ్, తన్మయ్ బారి, కాశీనాథ్ చౌదరి, కాంగ్రెస్ నేతలు సంతోష్ మోరే, హఫీజు ఖాన్, సుధాకర్ రౌత్, శివసేన నేతలు అజయ్ ఠాకూర్, సంజయ్ కాంబ్లే, సంజయ్ పాటిల్, ఉజ్వల దామ్షే, కష్టకారి సంఘటన నేతలు బ్రియాన్ లోబో, మధు ధోడి, భారత్ జోడో అభియాన్ నాయకులు రాజు భిసే, రమాకాంత్ పాటిల్ పాల్గొన్నారు.

కల్యాన్ (ఎస్‌టి)లో సిపిఎం మాజీ ఎమ్మెల్యే, సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు జెపి గవిట్ నామినేషన్ దాఖలు చేశారు. నాసిక్ జిల్లాలోని కల్వాన్‌లో సుర్గానా తహసీల్‌ల నుండి వేలాది మంది ప్రజలు, గిరిజన, గిరిజనేతర రైతులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు అశోక్ ధావలే, ఎన్‌సిపి లోక్‌సభ ఎంపి భాస్కర్ భాగారే, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే శిరీష్ కొత్వాల్, శివసేన రూరల్ జిల్లా అధ్యక్షులు జయంత్ దిండే, ఎన్‌సిపి నేత రవీంద్ర దేవ్రే, కాంగ్రెస్ నేత శైలేష్ పవార్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సునీల్ మలుసరే, రాష్ట్ర కమిటీ సభ్యులు సుభాష్ చౌదరి, భికా రాథోడ్, ఇర్ఫాన్ షేక్, ఇంద్రజిత్ గావిత్, ఇంకా సావ్లిరామ్ పవార్, నీలేష్ షిండే పాల్గొన్నారు.

షోలాపూర్ కలెక్టరేట్‌కు 12 వేల మందికి పైగా కార్యకర్తలు ర్యాలీగా వెళ్లి సిపిఎం అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే నరసయ్య ఆదాం నామినేషన్ దాఖలు చేశారు. బీడీ, పవర్‌లూమ్, నిర్మాణ, రవాణా, అంగన్‌వాడీ, ఆశా తదితర రంగాల్లోని కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి ఉదయ్ నార్కర్, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎంహెచ్ షేక్, రాష్ట్ర కమిటీ సభ్యులు నసీమా షేక్, నళిని కల్‌బుర్గి, యూసుఫ్ మేజర్, మాజీ మున్సిపల్ కార్పొరేటర్లు కామిని ఆడమ్, వ్యాంకటేష్ కొంగరి, అడ్వకేట్ అనిల్ వాసం తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్‌లో పెరుగుతున్న అఘాయిత్యాలు

- ఎన్‌హెచ్‌ఆర్‌సికి వైసిపి ఫిర్యాదు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఆంధ్రప్రదేశ్‌లో మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని, జోక్యం చేసుకోవాలని వైసిపి ఫిర్యాదు చేసింది. మంగళవారం నాడిక్కడ జాతీయ మానవ హక్కుల సంఘం (ఎన్‌హెచ్‌ఆర్‌సి) ఛైర్‌పర్సన్ విజయ భారతిని, జాతీయ మహిళా కమిషన్ మెంబర్ సెక్రటరీ మీనాక్షి నేజీని కలిసి వైసిపి మహిళా నేతల బృందం ఫిర్యాదు చేసింది. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న దాడులను వివరిస్తూ ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. టిడిపి ప్రభుత్వం నాలుగు నెలల కాలంలోనే 77 మంది మహిళలపై అత్యాచారాలు, హత్యలు జరిగాయని తెలిపారు. అయినా చంద్రబాబు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఫిర్యాదులో వివరించారు. అక్రమ మద్యం, అక్రమ ఇసుక దందాల్లో ముఖ్యమంత్రి, హోంమంత్రి బిజీగా ఉన్నారని ఆరోపించారు. మహిళల రక్షణ కోసం వైసిపి ప్రభుత్వం తెచ్చిన దిశా యాప్‌ను నిరుపయోగం చేశారని తెలిపారు. దిశా యాప్ నిర్వీర్యం చేయడంతో మహిళల భద్రత గాల్లో దీపంగా మారిందని వివరించారు. ఈ అంశాల్లో వెంటనే జోక్యం చేసుకోవాలని మానవ హక్కుల సంఘాన్ని కోరారు. మహిళల భద్రతకు తగిన చర్యలు తీసుకునేలా రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించాలని విన్నవించారు. బృందంలో వైసిపి మహిళా అధ్యక్షులు ఎమ్మెల్సీ వరదు కళ్యాణి, ఎంపి తనుజారాణి, మాజీ ఎంపిలు చింత అనురాధ, మాధవి ఉన్నారు. వీరితోపాటు వైసిపి ఎంపి మద్దిల గురుమూర్తి కూడా ఉన్నారు.

బీజింగ్‌లో జరిగిన సదస్సును ఉద్దేశించి ప్రసంగిస్తున్న సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు

సోషలిజాన్ని ఎలుగెత్తి చాటుతున్న క్యూబా

- యావత్తు ప్రపంచానికి స్ఫూర్తిదాయకం
- బీజింగ్‌లోని క్యూబా సంఘీభావ సదస్సులో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

65 ఏళ్లుగా ఏకపక్ష ఆంక్షలు, దిగ్బంధనాలను ఎదుర్కొన్నప్పటికీ క్యూబా సోషలిజం పతాకాన్ని నిలబెట్టి యావత్ ప్రపంచ ప్రజలకు స్ఫూర్తినిస్తుందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు నీలోత్పల్ బసు పేర్కొన్నారు. మంగళవారం బీజింగ్‌లో ప్రారంభమైన పదో క్యూబా సాలిడారిటీ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ సదస్సులో భారత ప్రతినిధి బృందానికి నాయకుడిగా నీలోత్పల్ బసు ప్రసంగించారు. జీవనోపాధి సమస్యలపై ప్రజా పోరాటాలతో చివరికి అమెరికా సామ్రాజ్యవాద డిజైన్‌లను క్యూబా ఓడిస్తుందని అన్నారు. ప్రపంచ శాంతి, స్వాతంత్ర్య హక్కు, జీవనోపాధి హక్కును పరిరక్షించడం కోసం సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా ప్రపంచ వ్యాప్తంగా ప్రజల అభిప్రాయాన్ని పెంపొందించాల్సిన అవసరాన్ని ప్రతిబింబించేలా సదస్సులో ప్రతినిధులు ప్రసంగించారు. ఈ సదస్సుకు 14 దేశాల నుంచి 62 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

గాజాలో ఐరాస కార్యకలాపాలపై నిషేధం

బీరుట్, గాజా : గాజాలో ప్రజలకు సాయమందించే ఐక్యరాజ్య సమితి ప్రధాన సంస్థ కార్యకలాపాలకు ముప్పు వాటిల్లేలా ఇజ్రాయిల్ సోమవారం రెండు చట్టాలను ఆమోదించింది. ఇజ్రాయిల్ దాడుల కారణంగా ఇప్పటికే గాజాలో మానవతా సాయం అధ్వాన్నంగా తయారైన నేపథ్యంలో తాజాగా నెతన్యాహు ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పాలస్తీనియన్లపై మరింత ప్రభావం చూపే అవకాశం వుందని భావిస్తున్నారు. మొదటి చట్టం ప్రకారం పాలస్తీనా శరణార్థుల కోసం పనిచేసే ఐరాస సంస్థ యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎపై నిషేదం విధించారు. ఇజ్రాయిల్ లోపల ఎలాంటి చర్యలు, లేదా సేవలు నిర్వహించరాదు. రెండో చట్టం కింద దానితో దౌత్య సంబంధాలు తెగతెంపులు చేసుకోవాల్సి వుంటుంది. కాగా ప్రపంచ నేతలు ఇజ్రాయిల్ చర్యలను తీవ్రంగా నిరసిస్తున్నారు. ఇది సహించరానిదని, అక్రమమని, సామూహిక శిక్ష తప్ప మరొకటి కాదని వారు వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్య సమితి సంస్థలు కూడా ఈ చర్యను తీవ్రంగా ఖండించాయి. దీనివల్ల గాజాలో మానవతా సాయం పూర్తిగా కుప్పకూలుతుందని యునిసెఫ్ ప్రతినిధి జేమ్స్ ఎల్డర్ హెచ్చరించారు. ప్రస్తుత తరుణంలో యుఎన్‌ఆర్‌డబ్ల్యుఎకు మరో ప్రత్యామ్నాయం లేదని యుఎన్ మానవతా కార్యాకలాపాల కార్యాలయ ప్రతినిధి జేన్స్ లర్కె వ్యాఖ్యానించారు.

తీవ్ర పర్యవసానాలు తప్పవు : ఇరాన్ గార్డ్స్ చీఫ్ హెచ్చరిక

ఇరాన్ మిలటరీ స్థావరాలపై దాడి చేసిన నేపథ్యంలో తీవ్ర పర్యవసానాలు తప్పవని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కమాండర్ ఇన్ చీఫ్ హుస్సేన్ సలామి ఇజ్రాయిల్‌ను హెచ్చరించారు. దాడి చేసిన ఇజ్రాయిల్ తన లక్ష్యాన్ని సాధించలేకపోయిందని ఆయన విమర్శించారు. తప్పుడు అంచనాలకు, నిస్సహాయతకు నిదర్శనమే ఈ దాడి అని వ్యాఖ్యానించారు. దీనివల్ల తలెత్తే పర్యవసానాలు ఊహించలేని రీతిలో వుంటాయని హెచ్చరించారు. ఇజ్రాయిల్ చర్యల పట్ల ఇరాన్ ధృఢంగా, నిర్దిష్టంగా స్పందిస్తుందని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి ఇస్మాయిల్ బాఘే పేర్కొన్నారు. తాము యుద్ధాన్ని కోరుకోవడం లేదని, అయితే దేశ హక్కులను కాపాడుకుంటామని అధ్యక్షుడు మసూద్ పెజెషికిన్ చెప్పారు.

లెబనాన్‌లో 60 మంది మృతి

తూర్పు లెబనాన్‌లో జరిగిన దాడిలో 60మంది మరణించారని లెబనాన్ ఆరోగ్య శాఖ తెలిపింది. ఇదిలావుండగా, హిజ్బుల్లా కమాండ్ సెంటర్‌ను ధ్వంసం చేసినట్లు ఆర్మీ ప్రకటించింది. అలాగే దక్షిణ లెబనాన్‌లో పేలుడు పదార్థాలు దాచిన బంకర్‌ను కూడా నాశనం చేసినట్లు తెలిపింది. భూమిలోపల 8మీటర్ల లోతున ఈ బంకర్‌వుందని పేర్కొంది.

హిజ్బుల్లా చీఫ్‌గా నయీమ్ ఖాసిమ్

ఇజ్రాయిల్ ఆర్మీ దాడిలో చనిపోయిన హిజ్బుల్లా చీఫ్ హసన్ నస్రల్లా వారసుడిగా నయీమ్ ఖాసిమ్‌ను ఎన్నుకున్నట్లు లెబనాన్ సాయుధ గ్రూపు హిజ్బుల్లా మంగళవారం ప్రకటించింది. 1991 నుండి ఇప్పటివరకు ఖాసిమ్ డిప్యూటీ హెడ్‌గా వున్నారు. గ్రూపు సెక్రటరీ జనరల్‌ను ఎన్నుకునేందుకు నిర్దేశించిన యంత్రాంగం ప్రకారమే శూరా కౌన్సిల్ ఖాసిమ్‌ను ఎన్నుకుందని ఒక ప్రకటనలో హిజ్బుల్లా తెలిపింది. సెప్టెంబరు 27న నస్రల్లా హత్య చేయబడ్డారు. ఆ తర్వాత మరో సీనియర్ నేత హాషీమ్ సఫీద్దిన్ ఆ బాధ్యతలు చేపడతారని భావించారు కానీ ఆయన కూడా అక్టోబరు 8నాటి దాడిలో చనిపోయారు. దాంతో హిజ్బుల్లా నాయకత్వ బాధ్యతలను ఖాసిమ్ తలకెత్తుకోవాల్సి వచ్చింది.

అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ఓటు వేసిన బైడెన్

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్ష ఎన్నికలు మరో వారంలో జరగనున్న నేపథ్యంలో, అధ్యక్షుడు జో బైడెన్ తన స్వంత రాష్ట్రమైన డెల్వార్‌లో సోమవారం ఓటు వేశారు. దీనిపై సోషల్‌మీడియా ఎక్స్‌లో పోస్టు పెట్టారు. డెమొక్రటిక్ అభ్యర్థి అయిన ఉపాధ్యక్షురాలు కమలా హారిస్‌కు, ఇతర డెమొక్రాట్ ప్రతినిధులకు ఓటు వేసినట్లు తెలిపారు. డెల్వార్‌లోని న్యూ కేజిల్ పోలింగ్ కేంద్రంలో అధ్యక్షుడు తొలిసారిగా ఓటు వేస్తున్న యువతను స్వాగతించారు. వారితో కలిసి ఫోటోలు దిగారు. గత ఎన్నికల్లో సతీమణి జిల్ బైడెన్‌తో కలిసి ఓటు హక్కు వినియోగించుకున్నారు. కానీ ఈసారి ఆమె వరసగా పార్టీ తరపున ప్రచార సభల్లో పాల్గొంటుండడంతో బిజీగా వున్నారు. ఇప్పటికే 2కోట్ల మందికి పైగా అమెరికన్లు తమ ఓటు హక్కు వినియోగించుకున్నారు. నవంబరు 5న అధ్యక్ష ఎన్నికలు జరగనునానయి. అమెరికా తొలి మహిళా ఉపాధ్యక్షురాలిగా గెలిచి చరిత్ర సృష్టించాలని కమలా హారిస్ శ్రమిస్తున్నారు.

అంతకంతకూ పెరిగిపోతున్న గ్రీన్‌హౌస్ వాయువులు

- గ్లోబల్ వార్మింగ్‌తో జనజీవనానికి మరింత ముప్పు
- ప్రపంచ వాతావరణ సంస్థ హెచ్చరిక

న్యూఢిల్లీ : వాతావరణంలో గ్రీన్‌హౌస్ వాయువుల (జిహెచ్‌జి) స్థాయి అంతకంతకూ పెరిగిపోతోంది. 2023లో ప్రపంచవ్యాప్తంగా సగటు భూ ఉపరితల కార్బన్ డయాక్సైడ్ (సిఒ2) స్థాయి 420 పార్ట్స్ పర్ మిలియన్ (పిపిఎం)గానూ, అలాగే మిథేన్ 1934 పార్ట్స్ పర్ బిలియన్ (పిపిబి)గానూ, మరో గ్రీన్‌హౌజ్ వాయువు నైట్రస్ ఆక్సైడ్ 336.9 పిపిబిగా నమోదైంది. రెండు దశాబ్దాల గణాంకాలతో పోల్చితే పది శాతం అధికంగా నమోదై కొత్త రికార్డులు సృష్టించాయి. దీని ప్రభావంతో దీర్ఘకాలంలో వాతావరణం వేడెక్కుతుందని ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యుఎంఒ) హెచ్చరించింది. వాతావరణంలో ఉండే గ్రీన్‌హౌస్ వాయువులు భూమి వంటి గ్రహాల ఉష్ణోగ్రతలను పెంచుతాయి. సూర్యరశ్మి కారణంగా భూమి వేడెక్కుతుందన్న విషయం తెలిసిందే. భూమి ఉపరితలం ప్రసరింపజేసే వేడి ఎక్కువగా గ్రీన్‌హౌస్ వాయువుల ద్వారానే గ్రహించబడుతుంది. గత సంవత్సరం ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు పెరిగి రికార్డు సృష్టించాయి. మరో రికార్డు ఏమంటే జిహెచ్‌జిల స్థాయి కూడా పెరగడం. ఈ కారణంగా రాబోయే సంవత్సరాలలో భూమిపై ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉంటాయని డబ్ల్యుఎంఒ విడుదల చేసిన వార్షిక బులెటిన్ తెలిపింది. మానవుల ఉనికి ఉన్నంత కాలం వాతావరణంలో కార్బన్‌డయాక్సైడ్ (సిఒ2) వేగంగా కలిసిపోతుంది. ఇతర సమయాలలో కంటే మానవ సంచారం ఉన్నప్పుడే ఇది అత్యంత వేగంగా కలుస్తుంది.

గత 20 సంవత్సరాల కాలంలో సిఒ2 వాతావరణంలో 11.4 శాతం మేర పెరిగింది. చిట్టచివరి సారిగా 30-50 సంవత్సరాల క్రితం ఉష్ణోగ్రత ఇప్పటి కంటే 2-3 డిగ్రీలు వేడిగా, సముద్ర మట్టం 10-20 మీటర్లు ఎక్కువగా ఉన్నప్పుడు భూమిపై సిఒ2 ఈ స్థాయిలో పెరిగింది. ఈ పరిణామం పాలకులకు ఆందోళన కలిగించే విషయమేనని డబ్ల్యుఎంఒ తెలిపింది. పారిస్ ఒప్పందం ప్రకారం గ్లోబల్ వార్మింగ్‌ను రెండు డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగానే ఉంచాల్సి ఉంటుందని, ఆ లక్ష్య సాధనలో మనం దారి తప్పుతున్నామని చెప్పింది. ఉష్ణోగ్రత ఏ కొంచెం పెరిగినా అది మన జీవితాలపై, భూగోళంపై ప్రభావం చూపుతుందని హెచ్చరించింది. గత సంవత్సరం భూ ఉపరితలంపై సీఒ2, మిథేన్, నైట్రస్ ఆక్సైడ్ వాయువులు ఆందోళన కలిగించే స్థాయిలో ఉన్నాయి. వీటిలో సిఒ2 చాలా ముఖ్యమైనది. వాతావరణం వేడెక్కడంలో దీని ప్రభావం 64 శాతం మేర ఉంటుంది. శిలాజ ఇంధనాలను తగలబెట్టడం వల్లనే సీఒ2 పెరుగుతోంది. అయితే వాతావరణంపై ఎల్‌నినో ప్రభావాన్ని కూడా తోసిపుచ్చలేము.

శక్తివంతమైన గ్రీన్‌హౌస్ వాయువు మిథేన్ గత దశాబ్ద కాలంగా వాతావరణంలో ఉండిపోయింది. గ్లోబల్ వార్మింగ్‌లో దీని ప్రభావం 16 శాతం ఉంటుంది. నైట్రస్ ఆక్సైడ్ కూడా శక్తివంతమైన గ్రీన్‌హౌస్ వాయువే. అంతేకాదు...ఇది ఓజోన్ పొరను కరిగించే రసాయనం కూడా. వాతావరణం వేడెక్కడంలో దీని ప్రభావం 6 శాతం మేర ఉంటుంది. గ్లోబల్ వార్మింగ్‌పై మిగిలిన 14 శాతం ప్రభావం ఇతర కాలుష్య కారక వాయువుల కారణంగా కలుగుతోంది.

కథ, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం...అడవిబిడ్డలు

- ఘనంగా గిరిజన పిల్లల చలన చిత్రోత్సవం
- దేశంలోనే తొలిసారి ఎర్నాకులంలో నిర్వహణ

తిరువనంతపురం : అడవి బిడ్డలు..కొండ కోనల్లో కల్లాకపటమెరుగని ఆణిముత్యాలు. ప్రకృతి ఒడిలో వారు నేర్వని కళ అంటూ ఏదీ ఉండదు. వారి మాటలో..పాటలో..ఆటలో సహజత్వం ఉట్టిపడుతుంది. అయితే అత్యాధునిక ప్రపంచం కుమ్మరించే కృత్రిమ కళల్లో గిరిజనుల జీవకళలు కనుమరుగైపోతున్నాయి. ఈ నేపథ్యంలో అడవితల్లి ముద్దు బిడ్డల కళలకు ప్రాణం పోసేలా కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర కూటమి (ఎల్‌డిఎఫ్) ప్రత్యేక చొరవ చూపింది. కనాస్ జాగా (కలల ప్రపంచం) పేరుతో దేశంలోనే తొలిసారిగా గిరిజన చిన్నారుల చలనచిత్రోత్సవాన్ని నిర్వహించింది. ఈ ఉత్సవాలను ఎర్నాకులంలోని సెయింట్ థెరిసా కళాశాలలో ఘనంగా నిర్వహించారు. కేరళలో మహిళల స్వయం సమృద్ధికి బాటలు వేస్తున్న స్వయం సహాయక బృందాల వేదిక 'కుడుంబశ్రీ' ఆధ్వర్యంలోనే ఈ చిత్రోత్సవం నిర్వహించడం మరో విశేషం. ఈ నెల 27, 28 తేదీల్లో నిర్వహించిన ఈ గిరిజన చిన్నారుల చలనచిత్రోత్సవంలో 102 లఘు చిత్రాలను ప్రదర్శించారు. వీటికి కథ, దర్శకత్వం అన్నీ కూడా అడవి బిడ్డలే. 600 మంది ఆదివాసీ చిన్నారులు, వారి మార్గదర్శకులతో సహా ఈ వేడుకలో దాదాపు 1200 మంది పైగా భాగస్వాములయ్యారు. కేరళ స్థానిక సంస్థల శాఖ మంత్రి ఎంబి రాజేష్ ఈ వేడుకలను ప్రారంభించగా రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి పి రాజీవ్ వేడుకల ముగింపు సభలో పాల్గొన్నారు.

వయనాడ్‌లోని తిరునెల్లి, నూల్‌పుజ గిరిజన ప్రాంతాల నుంచి అత్యధికంగా 35 చిత్రాలు ఈ వేడుకలో ప్రదర్శించారు. మలప్పురంలోని అట్టపడి, పాలక్కడ్, నీలాంబర్ గిరిజన ప్రాంతాలు, ఇడుక్కిలోని కాంతల్లూరు, మరయూర్, అలాగే కన్నూరులోని అరలామ్, కాసరగోడ్‌లోని కొరగ, పథనంతిట్టలోని మలపండరం, త్రిస్సూర్‌లోని కదర్ గిరిజన ప్రాంతాలకు చెందిన చిన్నారులు ఈ వేడుకల్లో తమ చిత్రాలను ప్రదర్శించారు. ఆద్యంతం అత్యంత ఉత్సాహభరితంగా సాగిన ఈ వేడుకల స్ఫూర్తితో రాబోయే రోజుల్లో మరింత ఘనంగా విస్తృతంగా వేడుకలు నిర్వహిస్తామని రాజీవ్ తెలిపారు. వేనాడ్ చిన్నారులు నిర్మించిన 'నరంగ మిట్టాయి' మొదటి బహుమతిని గెల్చుకోగా, 'దాహం' (అట్టపడి), 'నెట్‌వర్క్' (పాలక్కడ్) ద్వితీయ, తృతీయ బహుమతులను సొంతం చేసుకున్నాయి. ప్రేక్షకాదరణను చూరగొన్న మరో పది చిత్రాలకు కూడా వేడుకల్లో ప్రోత్సహాక బహుమతులు అందజేశారు.

డ్రగ్స్ ఫ్యాక్టరీ నడుపుతున్న తీహార్ జైలు అధికారి

- ఢిల్లీలో నిషేదిత మెథ్ తయారీ ల్యాబ్ సీజ్

న్యూఢిల్లీ : కేంద్ర హోంశాఖ పరిధిలో శాంతిభద్రతలు ఉన్న దేశ రాజధాని ప్రాంతం (ఎన్‌సిఆర్) నిషేదిత మత్తు పదార్థాలకు అడ్డాగా మారింది. తీహార్ జైలు అధికారి ఒకరు ఏకంగా డ్రగ్స్ ఫ్యాక్టరీనే నిర్వహిస్తున్నారంటే పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. నిషేధిత మాదక ద్రవ్యం మెథాంపెటమైన్ (మెథ్) తయారీ ల్యాబ్‌ను ఢిల్లీ ఎన్‌సిఆర్ పరిధిలో నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సిబి) అదికారులు గుర్తించారు. దీనిపై దర్యాప్తు సాగించగా ఆ ల్యాబ్ నిర్వహణ వెనుక తీహార్ జైలు వార్డెన్ హస్తం కూడా ఉన్నట్లు తేలింది. దీంతో ఎన్‌సిబి అధికారులు నిర్ఘాంత పోయారు. ఈ కేసులో ఢిల్లీకి చెందిన ఒక వ్యాపారవేత్తను, జైలు వార్డెన్‌ను అరెస్టు చేశారు. ఈ మేరకు ఎన్‌సిబి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. అందులో పేర్కొన్న వివరాల ప్రకారం..ఈ నెల 25న గ్రేటర్ నోయిడా పరిధిలో ఎన్‌సిబి దాడులు నిర్వహించింది. ఒక ఇంట్లో మెథ్ ల్యాబ్‌ను నిర్వహిస్తున్నట్లు గుర్తించింది. దీనిని తీహార్ జైలు వార్డెన్, ఢిల్లీకి చెందిన ఒక వ్యాపారవేత్త, ముంబయికి చెందిన కెమిస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎన్‌సిబి బృందం గుర్తించింది. దేశంలోని వివిధ రాష్ట్రాలకు, అలాగే అంతర్జాతీయంగానూ ఎగుమతుల కోసం సింథటిక్ డ్రగ్స్‌ను ఈ ల్యాబ్‌లో తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఘన, ద్రవ రూపాల్లో ఉన్న దాదాపు 95 కిలోల మెథ్‌ను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. ఈ ఫ్యాక్టరీ ఆవరణలో ఎసిటోన్, సోడియం హైడ్రాక్సైడ్, మిథాలిన్ క్లోరైడ్, ప్రీమియం గ్రేడ్ ఎథనాల్, రెడ్ పాస్ఫరస్, ఈథైల్ ఎసిటేట్ వంటి డ్రగ్స్ తయారీకి వినియోగించి వివిధ రసాయానాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా నిషేదిత డ్రగ్స్ తయారీ కోసం విదేశాల నుంచి దిగుమతి చేసుకున్న అత్యాధునిక పరికరాలను కూడా నార్కోటిక్ కంట్రోల్ బ్యూరో అధికారులు గుర్తించారు. ఈ కేసులో ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్తను అదుపులోకి తీసుకున్నారు. సదరు వ్యాపారి గతంలో ఒక ఎన్‌డిపిఎస్ కేసులో రెవెన్యూ నిఘా విభాగం అరెస్టు చేసినట్లు గుర్తించారు. ఆ కేసులో అతడిని తీహార్ జైలులో ఉంచినప్పుడు.. అక్కడి వార్డెన్‌తో పరిచయం పెంచుకొని ఈ డ్రగ్స్ దందాలోకి అతడిని కూడా దించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఇక వీరితో పాటు భాగస్వామిగా ఉన్న ముంబయికి చెందిన కెమిస్ట్ మాదక ద్రవ్యాలను తయారు చేయగా.. వాటి నాణ్యతను ఢిల్లీలో ఉండే మెక్సికన్ ముఠా సభ్యుడు పరీక్షించేవాడని ఎన్‌సిబి తెలిపింది. గతంలో ఎన్‌సిబి గుజరాత్‌లోని గాంధీ నగర్, అమ్రేలి, రాజస్థాన్‌లోని జోధ్‌పూర్, సిరోహి, మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో ఇదే తరహా నిషేదిత డ్రగ్ ల్యాబ్‌లను కనుగొన్నారు.

సునీత విలియమ్స్ అంతరిక్షం నుండి దీపావళి శుభాకాంక్షలు

న్యూయార్క్: వ్యోమగామి సునీత విలియమ్స్ అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుండి దీపావళి శుభాకాంక్షలు తెలిపారు. వైట్ హౌస్‌లో దీపావళి వేడుకల సందర్భంగా సునీత అంతరిక్షం నుంచి రికార్డు చేసిన వీడియోను ప్లే చేశారు. భూమికి 260 నాటికల్ మైళ్ల దూరంలో నుంచి దీపావళి శుభాకాంక్షలు తెలపడం తనకు లభించిన అరుదైన అవకాశమని సునీత పేర్కొన్నారు. తన తండ్రి ద్వారా దీపావళి వేడుకల గురించి తెలుసుకున్నానని సునీతా విలియమ్స్ ఆ సందేశంలో పేర్కొన్నారు.

చైనాతో సత్సంబంధాలు బలోపేతం : బ్రెజిల్

బీజింగ్ : చైనా చేపట్టిన బెల్ట్ అండ్ రోడ్ ఇనీషియేటివ్ (బిఆర్‌ఐ)లో తాము చేరకపోయినా కూడా ఆ దేశంలో ప్రత్యామ్నాయ పద్ధతుల్లో సత్సబంధాలను మరింత ఉన్నతస్థాయిలో కొనసాగిస్తామని బ్రెజిల్ ప్రకటించింది. అయితే భారత్ తర్వాత ఈ మెగా ప్రాజెక్టులో చేరని రెండో బ్రిక్స్ దేశంగా బ్రెజిల్ నిలిచిందంటూ మీడియాలో కథనాలు వెల్లువెత్తాయి. బిఆర్‌ఐలో చేరరాదని బ్రెజిల్ అధ్యక్షులు లూలా డసిల్వా నిర్ణయించారని, కానీ అందుకు ప్రతిగా చైనా పెట్టుబడిదారులతో పరస్పర సహకారానికి ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించాలని ఆయన భావిస్తున్నట్లు అంతర్జాతీయ వ్యవహారాల ప్రత్యేక సలహాదారు సెల్సో అమోరిమ్ తెలిపారు. బిఆర్‌ఐలో చేరకుండానే చైనాతో సంబంధాలను కొత్త స్థాయికి తీసుకెళ్లాలని బ్రెజిల్ కోరుకుంటోందని ఆయన చెప్పారు.

సుందరయ్య స్ఫూర్తితో కొత్త రాజకీయ వ్యవస్థ

(మొదటి పేజీ తరువాయి)

సభ్యులు బి.తులసీదాస్ మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ కాలంలో శ్రీకాకుళం జిల్లా ఎందరో త్యాగధనులను అందించిందన్నారు. భావితరాలను ప్రభావితం చేసేలా స్మృతివనంలో స్వాతంత్ర్య సమరయోధుల, సంఘ సంస్కర్తల విగ్రహాలను ఏర్పాటు చేసినందుకు నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రముఖ రచయిత అట్టాడ అప్పలనాయుడు మాట్లాడుతూ ఆచరణ, ఆశయం ద్వారా ప్రజలను ప్రభావితం చేసిన మహోన్నత వ్యక్తి సుందరయ్య అని కొనియాడారు. సుందరయ్యను కీర్తిస్తూ అవధాన పండితులు పైడి హరనాథరావు గానం చేశారు. విగ్రహదాత, గరిమెళ్ల విజ్ఞాన కేంద్రం అధ్యక్షులు విజికె.మూర్తి, శిల్పి దివిలి హేమచంద్రలను శ్రీనివాసరావు శాలువా కప్పి సత్కరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు భవిరి కృష్ణమూర్తి, కె.మోహనరావు, జి.సింహాచలం, ప్రముఖ రచయిత నల్లి ధర్మారావు, గాంధీ మందిరం ప్రతినిధులు జామి భీమశంకరరావు, నటుకుల మోహన్, ఎం.ప్రసాదరావు, కొంక్యాన వేణుగోపాల్, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

మీకోసం

మలబద్ధకంతో బాధపడే చిన్నారులకు ప్రతి రోజూ ఉదయం గ్లాసు వేడి నీళ్లు తాగించాలి.

జీవన సౌరభం

సమయానికి కొలమానం సంవత్సరాలు గడిచిపోవడం కాదు. ఆ కాలంలో మనం ఏం చేశాం, ఎలా ఉన్నాం, ఏం సాధించామన్నది ముఖ్యం.

నిజమైన దీపావళి

తొమ్మిదవ తరగతి చదివే అరవింద్‌కి వాళ్ల నాన్న దీపావళి పండుగకి ఖర్చు పెట్టుకోమని రెండు వేల రూపాయలు ఇచ్చాడు. ఈ విషయం అరవింద్ తోటి మిత్రులకు చెప్పాడు. 'టపాకాయలు కొని కాలుద్దాం' అని కొందరు, "సినిమాకి వెళ్ళి ఎంజాయ్ చేద్దాం' అని మరికొందరు అన్నారు. 'బేకరికి వెళ్ళి మిఠాయిలు తిందాము' అని ఇంకొందరు చెప్పారు. అరవింద్ మాత్రం ఏం మాట్లాడలేదు.

మరుసటి రోజు అరవింద్ తరగతి గదిలో ఉండగా వినయ్ వచ్చాడు. తన వెనకాల వాళ్ల అమ్మ సుగుణ కూడా వచ్చింది. వినయ్ వారం రోజుల తర్వాత పాఠశాలకు వచ్చాడు. 'జ్వరం పూర్తిగా నయమైందా' అని మాస్టారు అడిగారు. 'జ్వరం తగ్గింది సర్, కొద్దిగా నీరసంగా ఉంది' అన్నాడు వినయ్. అక్కడి నుండి వెళ్లిపోతున్న సుగుణ, అరవింద్ దగ్గరకు వచ్చి 'థ్యాంక్స్ బాబు' అని చెప్పడం మాస్టారు గమనించారు.

విరామ సమయంలో మాస్టారు, అరవింద్‌ని పిలిచి 'ఏం జరిగింది?' అని అడిగారు. 'మాస్టారు, రెండు రోజుల క్రితం నేను వినయ్ ఇంటికి వెళ్ళాను. వాడికి జ్వరం బాగా వచ్చింది. ఆసుపత్రికి తీసుకెళ్లడానికి వాళ్ల అమ్మ దగ్గర డబ్బు లేదని తెలిసింది. వినయ్‌ని చూస్తే బాధేసింది సర్. దీపావళి కోసం మా నాన్న ఇచ్చిన డబ్బులను సుగుణమ్మ గారికి ఇచ్చాను. ఆమె వెంటనే వినయ్‌ని ఆసుపత్రికి తీసుకెళ్ళి, చికిత్స చేయించింది' అని చెప్పాడు.

అరవింద్ మాటలకు మాస్టారు సంతోషించారు. 'శభాష్, అరవింద్, దీపావళి అంటే బాణ సంచా కాల్చడం, దీపాలు వెలిగించడం, మిఠాయిలు తినడం మాత్రమే కాదు, ఆపదలో ఉన్నవారికి సహాయపడి, వారి ముఖాల్లో వెలుగులు చూడడమని నిరూపించావు' అంటూ అరవింద్‌ని భుజం తట్టి అభినందించారు.

- దుర్గమ్ భైతి,
రామునిపట్ల, సిద్దిపేట జిల్లా,
99590 07914.

పిల్లల పండుగ

పిల్లల పండుగ వచ్చింది
సందడి బాగా తెచ్చింది
వెలుగు పూలు నింపింది
దీపావళి దాని పేరండి

పిల్లల పెద్దల ఆనందం
ఉరూ వాడా సంబరం
కొత్త బట్టలతో కేరింతలు
పిండివంటలతో ఘుమ ఘుమలు

పిల్లలు మెచ్చే పండుగ
పరమత సహనం మెండుగ

చీకటిని పారద్రోలే చిచ్చుబుడ్డీ
కాంతులు చిమ్మే కాకరపువ్వొత్తి
లక్షణంగా మోత మోగే లక్ష్మి ఔటు

భూమిపైన గిర్రునా తిరిగే భూచక్రం
ఆకాశంలో అందాలు చిందే తారాజువ్వ
చిటపట్లాడే సీమాటపాకాయ దండ
ఎన్నో..మరెన్నో..

ఆనందమైన పండుగ
అందరూ మెచ్చే పండుగ!

పిల్లలూ మీరు జాగ్రత్త
టపాసులతో జర జాగ్రత్త!

పెద్దల సమక్షంలోనే
టపాసులు కాలుద్దాం!
పండగ ఆనందాన్ని
పదిలంగా ఉంచుదాం!

- ఏడుకొండలు కళ్ళేపల్లి,
మచిలీపట్నం, 94908 32338.

నేను గీసిన బొమ్మ

గాదె హాసినిరెడ్డి
మూడో తరగతి,
అరవింద హైస్కూల్,
కుంచనపల్లి.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

ప్రమాద రహిత దీపావళి లక్ష్యంగా...

పిల్లల నుంచి పెద్దల వరకూ అందరూ ఆనందంగా జరుపుకునే పండుగ దీపావళి. కొత్త దుస్తులు ధరించి టపాసులు కాల్చుతూ జీవితాల్లో వెలుగులు నింపే పండుగ. ఆనందంగా జరుపుకునే ఈ దీపావళి ఎవ్వరి జీవితాల్లో విషాధాన్ని నింపకూడదు. అందుకనే దీపావళి పండుగను సంబరంగా జరుపుకుంటూనే ప్రమాదాలు జరగకుండా మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. తద్వారా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా నివారించగలం. ఏమాత్రం అజాగ్రత్త, ఏమరపాటుతో ఉన్నా ప్రమాదాల పాలై గాయాలపాలు కావటం ఖాయం. ఇలా జరిగితే కుటుంబాల్లో విషాధం మిగులుతుంది. ఆనందాల దీపావళి అందరి ఇళ్లల్లో సరికొత్త వెలుగుల జిలుగులు నింపాలని ఆశిద్దాం. ప్రమాదాలు జరగకుండా అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ శాఖలు సంయుక్తంగా కృషిచేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవలశాఖ డైరెక్టర్ జనరల్ మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి వెల్లడించారు.

మిగతా పండుగలకు భిన్నంగా దీపావళి పండుగను జరుపుకుంటాం. మిగతా పండుగల్లో పిండివంటలు, కుటుంబాలు సంతోషంగా కలుసుకోవటాలు ఉంటాయి. ఈ దీపావళి పండుగలో అదే మందుగుండు సామాగ్రిని వెలిగించి సంతోషాలను ప్రదర్శించటం తెలిసిందే. చిచ్చుబుడ్డులు, కాకరపువ్వొత్తులు, బాంబులు, మతాబులు, టపాసులు ఇలా అనేక రకాలైన మందుగుండు సామాగ్రి పేలే స్వభావాన్ని ఉన్నవే. అందువల్ల ఎక్కువగా ప్రమాదాలు కూడా జరిగే అవకాశం ఉంటుంది. తస్మాత్ ప్రతిఒక్కరూ ఎంతో జాగురూకతతో వ్యవహరించాల్సివుంటుంది. మందుగుండు సామాగ్రి తయారీ, పంపిణీ, విక్రయాల సమయంలో కూడా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అందువల్ల ఈ మూడుచోట్ల ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవాల్సిన పౌరులుగా మనందరి బాధ్యత. వీటితోపాటుగా ప్రభుత్వం తరపున అగ్నిమాపక,పోలీసు, రెవెన్యూశాఖలు కూడా తమవంతుగా బాధ్యతను నిర్వహించాల్సివుంది. క్షేత్రస్థాయిలో అగ్నిమాపకశాఖాధికారులు లైసెన్సుల జారీలోనూ, అక్రమంగా తయారు చేసే వారిపైనా చర్యలు తీసుకోవాల్సివుంది. ఆయిల్ క్యాన్లు, గ్యాస్ సిలిండర్లు, తదితర మండే పదార్థాలకు దూరంగా టపాసులు కాల్చాలి. అందరూ ఒకేచోట గుమిగూడి కాల్చొద్దు. పొడవాటి క్యాండిల్స్, అగరవత్తులను మాత్రమే వాడి టపాసులను కాల్చాలి. కాల్చేటప్పుడు కళ్లద్దాలను ధరించటం మేలు. ప్రమాదం జరిగినప్పుడు అధైర్యపడకుండా కొద్దిసేపు ధైర్యంగా ఉండి ఆలోచన చేయటం, అగ్నిమాపకశాఖకు తెలియజేయటం ద్వారా చాలావరకూ ప్రాణనష్టం, ఆస్తినష్టం కూడా జరగకుండా కాపాడొచ్చు.

అగ్నిమాపకశాఖ సూచనలివే..

- లైసెన్సు వ్యాపారుల వద్దే మందుగుండు సమాగ్రిని కొనుగోలు చేయండి. చట్టబద్ధమైన నాణ్యమైనవి దొరుకుతాయి. ప్రమాదాలను తగ్గించటానికి ఇవి దోహదపడతాయి.
- బహిరంగ ప్రదేశాల్లోనూ బాణా సంచా కాల్చకూడదు
- భవనాలు, వాహనాలకు దూరంగా మందుగుండు సామాగ్రి పేల్చుకోవాలి
- కాల్చేటప్పుడు బక్కెట్లుతో నీటిని అందుబాటులో ఉంచుకోవాలి.
- సిల్కు దుస్తులు ధరించరాదు. వదులుగా ఉండే కాటన్ దుస్తులు ధరించాలి
- పిల్లలను పరిరక్షించాలి.
- మండేవాటిని అలా వదిలేయొద్దు. పూర్తిగా ఆరిపోయే వరకూ చూడాలి. -టపాసులు పక్క పక్కనే కాకుండా కాస్త దూరం పాటించి కాల్చుకోవటం మేలు.
- పిల్లలు, పెద్దలూ సురక్షితమైన దూరాన్ని పాటించాలి
- ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండి టపాసులు కాల్చుకోవాలి.
- గాలి వేగంగా వీస్తుంటే ఇల్లు లేదా గడ్డివాములపై పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుంది. అందువల్ల దిశను గమనిస్తూ ఉండాలి.
- మనుషులు, భవనాలు, ఇళ్లపై కాల్చిన టపాసులు పడకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.

భద్రత కోసం...

- ఇంటిలోపల టపాసులు వెలిగించొద్దు. కిటకీల దగ్గర, ఇంటి ఆవరణలోనూ వెలిగిస్తే ప్రమాదాలు జరుగుతుతాయి.
- మండే పదార్థాలు ఉండే చోట టపాసులు పెట్టొద్దు. కాల్చొద్దు. గ్యాస్ సిలిండర్లు, పెట్రో ఉత్పత్తులు, వాహనాలు ఉన్న చోట్ల కాకుండా దూరంగా వెళ్లి కాల్చాలి.
- కాలని టపాసులను మళ్లీ వెలిగించొద్దు. ఒక్కోసారి అమాంతంగా పేలే ప్రమాదం ఉంటుంది.

అగ్నిప్రమాదం సంభవించినప్పుడు తప్పించుకునే మార్గాలను అన్వేషించండి.

- నూనెదీపాలు, కొవ్వొత్తులు, ప్రత్యేకంగా కర్టెన్లు వంటి వాటికి దగ్గర పెట్టొద్దు.
- ఏదైనా గాయం లేదా శరీరం కాలితే వెంటనే వైద్యుని సహాయం తీసుకోవాలి.
- సరైన మార్గదర్శకం లేకుండా సొంత వైద్యం చేయొద్దు

-యడవల్లి శ్రీనివాసరావు

లైసెన్సు లేకుండా తయారు చేస్తే కఠిన చర్యలు

మొదటగా టపాసులు (బాణాసంచా) తయారుచేయటానికి కొంతమంది లైసెన్సులు తీసుకుంటారు. మరికొందరు అనధికారికంగా చేసేస్తుంటారు. చట్టప్రకారం లైసెన్సు తీసుకున్న వాళ్లే తయారు చేయాలి. దానికి కూడా పరిమితి ఉంటుంది. కానీ అనైతికంగా, చట్టవిరుద్ధంగా కొందరు తయారుచేస్తుండటం వల్ల ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. మరికొందరు తాత్కాలిక లైసెన్సులు పొంది తయారుచేస్తున్నారు. పద్ధతి ఏదైనా భద్రతా చర్యలు పాటించకపోతే బాణాసంచాల పేలుడు జరుగుతుంది. విద్యుద్ఘాతం వంటివి చోటుచేసుకున్నా పేలుళ్ల జరిగే ప్రమాదం ఉంటుంది. అందువల్ల జనసమ్మర్ధం ఉన్న ప్రాంతాల్లో కాకుండా దూరప్రాంతాల్లో బాణాసంచా తయారీ, గొడౌన్లలో భద్రపర్చటం ఎంతో మేలు.

పటిష్టమైన పర్యవేక్షణ వ్యవస్థ : దీపావళి పండుగ నేపథ్యంలో అగ్నిప్రమాదాల నియంత్రణకు గాను అగ్నిమాపక, పోలీసు, రెవెన్యూ, మున్సిపల్, పంచాయతీ శాఖల ద్వారా సమన్వయంతో కృషిచేస్తున్నాం.

అవుట్ బౌండ్ కాల్ సెంటర్ : మా శాఖ ద్వారా ఏర్పాటుచేసిన టోల్‌ఫ్రీ నంబరు, హెల్ప్‌లైన్‌కు వచ్చే కాల్స్‌కు సంబంధించిన ఫీడ్ బ్యాక్‌ను కూడా తీసుకుంటున్నాం. గతంలో రాష్ట్రంలో ఎక్కడ ప్రమాదం జరిగిన ఫైర్ సర్టిఫికెట్ విజయవాడ కేంద్రంలోనే ఇవ్వాల్సివచ్చేది. ఇప్పుడు ఆ విధానాన్ని మార్చాం. మంటలను ఆర్పేందుకు వెళ్లే అగ్నిమాపక సిబ్బందే వెనువెంటనే ఆ పత్రాన్ని తయారుచేసి ఇచ్చే ఏర్పాటుచేశాం. మా శాఖ ద్వారా అందుతున్న సేవల నాణ్యత గురించి తెలుసుకు నేందుకు అవుట్‌బౌండ్ కాల్ సెంటరు ద్వారా బాధితులకు ఫోన్ చేసి వివరాలను తెలుసుకుంటున్నాం. తద్వారా సేవల్లో నాణ్యత మరింతగా పెరిగింది. ఎన్ఓసిలు, ఫైర్ సర్టిఫికెట్ల జారీలోనూ, లైసెన్సుల మంజూరు విషయంలోనూ ఇదే పద్ధతి అవలంబిస్తున్నాం. చాలా మంచి ఫలితాలు వస్తున్నాయి. మా శాఖతోపాటు ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆఫ్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్ తదితర శాఖల సమన్వయంతో ప్రమాదాల నియంత్రించటానికి కృషిచేస్తున్నాం.

-మాదిరెడ్డి ప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్ జనరల్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక సేవలశాఖ సెల్ : 9441236448

జపాన్ పార్లమెంట్ ఎన్నికల ఫలితాలు - 2024

ఎల్‌డిపి/కొమెటో 218 | మొత్తం సీట్లు = 465 | ప్రతిపక్షం 247



* గెలిచిన ముగ్గురు ఎల్‌డిపి తిరుగుబాటు అభ్యర్థులను కూడా ఆ పార్టీ ఖాతాలో జమ అయ్యాయి.

ఎల్‌డిపి	కొమెటో	సిడిపి	నిప్పన్ ఐషిన్	డిపిపి
194* (256)	24 (32)	148 (98)	38 (43)	28 (7)

రెజ్వా	జపాన్ కమ్యూనిస్టు పార్టీ	శాన్‌సీటా	ఎస్‌డిపి	ఇతర పార్టీలు	ఇండిపెండెంట్లు
9 (3)	8 (10)	3 (1)	1 (1)	3 (0)	9 (14)

(జపాన్ టైమ్స్ సౌజన్యంతో)

జపాన్ ఎన్నికల్లో 8 సీట్లు గెలుచుకున్న కమ్యూనిస్టు పార్టీ

టోక్యో : తాజా పార్లమెంట్ ఎన్నికల్లో జపాన్ కమ్యూనిస్టు పార్టీ 8 సీట్లు గెలుచుకుంది. గత పార్లమెంట్‌లో 10 సీట్లు గెలుచుకున్న పార్టీ ఈసారి రెండు సీట్లను కోల్పోయింది. అయితే మొత్తమ్మీద ఈ ఎన్నికల ఫలితాన్ని "చారిత్రక ఓటు"గా పార్టీ స్వాగతించింది. జపాన్‌లో పరిస్థితి నాటకీయంగా మారిపోయిందని పార్టీ వ్యాఖ్యానించింది. "ఎల్‌డిపి రాజకీయాల స్థానే కొత్త రాజకీయాలను అన్వేషించేందుకు ప్రజలకు కొత్త రాజకీయ క్రమం ప్రారంభమైందని ఇది రుజువు చేస్తోంది." అని పేర్కొంది. కార్పొరేట్ ప్రయోజనాలకు ప్రభుత్వ ప్రాధాన్యతను సవాలు చేయడంపై తాము దృష్టి కేంద్రీకరిస్తామని పేర్కొంది. అమెరికాతో బేషరతు పొత్తు ప్రాతిపదికగా యుద్ధ రాజ్యాన్ని అనుసరించడాన్ని కూడా సవాలు చేయనున్నట్లు జపాన్ కమ్యూనిస్టు పార్టీ పేర్కొంది.

పది రోజుల్లో 'తండేల్' చిత్రీకరణ పూర్తి

నాగచైతన్య హీరోగా, సాయిపల్లవి హీరోయిన్‌గా నటిస్తున్న తాజా చిత్రం 'తండేల్'. చందూ మొండేటి దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కుతోంది. దాదాపు షూటింగ్ పూర్తయ్యిందనీ, మిగిలిన భాగాన్ని రాబోయే పదిరోజుల్లో పూర్తిచేస్తామని దర్శకుడు అప్‌డేట్ ఇచ్చారు. జనవరికి సిద్ధంగా ఉన్నామనీ, సంక్రాంతికి రామ్‌చరణ్, వెంకటేష్ సినిమాలు వస్తే..ఈ సినిమా కొంచెం వాయిదా పడుతుందని పేర్కొన్నారు. జనవరి 26న విడుదల చేస్తామనుకుంటే ఆదివారం కాబట్టి చేయలేకపోతున్నామనీ, సంక్రాంతికి ముందే చేద్దామంటూ సినిమా కంప్లీట్ కాదని పేర్కొన్నారు. ఈ సినిమాలో ఎన్నో భావోద్వేగాలు ఉన్నాయని వివరించారు. ఖచ్చితంగా అన్ని తరగతుల ప్రేక్షకులు మెచ్చేలా సరికొత్త కథాంశంతో తెరకెక్కిస్తున్నామన్నారు.

కొత్త రిలీజ్ డేట్‌లో 'జీబ్రా'

సత్య దేవ్, డాలీ ధనంజయ కలిసి నటించిన మల్టీ-స్టారర్ చిత్రం 'జీబ్రా'. లక్ ఫేవర్స్ ది బ్రేవ్ అనేది ట్యాగ్‌లైన్. ఈశ్వర్ కార్తీక్ దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని పద్మజ ఫిలింస్ ప్రైవేట్ లిమిటెడ్, ఓల్డ్ టౌన్ పిక్చర్స్ బ్యానర్లపై ఎస్ఎన్ రెడ్డి, ఎస్.పద్మజ, బాల సుందరం, దినేష్ సుందరం నిర్మించారు. తాజాగా చిత్రబృందం ఈ చిత్రం నుండి ప్రధాన పాత్రలను పరిచయం చేస్తూ మోషన్ పోస్టర్ విడుదల చేసారు. గతంలో ఈ సినిమా అక్టోబర్ 31న అన్ని దక్షిణ భారత భాషల్లో, హిందీలో థియేటర్లలోకి రానుందని వెల్లడించారు. అయితే మోషన్ పోస్టర్‌లో ఈ సినిమా కొత్త రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటించారు. నవంబరు 22న ఈ సినిమాని విడుదల చేస్తున్నట్టు ప్రకటించారు.

'కాలభైరవ'గా లారెన్స్

మంగళవారం రాఘవ లారెన్స్ పుట్టినరోజు సందర్భంగా రమేష్ వర్మ దర్శకత్వం వహిస్తున్న సినిమాకు సంబంధించి కీలక అప్ డేట్ ఒకటి బయటికి వచ్చింది. లారెన్స్ కెరియర్‌లో 25వ సినిమాగా వస్తున్న ఈ సినిమాకు 'కాలభైరవ' అనే టైటిల్ ఫిక్స్ చేస్తూ పోస్టర్ రిలీజ్ చేశారు నిర్మాతలు. అత్యంత భారీ వ్యయంతో ఈ ప్రాజెక్టును తెరకెక్కించనున్నారు. వచ్చే నవంబర్‌లో షూటింగ్‌ను ప్రారంభించి 2025 సమ్మర్‌లో విడుదల చేయటానికి మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ ప్రాజెక్టు గురించి మరిన్ని విషయాలను త్వరలోనే ప్రకటించనున్నారు. ఎ స్టూడియోస్ ఎల్ ఎల్ పీ, నీలాద్రి ప్రొడక్షన్స్, హవీష్ ప్రొడక్షన్స్ కలిసి ఈ సినిమా నిర్మిస్తున్నారు.

కొత్త ఆర్టిస్టులను ప్రోత్సహిస్తున్నాం : గోపాలకృష్ణారెడ్డి

'నాకు చిన్నప్పటి నుంచి పాటలు వినడం ఇష్టం. అలా సినిమాలపై ఆసక్తి ఏర్పడింది. వృత్తిపరంగా వ్యాపార వేత్తగా మారినా సినిమాలపై ఇంట్రెస్ట్ అలానే ఉండిపోయింది. కొత్త వాళ్లను ఎంకరేజ్ చేయాలనే సినిమా రంగంలోకి వచ్చాను. ఆర్టిస్టులు పేరు తెచ్చుకున్న తర్వాత ఫలానా ప్రొడ్యూసర్ మాకు అవకాశం ఇచ్చారని చెప్పుకుంటే చాలు. నాకు ఇందులో డబ్బులు సంపాదించాలని కాదు. పదిమందికి మంచి చేయాలనే ఉద్దేశ్యంతో, ఉపాధి కల్పించాలనే కోరికతో ఈ రంగాన్ని ఎంచుకున్నాను' అని 'క' సినిమా నిర్మాత గోపాలకృష్ణారెడ్డి చెప్పారు. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన తాజా చిత్రం 'క'. నయన్ సారిక, తన్వీరామ్ హీరోయిన్‌గా నటించారు. సుజీత్, సందీప్ దర్శకత్వం వహించారు. దీపావళి కానుకగా ఈనెల 31న ఈ చిత్రం విడుదల కానుంది. ఈ సందర్భంగా గోపాలకృష్ణారెడ్డి మీడియాతో మాట్లాడుతూ పై విధంగా స్పందించారు.

మంధాన మెరుపు శతకం

- మూడో వన్డేలో ఆరు వికెట్ల తేడాతో న్యూజిలాండ్‌పై గెలుపు
- వన్డే సిరీస్ 2-1తో టీమిండియా కైవసం

అహ్మదాబాద్: టి20 మహిళల ప్రపంచకప్ ఛాంపియన్స్‌కు భారత మహిళల జట్టు దిమ్మదిరిగే షాకిచ్చింది. ఆ టోర్నమెంట్‌లో ఎదురైన ఓటమిని అధిగమించి వన్డే సిరీస్‌ను చేజిక్కించుకుంది. అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోడీ స్టేడియంలో న్యూజిలాండ్ మహిళలతో మంగళవారం జరిగిన మూడో, చివరి వన్డేలో టీమిండియా ఆరు వికెట్ల ఘన విజయం సాధించింది. న్యూజిలాండ్ నిర్దేశించిన 233పరుగుల పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓపెనర్ స్మృతి మంధాన(100) సెంచరీకి తోడు.. హర్మన్‌ప్రీత్ కౌర్(59నాటౌట్) జట్టును విజయ తీరాలకు చేర్చారు. దీంతో మూడు వన్డేల సిరీస్‌ను టీమిండియా 2-1తో సొంతం చేసుకుంది.

అంతకుముందు టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్‌ను భారత బౌలర్లు కట్టడి చేశారు. కివీస్ 24 పరుగుల వద్ద ఓపెనర్ సుజీ బేట్స్(4) వికెట్ కోల్పోయింది. జెమీమా రోడ్రిగ్స్ మెరుపు త్రోతో ఆమె రనౌట్ అయింది. అనంతరం ప్రియా మిశ్రా (2/41)తిప్పేయడంతో ఓపెనర్ జార్జియా ప్లిమ్మర్(39), కెప్టెన్ సోఫీ డెవినె(9)లు వెనుదిరిగారు. ఆ తర్వాత డేంజరస్ లారెన్ డౌన్(1)ను పేసర్ సైమా థాకూర్ వెనక్కి పంపింది. దాంతో, 88 పరుగులకే కివీస్ 5 వికెట్లు కోల్పోయింది. మ్యాడీ గ్రీన్(15), ఇసాబెల్లా గేజ్(39)లతో కలిసి స్కోర్ బోర్డును పరుగులు పెట్టించారు. మూడు భారీ సిక్సర్లు బాదిన హల్లిడే సెంచరీకి ముందు దీప్తి శర్మ ఓవర్లో రాధా యాదవ్ చేతికి చిక్కింది. రేణుకా వేసిన 49వ ఓవర్ ఆఖరి బంతిని తహుహు సిక్సర్‌గా మలిచింది. సైమా వేసిన 50వ ఓవర్లో బౌండరీ బాదిన లిహిహు జట్టు స్కోర్ 230 దాటించింది. హల్లిడే, తహుహుల పోరాటంతో భారత్‌కు కివీస్ 233 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. దీప్తి శర్మకు మూడు, ప్రియా మిశ్రాకు రెండు, రేణుక, సైమాకు ఒక్కో వికెట్ దక్కాయి.

ఛేదనలో టీమిండియా స్టార్ షెఫాలీ వర్మ(12) నిరాశపరిచినా.. మంధాన మెరుపు శతకంతో రాణించింది. మంధాన 122బంతుల్లో 10 ఫోర్ల సాయంతో 100 పరుగులు పూర్తి చేసుకొని హనా రౌస్ బౌలింగ్‌లో బౌల్డ్ అయ్యింది. యాస్తికా(35), హర్మన్(59నాటౌట్), రోడ్రిగ్స్(22) టీమిండియా గెలుపులో కీలకపాత్ర పోషించారు. దీంతో భారత్ 44.2ఓవర్లలో 4వికెట్ల నష్టానికి 236 పరుగులు చేసింది. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ మంధానాకు, సిరీస్ దీప్తి శర్మకు దక్కాయి.

స్కోర్‌బోర్డు...

న్యూజిలాండ్ మహిళల ఇన్నింగ్స్: సూజీ బేట్స్ (రనౌట్) రోడ్రిగ్స్/యాస్టికా 4, ప్లిమెర్ (సి)దీప్తి (బి)ప్రియా మిశ్రా 39, లారెన్ డౌన్ (సి)యాస్టికా భాటియా (బి)సైమా ఠాకూర్ 1, సోఫీ డివైన్ (బి)ప్రియా మిశ్రా 9, బ్రూక్ హల్లిడై (సి)రాధా యాదవ్ (బి)దీప్తి శర్మ 86, గ్రీన్ (రనౌట్) రోడ్రిగ్స్/యాస్టికా 15, ఇసాబిల్లా గాజే (సి అండ్ బి)దీప్తి 25, హన్నాహ్ రో (ఎల్‌బి)దీప్తి 11, లీ తహుహు (నాటౌట్) 24, ఈడెన్ కార్సన్ (సి)రాధా యాదవ్ (బి)రేణుకా సింగ్ 2, ఫ్రాన్ జొనాస్ (రనౌట్) సైమా ఠాకూర్ 2, అదనం 14. (49.5ఓవర్లలో ఆలౌట్) 232పరుగులు. **వికెట్ల పతనం:** 1/24, 2/25. 3/36, 4/66, 5/88, 6/152, 7/199, 8/210, 9/219, 10/232 **బౌలింగ్:** రేణుకా సింగ్ 10-1-49-1, సైమా ఠాకూర్ 9.5-1-44-1. ప్రియా మిశ్రా 10-1-41-2, దీప్తి శర్మ 10-2-39-3, రాధా యాదవ్ 4-0-21-0, హర్మన్‌ప్రీత్ 6-0-34-0

ఇండియా మహిళల ఇన్నింగ్స్: మంధాన (బి)హన్నాహ్ రో 100, షెఫాలీ వర్మ (సి)ఇసాబెల్లా గాజే (బి)హన్నాహ్ రో 12, యాస్టికా భాటియా (సి అండ్ బి)సోఫియా డివైన్ 35, హర్మన్‌ప్రీత్ (నాటౌట్) 59, రోడ్రిగ్స్ (ఎల్‌బి)ఫ్రాన్ జొనాస్ 22, తేజల్ (నాటౌట్) 0, అదనం 8. (44.2 ఓవర్లలో 4వికెట్ల నష్టానికి) 236పరుగులు. **వికెట్ల పతనం:** 1/16, 2/92, 3/209, 4/232 **బౌలింగ్:** తహుహు 6-0-30-0, హన్నాహ్ 8-0-47-2, సోఫీ 7.2-0-44-1, బేట్ 4-0-18-0, ఫ్రాన్ 9-1-50-1.

హిమాచల్‌ప్రదేశ్ జట్టు విజయం

- జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించిన కెప్టెన్ రిషిధావన్

ప్రజాశక్తి-మధురవాడ (విశాఖపట్నం)

రంజీ ట్రోఫీ మూడో లీగ్ మ్యాచ్‌లోనూ ఆంధ్ర ఆటతీరు మారలేదు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ హిమాచల్‌ప్రదేశ్ జట్టు చేతిలో ఆంధ్ర జట్టు ఇన్నింగ్స్ 38 పరుగుల తేడాతో ఘోర పరాజయాన్ని చవిచూసింది. విశాఖపట్నం పీఎం పాలెంలోని ఏసీఏ-వీడీసీఏ క్రికెట్ స్టేడియంలో మంగళవారం జరిగిన ఎలైట్ గ్రూపు-బిలో హిమాచల్‌ప్రదేశ్ బౌలర్ల ధాటికి ఆంధ్ర జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 118పరుగులకే కుప్పకూలింది. ఆల్‌రౌండ్ ప్రతిభ చూపిన రిషి ధావన్ (195పరుగులు, 3/80వికెట్లు) ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచాడు.

అంతకుముందు హిమాచల్ ప్రదేశ్ తొలి ఇన్నింగ్స్‌లో 158 ఓవర్లలో 500 పరుగుల భారీ స్కోర్ సాధించింది. జట్టులో కెప్టెన్ రిషిధావన్ అద్భుతమైన ఇన్నింగ్స్ ఆడి జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు. 318 బంతుల్లో 19 బౌండరీలు, 2 సిక్సర్ల సహాయంతో 195 పరుగులు చేసి, తృటిలో డబుల్ సెంచరీ చేజార్చుకున్నాడు. ఆకాష్ వశిష్ఠ్ 85, అంకిత్ ఆర్ కల్సీ 53, ముకుల్ నేగి 42 పరుగులు చేశారు. ఆంధ్ర జట్టు బౌలర్లలో కేవీ శశికాంత్ 5 వికెట్లతో ఆకట్టుకున్నాడు. సత్యనారాయణ రాజు 3, విజయ్, మనిష్ చెరో వికెట్ తీసుకున్నారు. ఆంధ్ర జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 344 పరుగులు చేయడంతో 156 పరుగులు వెనుకబడింది. హిమాచల్‌ప్రదేశ్ బౌలర్లు వినయ్ గెలిటియా, మయాంక్ దగార్ ధాటికి ఆంధ్ర జట్టు రెండో ఇన్నింగ్స్‌లో 118 పరుగులకు ఆలౌట్ అయ్యింది. వినయ్ 5, మయాంక్ దగార్ 4 వికెట్లు తీసుకున్నారు. ఆంధ్ర జట్టులో కెప్టెన్ ఎస్.కె. రషీద్ 34, హనుమ విహారి 20, మనిష్ 23, అశ్విన్ హెబ్బార్ 17 పరుగులు చేశారు.

స్టబ్స్, జోర్జి సెంచరీలు

దక్షిణాఫ్రికా 307/2 • బంగ్లాదేశ్‌తో రెండో టెస్ట్

ఛట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్ట్‌లో దక్షిణాఫ్రికా బ్యాటర్లు సెంచరీలతో కదం తొక్కారు. ఈ జోడీ తొలి రోజు బంగ్లాదేశ్ బౌలర్లను ఉతికేస్తే ఓపెనర్ టోనీ డీ జోర్జి(141 నాటౌట్), యువకెరటం ట్రిస్టన్ స్టబ్స్(106)లు శతకాలతో చెలరేగారు. కెప్టెన్ మార్క్రమ్(33) నిరాశపరిచినా.. రెండో వికెట్‌కు ఈ జోడీ ఏకంగా 201పరుగుల భారీ భాగస్వామ్యాని నెలకొల్పింది. బంగ్లా బౌలర్లపై ఎదురుదాడికి దిగి స్టబ్స్ కెరీర్‌లో తొలి వంద కొట్టేసి బంగ్లాను వణికించాడు. మరోవైపు జోర్జి సెంచరీ తర్వాత కూడా దంచుడు ఆపలేదు. దాంతో, తొలిరోజు ఆట ముగిసే సరికి మర్క్రమ్ సేన 2 వికెట్ల నష్టానికి 307 పరుగులు చేసింది. టోనీ డి జోర్జి(141నాటౌట్; 198బంతుల్లో 6ఫోర్లు, 3సిక్సర్లు), ట్రిస్టన్ స్టబ్స్(106; 211బంతుల్లో 10ఫోర్లు, 3సిక్సర్లు)లు ఆకాశమే హద్దుగా చెలరేగారు. క్రీజ్‌లో జోర్జికి తోడు బడింగ్హామ్(18) ఉన్నారు. తైజుల్‌కు రెండు వికెట్లు దక్కాయి.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68